ఆంధ్రభూమి

సంపుటి 59 సంచిక 121 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | గురువారం 31 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం
తిథి: బహుళ ఏకాదశి రా.7.15
నక్షత్రం: జ్యేష్ఠ రా.8.58, వర్జ్యం: లేదు
దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48 వరకు, తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు
రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు
విశేషాలు: సర్వేషాం ఏకాదశి

చలితో జనం గజగజ

- మరింత పెరగనున్న చలి
- వాతావరణ శాఖ వెల్లడి



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో చలి మరింత పెరగనున్నదని హైదరాబాద్ వాతావరణ పరిశోధనా కేంద్రం తెలిపింది. ఉత్తరాది నుంచి ఈశాన్య దిశగా వీస్తున్న గాలుల ప్రభావం వల్ల తెలంగాణలో చలి గాలుల ప్రభావం మరింత ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ డైరెక్టర్ నాగరత్న తెలిపారు. మరో 48 గంటల పాటు తెలంగాణతో పాటు కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉందని చెప్పారు. ఇలాఉండగా వారం రోజులుగా వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. మూడు రోజుల పాటు వర్షం, సాధారణం కన్నా కనిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఆదిలాబాద్‌లో అత్యల్పంగా 7 డిగ్రీలు, - మిగతా 6లో

నేటి నుంచి విద్యుత్ 'కోతలు'

- తాల్చేరు గ్రిడ్‌కు మరమ్మతులు
- ఫిబ్రవరి 6 వరకూ అమలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: తెలంగాణలో గురువారం నుంచి అనధికారిక విద్యుత్ కోతలు అమలుకానున్నాయి. ఫిబ్రవరి 6వ తేదీ వరకూ ఇవి కొనసాగుతాయని ట్రాన్స్‌కో,జెన్‌కో అధికారులు చెబుతున్నారు. ఛత్తీస్‌గఢ్, రామగుండం, కాకతీయ థర్మల్ కేంద్రాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ ఉత్పత్తిని షట్‌డౌన్ చేశారు. ఒడిశాలోని తాల్చేర్ ఎన్‌టీపీసీ థర్మల్ కేంద్రం నుంచి కర్నాటక కోలార్ విద్యుత్ గ్రిడ్‌కు రోజూ 1000- 2000 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా జరుగుతోంది. తాల్చేర్ థర్మల్ విద్యుత్ కేంద్రంలో 500 మెగావాట్లకు సంబంధించిన మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. దీంతో తెలంగాణకు రావాల్సిన విద్యుత్ వాటాలో కోత తప్పలేదని అధికారులు స్పష్టం చేశారు. తూర్పు - మిగతా 6లో

ఘనగామా



మేకిన్ ఇండియా, స్వచ్ఛ భారత్, నోట్ల రద్దుతో బాగా తెలిసొచ్చినట్లుంది..!!

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో

భారీ అగ్ని ప్రమాదం

కాలిబూడిదైన 400 స్టాల్స్

- ఆంధ్రాబ్యాంక్ స్టాల్‌లో షార్ట్ సర్క్యూట్
- భయంతో పరుగులు తీసిన సందర్శకులు



నుమాయిష్‌లో ఎగిసిపడుతున్న మంటలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బుధవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దాదాపు 400 స్టాళ్ళకు పైగా అగ్నికీలల్లో కాలిబూడిదయ్యాయి. స్టాళ్లలో ఉన్న గ్యాస్ సిలిండర్‌లు పేలడంతో ఎగ్జిబిషన్‌లో అన్ని స్టాళ్ళకు అగ్నికీలలు వ్యాపించాయి. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడడంతో సందర్శకులకు దిక్కుతోచక పరుగుతీశారు. తొక్కిసలాటలో మహిళలు, పిల్లలు కిందపడి గాయాలపాలయ్యారు. లక్షలాది రూపాయల పెట్టుబడితో స్టాళ్ళు ఏర్పాటు చేశామని, అగ్ని ప్రమాదంతో తమ కుటుంబాలు బజారున పడ్డామని నిర్వాహకులు లబోదిబోమన్నారు. బుధవారం ఒక్కరోజు దాదాపు 20 వేలకు పైగా సందర్శకులు ఎగ్జిబిషన్‌కు వచ్చినట్లు నిర్వాహకులుచెప్పారు. మంటలను ఆర్పడానికి 10 అగ్నిమాపక యంత్రాలు ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాకపోవడంతో ఆస్తినష్టం భారీగా జరిగిందని పోలీసులు చెబుతున్నారు. రాత్రి ఎనిమిదిన్నర నుంచి తొమ్మిది గంటల మధ్య అన్ని స్టాళ్ల మధ్య సందర్శకులు కిక్కిరిసి ఉన్న సమయంలో ఆంధ్రాబ్యాంక్ స్టాల్‌లో ఉన్నట్టుండి షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. ఆ - మిగతా 6లో



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



సంఘటనా స్థలం నుండి పరుగులు తీస్తున్న జనం

ప్రమాదానికి కారణమేమిటి?

ఈ భారీ అగ్ని ప్రమాదం సంభవించేందుకు కారణాలేమిటి అన్న అంశంపై విభిన్న కథనాలు విన్పిస్తున్నాయి. ఒక స్టాల్‌లో కాలుతున్న అగర్‌బత్తి వస్త్రంపై పడటంతో మంటలు వ్యాపించాయని కొందరు చెబుతుండగా, మహేష్ బ్యాంక్ గానీ, ఆంధ్రాబ్యాంకుకు చెందిన స్టాల్‌లోగానీ తొలుత షార్ట్ సర్క్యూట్ జరగటంతో ప్రమాదం చోటుచేసుకుందని మరికొందరు చెబుతున్నారు. ఏదిఏమైనా భారీగా ఉత్పత్తులను నిల్వ చేసుకునే స్టాళ్లలో ముందుగా జాగ్రత్త చర్యగా ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను నెలకొల్పడంలో, కనీసం చిన్న ప్రమాదం జరిగినపుడు క్షణాల్లో మంటలను ఆర్పేందుకు వీలుగా ఫైర్ ఇంజన్ కూడా చేరుకోని విధంగా ఎగ్జిబిషన్ సొసైటీ స్టాళ్లను ఏర్పాటు చేయటమే కారణమని మరికొందరు వాదిస్తున్నారు. ఒక స్టాల్‌లో స్వల్పంగా సంభవించిన అగ్నిప్రమాదాన్ని కొద్దిపాటి నీటితో ఆర్పే - మిగతా 6లో

మందిరం కట్టేస్తాం

- 21న శంకుస్థాపనకు ధర్మ్ సంసద్ ఏకగ్రీవ తీర్మానం
- కేంద్రానికి, ఆర్‌ఎస్‌ఎస్‌కు సవాలే



ప్రయాగరాజ్ (ఉత్తరప్రదేశ్), జనవరి 30: వివాదాస్పదమైన అయోధ్య రామజన్మభూమిలో మందిర నిర్మాణానికి ఫిబ్రవరి 21న శంకుస్థాపన చేయాలని ధర్మ్ సంసద్ సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఒకవైపు కేంద్ర ప్రభుత్వానికి, మరోవైపు బీజేపీని శాసిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌కు సవాళ్లు విసురుతూ ధర్మ్ సంసద్ ఈ సంచలన నిర్ణయాన్ని ప్రకటించింది. శంకరాచార్య స్వరూపానంద సరస్వతి శంకుస్థాపన చేస్తారని స్పష్టం చేసింది. కుంభమేళా సందర్భంగా, ప్రయాగరాజ్‌లో మూడురోజులపాటు జరిగిన ధర్మ్ సంసద్ సమావేశం బుధవారం ముగిసింది. రామజన్మభూమి సహా పలు అంశాలను మూడురోజుల పాటు ధర్మ్ సంసద్ చర్చించింది. హిందుత్వంపై ఆర్‌ఎస్‌ఎస్‌కు గుత్తాధిపత్యం ఏమీలేదని నిరూపించే దిశగా ధర్మ్ సంసద్ అడుగులు వేసింది. అందుకే రామాలయానికి శంకుస్థాపన సంఘ్‌పరివార్‌తో కాకుండా శంకరాచార్య స్వరూపానంద సరస్వతితో చేయించాలని తీర్మానించింది. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ హిందూ ఆధ్యాత్మిక గురువులందరూ స్వరూపానంద సరస్వతి అడుగుజాడల్లో నడుస్తారని అభిప్రాయపడింది. అయోధ్యలోని వివాదాస్పదం కాని భూమిని హక్కుదారులకు అప్పగించాలని కోరుతూ సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం పిటిషన్‌ను దాఖలు చేసిన మరుసటిరోజే ధర్మ్ సంసద్ రామ మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు తేదీని ఖరారు చేస్తూ సంచలన ప్రకటన చేయడం గమనార్హం. ఇటు బీజేపీ, అటు ఆర్‌ఎస్‌ఎస్ కూడా రామజన్మ భూమి వివాదానికి చట్టపరమైన మార్గాలు అనుసరిస్తుండగా, - మిగతా 6లో

వీవీ ప్యాట్‌లపై వివరణ ఇవ్వండి

ఈసీకీ హైకోర్టు ఆదేశం 6

టీఆర్‌ఎస్‌దే హవా

ముగిసిన పంచాయతీ పోరు

- రాష్ట్రవ్యాప్తంగా 88.03 శాతం పోలింగ్
- అత్యధికంగా యాదాద్రి జిల్లాలో 94.99 శాతం
- అత్యల్పంగా జగిత్యాల జిల్లాలో 77.70 శాతం
- కొత్త పంచాయతీలకు 2న అపాయింట్‌మెంట్ డే





మూడో విడత పంచాయతీ ఎన్నికల సందర్భంగా బుధవారం కరీంనగర్ జిల్లా ఇల్లందకుంటలో బారులుతీరిన ఓటర్లు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: పంచాయతీ ఎన్నికల పోరు ముగిసింది. మూడవ దశ ఎన్నికలు బుధవారం ముగియడంతో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పరిసమాప్తం అయింది. మూడు దశల్లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సాఫీగా ముగియడంతో అధికార యంత్రాంగానికి ఉరటను ఇచ్చింది. పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీలు అధికారికంగా కొలువుదీరడానికి ఫిబ్రవరి 2వ తేదీన 'అపాయింట్మెంట్ డే'గా నిర్ణయిస్తూ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ నీతూ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి, రెండో దశలో జరిగిన ఎన్నికల మాదిరిగానే అధికార టీఆర్‌ఎస్ పార్టీ మూడవ దశలోనూ తన ఆధిక్యతను చాటుకుంది. మొత్తం పంచాయతీల్లో నాలుగింట మూడవ వంతు స్థానాలను కైవసం చేసుకోవడం పట్ల అధికార టీఆర్‌ఎస్ పార్టీలో విజయదరహాసం తొణికిసలాడుతోంది. ఇదే జోరును రాబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ చాటేందుకు పంచాయతీ ఫలితాలు స్ఫూర్తినిస్తాయని టీఆర్‌ఎస్ భావిస్తోంది. ఇలా ఉండగా పంచాయతీ ఎన్నికలకు తుది దశ అయిన మూడవ దశలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 88.03 శాతం పోలింగ్ నమోదు అయింది. మొదటి దశలో జరిగిన ఎన్నికల్లో 85.76 శాతం, రెండో దశలో జరిగిన ఎన్నికల్లో 88.26 శాతం పోలింగ్ నమోదు అయిన విషయం తెలిసిందే. మూడవ దశలో 4116 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా ఇందులో 577 సర్పంచ్‌లు, 8,956 వార్డులకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. కాగా మిగిలిన వాటికి బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించి మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. రాత్రి పది గంటల వరకు అందిన - మిగతా 6లో

ఆఖరి పోరాటం

నేటినుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ❖ వ్యూహాలకు పదును పెడుతున్న అధికార, విపక్షాలు



ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 30: రేపటి నుండి ప్రారంభమవుతున్న పదహారవ లోక్‌సభ ఆఖరు పార్లమెంటు ఇంటరిం బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్షం, అధికార పక్షం మధ్య వివిధ అంశాలపై హోరాహోరీ పోరాటం జరగనున్నది. ఎన్‌డీఏ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రతిపాదించటం ద్వారా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోందంటూ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను తిప్పికొతుడూ, తాము కేవలం తాత్కాలిక ఇంటరిం బడ్జెట్‌ను మాత్రమే ప్రతిపాదిస్తున్నామని ఆర్థిక శాఖ తాత్కాలిక బాధ్యతలు నిర్వహిస్తున్న రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు, అయోధ్యలో రామమందిర నిర్మాణంపై బీజేపీని బోనెక్కించేందుకు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు సిద్ధమవుతుంటే.. ప్రభుత్వం వీటిని తప్పికొట్టేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. కాగ్ నివేదికను పార్లమెంటులో ప్రతిపాదించటం ద్వారా రాఫెల్‌పై కాంగ్రెస్ వాదనను దెబ్బతీసేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోంది. మోదీ ప్రభుత్వం రైతుల ప్రయోజనాల పరిరక్షణకోసం 'రైతుబంధు' పథకాన్ని ప్రకటించే అవకాశాలున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రభుత్వం అమలు చేసిన 'రైతుబంధు'లాంటి పథకాన్ని మోదీ ప్రభుత్వం ఇంటరిం బడ్జెట్‌లో ప్రతిపాదించవచ్చునని అంటున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గురువారం ఉదయం పదకొండు గంటలకు పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ఉభయ సభల సభ్యుల సంయుక్త సమావేశంలో ప్రసంగించటం ద్వారా పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు శ్రీకారం చుడతారు. అనంతరం ఐదు నిమిషాలకు ఉభయ సభలు సమావేశం అవుతాయి. రక్షణ శాఖ మాజీ మంత్రి జార్జి ఫెర్నాండేజ్‌తోపాటు పలువురు ఇతర మాజీ ఎంపీల మరణం పట్ల సంతాపం తెలిపిన అనంతరం ఆర్థిక శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆర్థిక సర్వేను లోక్‌సభలో ప్రతిపాదిస్తారు. శుక్రవారం ఉదయం లోక్‌సభలో ఓట్ ఆన్ అకౌంట్ ఇంటరిం బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్‌లో కొత్త పథకాలు, పన్ను రాయితీలు ప్రకటించే పక్షంలో ప్రతిపక్షం తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేయడం ఖాయం. ఎన్‌డీఏ ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఎలాంటి కొత్త పథకాలు ప్రకటించకూడదు.. పన్ను రాయితీలు ఇవ్వకూడదని కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాలు ఇదివరకే స్పష్టం చేశాయి. అయితే ఎన్‌డీఏ ప్రభుత్వం కొత్త ప్రథకాలు ప్రకటించటంతోపాటు పన్ను రాయితీలు ఇస్తుందా? అనేది వేచి చూడవలసిందే. మోదీ ప్రభుత్వం ముఖ్యంగా ఆదాయం పన్ను రాయితీలు ప్రకటించే అవకాశాలున్నాయని ఆర్థిఖ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ట్రిపుల్ తలాక్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం తీసుకునేందుకు మరోసారి ప్రయత్నిస్తుంది. లోక్‌సభ ఆమోదించిన ట్రిపుల్ తలాక్ బిల్లుపై రాజ్యసభలో తీవ్రస్థాయిలో గొడవ జరగటం తెలిసిందే. రాజ్యసభ ఈ బిల్లుపై చర్చ జరిపి ఆమోదించవలసి ఉన్నది. అయితే కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ఈ సమావేశాల్లో - మిగతా 6లో



బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం పార్లమెంట్ భవన్‌లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్



మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బాపూఘాట్‌లో నివాళి అర్పిస్తున్న హోమ్‌మంత్రి మహమూద్ అలీ. విధాన సభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మండలి చైర్మన్ స్వామిగౌడ్, సీఎస్ జోషి, హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, సికిందరాబాద్ ఎంపీ బండారు దత్తాత్రేయ

నేడు భారత్ బంద్

★ మావోల పిలుపుతో పోలీసులు అప్రమత్తం
★ దండకారణ్యంలో పోలీస్ వర్సెస్ మావోయిస్టులు
★ తెలంగాణ సరిహద్దులో తనిఖీలు ముమ్మరం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: కేంద్రంలో అధికార బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామిక పద్ధతుల్లో పౌర హక్కులను అణచివేయడానికి చేస్తున్న ప్రయత్నాలకు నిరసనగా మావోయిస్టులు గురువారం భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. మతోన్మాద భావజాలంతో బీజేపీ హింసను ప్రోత్సహిస్తోందని మావోయిస్టులు మండిపడుతున్నారు.

భారత్ బంద్ సందర్భంగా మావోయిస్టులు వరంగల్, ఖమ్మం జిల్లాల్లో విధ్వంసక చర్యలకు పాల్పడ్డారు. వాజేడు వెంకటాపురం, వాజేడు నూగనూరు మండలాల్లో పోలీస్ బలగాలు భారీగా మోహరించాయి. ఉత్తర తెలంగాణ దండకారణ్యంలో బంద్ సందర్భంగా ఏంజరుగుతుందోనని గిరిజనులు భయంతో వణికిపోతున్నారు.

దండకారణ్యంలో పోలీస్ వర్సెస్ మావోయిస్టులు మధ్య పోరు దేనికి దారితీస్తోందోనని స్థానికులు భయంగుప్పెట్లో ఉన్నారు. చత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టు దళాలు రావచ్చు అన్న అనుమానంతో తెలంగాణ సరిహద్దుల్లో పోలీస్ గస్తీని పటిష్టం చేశారు. వరంగల్, ఖమ్మం జిల్లాలో రాత్రి బస్సు సర్వీస్‌లను అనధికారికంగా రద్దు చేశారు. మంగళవారం భద్రాచలం చింతూరు జాతీయ రహదారిపై వెళుతున్న ఆర్టీసీ బస్సు, లారీలను మావోయిస్టులు దగ్ధం చేశారు. మావోయిస్టుల కదలికలపై పోలీస్ నిఘా పెంచారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలైన కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పూర్తి అప్రమత్తత పాటిస్తున్నారు. తెలంగాణ పట్టణ ప్రాంతాల్లో కూడా పోలీస్ పహార ఏర్పాటు చేశారు. పౌరహక్కుల నేతలు, ప్రజా సంఘాల నేతలు బంద్‌కు సహకరిస్తారన్న అనుమానంతో పోలీసులు ఆయా వర్గాలపై నిఘా ఉంచారు.

ఏజెన్సీలో అలజడి

ఆంధ్రభూమి బ్యూరో

ఖమ్మం, జనవరి 30: మావోయిస్టుల వరుస చర్యలతో ఏజెన్సీ ఉద్రిక్తంగా మారింది. చత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో వరుసగా జరుగుతున్న పరిణామాలు ఏజెన్సీలోని గిరిజనులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ మావోయిస్టులు ఈ నెల 31వ తేదీన చేపట్టిన బంద్‌కు అన్ని వర్గాలు మద్దతివ్వాలని మావోయిస్టులు కోరుతున్నారు. అదే సమయంలో మంగళవారం రాత్రి ఖమ్మం జిల్లా సరిహద్దులో ఉన్న తూర్పు గోదావరి జిల్లా చింతూరు మండలం సర్వేల అటవీ ప్రాంతంలో తాండూరు డిపోకు చెందిన ఆర్టీసి బస్సుతో పాటు ఒక లారీని దగ్ధం చేశారు. ఈ సంఘటనలో ఎటువంటి ప్రమాదం జరగనప్పటికీ మావోయిస్టుల చర్య ఆందోళన కలిగించింది. అదే సమయంలో భద్రాచలం- చింతూరు ప్రధాన రహదారిపై చెట్లు, రాళ్ళు వేసి రాకపోకలకు అంతరాయం కలిగించారు. గుండాల, చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం మండలాల్లోని పలు ప్రాంతాల్లో బంద్‌కు మద్దతివ్వాలని ప్రచారం చేస్తూ పోస్టర్లు వేశారు. 31వ తేదీ బంద్ సందర్భంగా అవాంచనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉందనే నెపంతో భారీగా పోలీస్ బలగాలను ఏజన్సీకి తరలించారు. అడుగడుగున కూంబింగ్ నిర్వహిస్తూ మావోయిస్టుల చర్యలను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు కూడా పూర్తయిన నేపథ్యంలో మావోయిస్టుల హిట్‌లిస్టులో ఉన్న ప్రజాప్రతినిధులు తమ స్వగ్రామాల్లో పర్యటించే సమయంలో ముందస్తు సమాచారం ఇవ్వాలని, మైదాన ప్రాంతాల్లోనే ఉండాలని పోలీసులు ఆదేశాలు జారీచేశారు. కాగా మావోయిస్టులు చేపట్టిన బంద్ సందర్భంగా చత్తీస్‌గఢ్ నుంచి భద్రాచలం తిరిగే ప్రైవేటు బస్సులను ముందస్తుగానే రద్దు చేస్తున్నారు. అదే క్రమంలో ఏజెన్సీ ప్రాంతంలో తిరిగే ఆర్టీసి బస్సులను కూడా ముందస్తుగానే రద్దు చేసే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వాపురం, చర్ల, దుమ్ముగూడెం, పినపాక, గుండాల, ఆళ్ళపల్లి, భూపాలపల్లి జిల్లాలోని వెంకటాపురం, వాజేడు మండలాల్లో మావోయిస్టులు పోస్టర్లు వేసిన నేపథ్యంలో ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులు కూడా జిల్లా పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

జంతు చట్టంపై అవగాహన

నల్సార్‌లో జ్యుడీషియల్ అధికారులు, మెజిస్ట్రేట్‌లకు ప్రత్యేక శిక్షణ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: జంతువులను పీడించడం, జంతువులపై దురాగతాలు, అక్రమ రవాణాకు సంబంధించిన సమస్యలపై జ్యుడీషియల్ అధికారులు మెజిస్ట్రేట్‌లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నల్సార్‌లోని జంతు చట్ట కేంద్రం నిర్వహించింది. న్యాయాధికారులకు జంతు చట్టాలపై అవగాహన కల్పించడం, తాజాగా మారిన నియమనిబంధనలు, కొత్త చట్టాల అమలు తీరుతెన్నులపై చైతన్యపరిచే ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుండి 23 మంది అధికారులు హాజరయ్యారు. హ్యూమన్ ఇంటర్నేషనల్ సొసైటీ ఎండీ ఎన్ జీ జయసింహ, న్యాయవాది శ్రేయా పరోప్కారి, సొసైటీ డిప్యుటీ డైరెక్టర్ అలోక్ పర్ణా సేన్ గుప్తా ఈ వర్కుషాప్‌లో పాల్గొన్నారు. జంతువుల క్రూరత్వ నిరోధక చట్టం, 1960 వన్యప్రాణుల రక్షణ చట్టం, 1972 జంతుపరిరక్షణ నోటిఫికేషన్‌లకు సంబంధించిన చట్ట అవగాహన కల్పించారు. చట్టం అమలులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో వ్యవహరించాల్సిన వ్యూహంపై కూడా ఈ వర్కుషాప్‌లో సూచనలు సలహాలు అందజేశారు. జంతు చట్టాలపై అవగాహన, చైతన్యం కల్పించే ఈ తరహా సదస్సులకు న్యాయాధికారులు సానుకూలంగా స్పందించడం గొప్ప విజయమని జయసింహ పేర్కొన్నారు. జంతువుల సంక్షేమం, జంతు రక్షణ అధ్యయనం - బోధనకు భారతదేశంలో అంకితం చేసిన మొట్టమొదటి కేంద్రాన్ని నల్సార్ ప్రారంభించిందని, గత ఐదేళ్లలో అనేక మంది పోలీసు అధికారులకు, న్యాయాధికారులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు.

రైతుల ఆదాయం రెట్టింపు కావాలి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: రైతుల ఆదాయం రెట్టింపు అయ్యేలా అన్ని స్థాయిల్లో కృషి జరగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి తెలిపారు. బుధవారం నగరంలోని ఒక హోటల్‌లో నాబార్డు రాష్ట్ర ప్రణాళిక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ప్రసంగిస్తూ తరగిపోతున్న సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, రసాయన ఎరువులు అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సకాలంలో రైతులకు బ్యాంకులు రుణాలు అందించాలని ఆయన కోరారు. వ్యవసాయంలో యాంత్రీకరణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. ఖర్చులు తగ్గించి ఉత్పత్తి ఉత్పాదకత సాధన ద్వారానే ఆదాయం పెంపు సాధ్యం కాగాలదని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు దూరదృష్టితో అనేక కొత్త పథకాలు చేపట్టారని ఆయన చెప్పారు. అంతకు ముందు ఎస్‌కే జోషి 2019-20 వార్షిక ప్రణాళికను విడుదల చేశారు.

విదేశీ భాషలకు భారత్‌లో గిరాకీ

ఆసక్తి చూపుతున్న వర్శిటీలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: భాషలు నేర్చుకుని ఎందుకూ కొరగాలేదని బాధపడే రోజులు పోయాయి. విదేశీ భాషలు నేర్చుకున్న వారికి దేశంలో అవకాశాలు ఇబ్బడి ముబ్బడిగా వస్తున్నాయి. ఉపాధి కల్పించే కోర్సుల్లో విదేశీ భాషల అధ్యయనం కూడా చేరింది. అవకాశాలు పెంచుకునేందుకు యువత నేడు విదేశీ భాషల అధ్యయనంపై మక్కువ చూపుతున్నారు. రాయబార కార్యాలయాల్లో అనువాదకులుగానూ, ఐటీ కంపెనీల్లోనూ, న్యాయసలహా సంస్థల్లో , పార్లమెంటులోనూ, వివిధ యూనివర్శిటీల్లో భాషలపై అధ్యయనం చేసిన వారికి అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఇటీవల ఒక సర్వేలో దేశంలో భాషాధ్యయనం చేసిన 2.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు ఉన్నాయని తేలింది. చైనీస్ భాష నేర్చుకున్న వారికి 11 లక్షల రూపాయిల వరకూ వేతనం పొందే ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే చైనీస్ భాషను నేర్చుకున్న వారి డిమాండ్ 80 శాతం పెరిగింది. ఆంగ్ల భాష నేర్చుకున్న వారికి కూడా అవకాశాలు పెరిగాయి. ప్రధానంగా యురోపియన్ భాషలు నేర్చుకున్న వారికి హాట్‌కేక్‌లా ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఆంగ్ల భాషా ప్రావీణులు తక్షణం 25,570 మంది అవసరమని యాడ్జున సంస్థ పేర్కొంది. గత ఏడాదితో పోలిస్తే వారి వేతనాలు కూడా 11 శాతం అదనంగా పెరిగాయని పేర్కొంది. ఫ్రెంచి, స్పానిష్, జర్మన్ భాషలు నేర్చుకున్న వారికి అత్యధిక వేతనాలు లభిస్తున్నాయి. ఫ్రెంచి నేర్చుకున్న వారికి నెలకు 9.83 లక్షల రూపాయిల వరకూ వేతనం దక్కుతోంది. అలాగే ప్రాంతీయ భాషల విషయానికి వస్తే పంజాబీ వచ్చిన వారికి అవకాశాలు ఎక్కువగా దక్కుతున్నాయి. ఏదైనా వృత్తి, సాంకేతిక విద్యా కోర్సును పూర్తి చేసిన వారికి అదనంగా పంజాబీ భాష వస్తే వారికి అత్యధిక ప్రాధాన్యత లభిస్తోంది. అరబిక్ , బెంగాలి, చైనీస్, డచ్, ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మన్, జపానీస్, పంజాబీ, స్పానిష్ భాషలు నేర్చుకున్న వారికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీనికి అనుగుణంగానే హైదరాబాద్ ఇంగ్లీషు అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీ విదేశీ భాషలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తుండగా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ, నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ, ఉస్మానియా యూనివర్శిటీలు అరబిక్, ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాయి. విదేశీ భాషలు నేర్చుకున్న వారు చాలా వరకూ దుబాసీలుగా పనిచేసేందుకు అవకాశాలున్నాయని , విదేశీ భాషలు నేర్చుకున్న వారు తమ ప్రత్యేక స్పెషాలిటీ సబ్జెక్టులో కూడా రాణించడానికి ఈ భాషలు తోడ్పడతాయని పేర్కొన్నారు.



నగరానికి చేరుకున్న గల్ఫ్ బాధితులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: నిజామాబాద్ లోక్‌సభ సభ్యురాలు కవిత చొరవతో ఇరాక్ జైళ్ళ నుంచి విడుదలైన 15 మంది బుధవారం హైదరాబాద్ చేరుకున్నారు. ఇరాక్ నుంచి విమానంలో ఢిల్లీకి చేరుకున్న వారు అక్కడి నుంచి రైలులో హైదరాబాద్‌కు బయలుదేరి, బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. బాధితులకు విమాన, రైల్వే ఛార్జీలతో పాటు భోజన ఖర్చులను ఇచ్చి వారు ఇంటికి చేరుకునేలా ఆమె ఏర్పాట్లు చేశారు. ఏజెంట్ల చేతుల్లో మోసపోయి ఇరాక్ జైళ్ళలో ఉన్న తమను విడిపించిన కవితకు ఎప్పటికీ రుణపడి ఉంటామని వారు తెలిపారు.



ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై రేడియో జాకీలకు అవగాహన

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: ఓటర్ల జాబితా, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై రేడియో జాకీలకు రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి రజత్‌కుమార్ అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో అనుసరిస్తోన్న అత్యుత్తమ విధానాలను ఆయన సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల సహాయ అధికారులు అమ్రపాలి కట్టా, రవి కిరణ్, జీహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ ముషారఫ్ ఆలీ ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైన్, టెక్నాలజీలో కోర్సులు

అడ్మిషన్లకు నోటిఫికేషన్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి అపెరల్ అండ్ డిజైన్ సెంటర్ (ఏటీడీసీ) దరఖాస్తులను స్వీకరిస్తోంది. దేశంలోనే అతి పెద్ద నాణ్యతా వృత్తి శిక్షణా సంస్థ అయిన ఏటీడీసీ ఏడాది కాల వ్యవధితో కూడిన డిప్లొమో కోర్సును ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ, అపెరల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీల్లో ఆఫర్ చేస్తోంది. కనీసం ఇంటర్ చదివిన వారు ఈ కోర్సుల్లో చేరవచ్చు. అలాగే ఆరు నెలల వ్యవధితో కూడిన ప్యాటర్న్ మాస్టర్, ఫ్యాషన్ డిజైనర్, వస్తువుల వ్యాపారవేత్త కోర్సులను ఆఫర్ చేస్తోంది. ఆసక్తి ఉన్న వారు ఏటీడీసీ , సర్వే నెంబర్ 64, హోటల్ ఆవాసా ఎదురుగా, మాదాపూర్ అనే చిరునామాలో సంప్రదించాలని సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది.

వీవీ ప్యాట్‌లను లెక్కించాల్సిందే

ఈసీని డిమాండ్ చేసినా స్పందన లేదు ★ పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: ఈవీఎంలపై అనుమానాలు ఉండటంతో వీవీ ప్యాట్‌లను లెక్కించాల్సిందేనని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ డిమాండ్ చేశారు. స్వల్ప తేడాతో ఓడిపోయిన నియోజకవర్గాల్లోనైనా వీవీ ప్యాట్‌లను లెక్కించాలని ఎన్నికలకు కమిషన్‌కు ఎన్నిసార్లు కోరినా కనీస స్పందలేదన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి స్పందన లేకపోవడం వల్లనే తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు.

గాంధీభవన్‌లో బుధవారం అద్దంకి దయాకర్ మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల ఫలితాలపై అభ్యంతరాలు ఉంటే 45 రోజులలోగానే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలన్న నిబంధన మేరకే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశామన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత కొన్ని రోజులు గడిస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందన్న దయాకర్ అనుమానం వ్యక్తం చేశారు. ఈవీఎంలను ఎన్నికలు ముగిసిన తర్వాత స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాల్సి ఉండగా ప్రైవేట్ ప్లేస్‌లకు తరలించడం, తరలించడానికి 12 గంటలు తీసుకోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి రజత్ కుమార్ క్షమాపణ చెప్పారని గుర్తు చేశారు. 22 లక్షల ఓట్లు తొలగించి క్షమాపణ చెబితే సరిపోతుందా? అని అద్దంకి ప్రశ్నించారు. అభ్యర్థుల డిమాండ్ మేరకైనా వీవీ ప్యాట్‌లను ఇప్పటికైనా లెక్కించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో వీవీ ప్యాట్‌లు నేరుగా బాక్స్‌ల్లో పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కోరుతామన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ రెండో సారి గెలిచింది పథకాల వల్ల కాదని, దొడ్డిదారిన గెలిచిందని ఆరోపించారు. ఎన్నికల నిర్వహణలో జరుగుతోన్న అక్రమాలకు బాధ్యులైన వారిని బయట పెట్టడానికి కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్యంతో పాటు ఓట్ల కూల్చివేత జరిగిందని దయాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల వ్యూహంపై చర్చించడానికి ఫిబ్రవరి 1, 2న టీపీసీసీ సమావేశం కాబోతుందన్నారు. మండల, జిల్లా స్థాయి నేతలను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించి చర్చిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, అయితే అధిష్టానం ఎక్కడి నుంచి పోటీ చేయమని ఆదేశించిన పోటీకి సిద్ధమేనన్నారు.

ద.మ. రైల్వే పంటపండింది!

లాభాలు తెచ్చిపెట్టిన సంక్రాంతి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: రైల్వేశాఖకు సంక్రాంతి లాభాలు తెచ్చిపెట్టింది. తెలుగు రాష్ట్రాల ప్రజలు సొంత ఊళ్లకు వెళ్ళడానకి దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక బళ్లు నడిపింది. ప్రత్యేక రైళ్లు ఘణనీయంగా ఆదాయం సాధించిపెట్టాయని అధికారులు వెల్లడించారు. ప్రత్యేక రైళ్ల వల్ల తాము ఆశించినదానికంటే ఎక్కువ ఆదాయం వచ్చిందని అన్నారు. 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు రైల్వేకి వచ్చిన ఆదాయం దాదాపు రూ. 3.99 కోట్లరూపాయలు వచ్చాయన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు రైళ్ల ద్వారా 4.50 లక్షల మంది ప్రయాణీకులను చేరవేసినట్టు రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ తెలిపారు. సంకాంత్రి పండుగ వేళల్లో రైల్వే ప్లాట్ ఫామ్ టికెట్ ద్వారా కూడా అధిక ఆదాయం వచ్చాందన్నారు. ప్రయాణీకుల కోసం దాదాపు 203 ప్రత్యేక రైళ్లను నడిపామన్నారు. రిజర్వేషన్ లేకుండా 60 రైళ్లను ఏర్పాటు చేశామన్నారు. రైల్వేలో విస్తృత తనిఖీలు చేస్తున్నందున టికెట్‌లేని ప్రయాణీకుల సంఖ్య భాగా తగ్గిందన్నారు.

జాతిపితకు ఘన నివాళి

అంజలి ఘటించిన ఉత్తమ్, భట్టి

ఆంధ్రభూమి బ్యూరో


హైదరాబాద్, జనవరి 30: మహాత్మగాంధీ 71వ వర్ధంతిని పురస్కరించుకుని గాంధీభవన్‌లో బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి తదితరులు మహాత్మగాంధీ చిత్రపటానికి పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ, రాహుల్ గాంధీ నేతృత్వంలో రెండో స్వతంత్ర పోరాటం మొదలైందన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని నియంతపాలనను గద్దె దింపి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటుకు కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. ఇలా ఉండగా శాసనసభ ఆవరణలో గాంధీ విగ్రహానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనసభ కార్యదర్శి వేదాంతం నరసింహ్మాచార్యులు, సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క పూల మాలలు సమర్పించి నివాళులు అర్పించారు.




గాంధీ భవన్ వద్ద బాపూజీకి నివాళి అర్పిస్తున్న భట్టి తదితరులు



లోటస్‌పాండ్‌లోని వైకాపా ఆఫీసులో బాపూజీకి నివాళి అర్పిస్తున్న వైఎస్ జగన్, అమెరికా కాన్సులేట్ జనరల్



బాపూజీ ఘాట్ వద్ద సీపీఐ నేతల నివాళి



టీడీపీ ఆఫీసులో గాంధీజీకి నివాళి

మూడో విడతలోనూ తెరాస హవా

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా 541కి గాను 409 సర్పంచ్ స్థానాలు కైవసం ★ ఏకగ్రీవాలైన 58 పంచాయతీలు గులాబీ ఖాతాలోకి
ఊరూవాడా అధికార పార్టీ సంబురాలు ★ మూడు విడతల్లో కలిపి 1232 పంచాయతీల్లో పాగా వేసిన తెరాస



మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రోనాల్డ్‌రోస్
విజయ పరంపరలతో టీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

ఆంధ్రభూమి బ్యూరో

మహబూబ్‌నగర్, జనవరి 30: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బుధవారం జరిగిన మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి చెందిన మద్దతుదారులు అత్యధికంగా గ్రామపంచాయతీల్లోని సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నారు. మూడవ విడతలో జరిగిన ఎన్నికల్లో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 541 గ్రామపంచాయతీలు ఉండగా అందులో 58 పంచాయతీలకు సంబంధించిన సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిల 483 గ్రామపంచాయతీలకు ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. ఇందులో ఏకగ్రీవాలు కలుపుకుని పోలింగ్ అయిన గ్రామ పంచాయతీల్లో దాదాపు 409 గ్రామ సర్పంచ్ స్థానాలను టీఆర్ఎస్ మద్దతుదారులు ఘన విజయం సాధించారు. మూడవ విడత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 483 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా 88.25 శాతం పోలింగ్ నమోదు అయిన్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే దాదాపు 58 గ్రామపంచాయతీలు సైతం ఏకగ్రీవం అయిన్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఏకగ్రీవం అయిన పంచాయతీల్లో టీఆర్ఎస్‌కు చెందిన వారే పాగా వేశారు. మూడవ విడత పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ మద్దతుదారులు దాదాపు 409 పైగా సర్పంచ్‌లు గెలుపొందారు. దాంతో నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాలో తెరాస శ్రేణులు గ్రామాల్లో సంబురాలు చేసుకుంటున్నారు. పార్టీకి చెందిన వారు అత్యధిక సర్పంచ్, వార్డు స్థానాలు గెలుపొందడంతో బాణసంచాలు కాలుస్తూ, స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు. ఏకగ్రీవాలు కాకుండా నేరుగా పోలింగ్ జరిగిన గ్రామపంచాయతీల్లో తెరాస ఘన విజయం సాధించడం పట్ల ఆ పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సహన్ని నింపింది. మూడవ విడత పోలింగ్ త పోలింగ్ ప్రశాంతంగా ముగియడం, గ్రామపంచాయతీ ఎన్నికల పర్వం పరిసమాప్తం కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా కలెక్టర్ రోనాల్డ్‌రోస్ చివరి దశ పోలింగ్ సందర్భంగా పలు మండలాల్లో సుడిగాలీ పర్యటన చేసి పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు సైతం పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వృద్ధులకు, వికలాంగులకు ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి వారు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. కాగా తొలివిడతలో తెరాస మద్దతుదారులు ఉమ్మడి జిల్లాలో 502 మంది గ్రామసర్పంచ్‌లుగా తెరాసకు చెందిన వారు గెలుపొందగా, రెండవ విడతలో సైతం 421 సర్పంచ్ స్థానాలు, మూడవ విడతలో 409 సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకోవడంతో పంచాయతీ పోరులో సైతం గులాబీ గుబాళించింది.



ప్రైవేట్ ఆస్పత్రిలో వీఆర్ఓను పరీక్షిస్తున్న వైద్యులు

మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో అపశ్రుతి

వృద్ధురాలు..వీఆర్ఓ మృతి

కోస్గి / కోహిడ, జనవరి 30: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడవ విడతలో పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో వీఆర్ఓ మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కోస్గి మండలంలోని ముశ్రీఫా గ్రామంలో పంచాయతీ ఎన్నికల జీపీ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న వీఆర్ఓ నర్సయ్య (50) ఒక్కసారిగా స్పృహ కోల్పోయి కుప్పకూలగా గమనించిన తోటి అధికారులు కోస్గిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స అనంతరం గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు స్వస్థలం వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని చంద్రకల్ గ్రామ నివాసి అని తోటి అధికారులు తెలిపారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శ్రీరాములపల్లి గ్రామంలో వేముల వెంకవ్వ (75) వృద్ధురాలు ఓటు వేసి ఆనంతరం తిరగివస్తూ పోలింగ్ కేంద్రం సమీపంలో కింద పడి మృతిచెందింది. జేసీ పద్మాకర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

డిగ్రీ లెక్చరర్ల ఎంపిక పరీక్షల్లో సంధ్యారాణి ప్రతిభ

ధర్మపురి, జనవరి 30: తెలంగాణ గురుకుల మహిళా డిగ్రీ లెక్చరర్ల నియామక ఫలితాలలో ధర్మపురి మండలం రాజారం గ్రామానికి చెందిన సింహరాజు సంధ్యారాణి 240.5 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. గత మే మాసంలో టీఎస్‌పీఎస్‌సీ గురుకుల డిగ్రీ లెక్చరర్ల పోస్టుల కోసం నిర్వహించిన పోటీ పరీక్షలలో సంధ్యారాణితో కలిపి ఎంపికైన మరో ముగ్గురు కూడా ధర్మపురి శ్రీలక్ష్మి నరసింహ సంస్కృతాంధ్ర డిగ్రీ కళాశాల పూర్వవిద్యార్థులే కావడం గమనార్హం. సంధ్యారాణి ధర్మపురి ప్రాచ్య డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకుని, హైదరాబాద్ సెంట్రల్ యునివర్సిటీలో ఎంఫిల్ పూర్తి చేసి, ప్రస్తుతం మల్యాల మండలం తాటిపెల్లి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండితురాలిగా పని చేస్తున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ పాగా

ఎన్నికలు జరిగిన 1060 పంచాయతీల్లో టీఆర్ఎస్ -780, కాంగ్రెస్ 176 కైవసం

ఆంధ్రభూమి బ్యూరో

ఖమ్మం, జనవరి 30: ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి పట్టు సాధించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన ఆ పార్టీ నేతలు పంచాయతీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో మెరుగైన ఫలితాలు రాబట్టారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని 1063గ్రామ పంచాయతీల్లో మూడు చోట్ల ఎన్నికలు జరగలేదు. మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. మొత్తం మూడు దశలూ కలిపి ఏకగ్రీవాలతో సహా 780 పంచాయతీలను టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు గెలుచుకున్నారు. కాంగ్రెస్ - 176, టీడీపీ - 39, సీపీఎం - 22, సీపీఐ - 18, న్యూ డెమోక్రసీ - 16 చోట్ల గెలవగా, 9 పంచాయతీల్లో ఏ పార్టీ మద్దతు లేని ఇండిపెండెంట్లు గెలుపొందారు. రాష్ట్ర పరిస్థితులకు భిన్నంగా స్థానిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని గెలుపు కోసం ఎవరితోనైనా పొత్తు పెట్టుకునేందుకు టిఆర్ఎస్ నేతలు వెనుకంజ వేయలేదు. ఫలితం రాబట్టడమే లక్ష్యంగా ప్రణాళికలు రచించి విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఖమ్మం స్థానంతోనే సరిపెట్టుకున్న ఆ పార్టీ అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ మెరుగైన ఫలితాలను సాధించింది. మూడవ విడత ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలు ఉన్న నేపథ్యంలో పోలీసులు మరింత భద్రత ఏర్పాటు చేయడంతో భారీగా పోలింగ్ నమోదైంది. ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో 94.56శాతం పోలింగ్ నమోదు కాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏడు మండలాల్లో 87.23శాతం పోలింగ్ నమోదైంది. మావోయిస్టుల పోస్టర్లు వెలిసిన గుండాల, ఆళ్ళపల్లి మండలాల్లో 89శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. కాగా కాంగ్రెస్ నేతలు అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినప్పటికీ పంచాయతీ ఎన్నికల్లో మాత్రం బోల్తా పడ్డారు. సిఎల్‌పి నాయకునిగా ఎన్నికైన భట్టివిక్రమార్క స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. వైరా అసెంబ్లీ స్థానంలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి టిఆర్ఎస్‌లో చేరిన లావుడ్యా రాములునాయక్ అనుచరులు తక్కువ స్థానాల్లోనే విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాములు నాయక్‌కు కాంగ్రెస్ నేతలు మద్దతివ్వగా పంచాయతీ ఎన్నికల్లో ఆయన టిఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయడంతో అనేక చోట్ల కాంగ్రెస్ నేతలు అడ్డు తగిలారు కూడా. రిజర్వేషన్ ప్రక్రియలో కేటాయించిన కేటగిరికి చెందిన అభ్యర్థులు మూడు గ్రామాల్లో లేకపోవడంతో నామినేషన్ దాఖలు కాలేదు.

ఆ గ్రామాల్లో రిజర్వేషన్ ప్రక్రియను ఎన్నికల కమిషన్ అనుమతితో మార్చి తిరిగి ఎన్నికలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

ఏసీబీ వలలో ఎంవీఐ

రూ.5వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం ★ ఎంవీఐతో పాటు మరో ఇద్దరి అరెస్ట్




స్వాధీనం చేసుకున్న రూ.5వేల నగదు, ఏసీబీ అధికారుల అదుపులో ఉన్న ఎంవీఐ, హోంగార్డు, ఏజెంట్

సంగారెడ్డి టౌన్, జనవరి 30: సంగారెడ్డి ఆర్టీఏ కార్యాలయంలో బుధవారం రూ.5వేల లంచం తీసుకుంటూ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ చౌహన్‌ను ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. బాలాజీ ఎంటర్‌ప్రైజేస్ పేరుతో ట్రాక్టర్ ట్రైవీల్స్ తయారుచేసే వ్యాపారం చేసుకుంటున్న సందీప్ తన లైసెన్స్ రెన్యువల్ కోసం ఆర్టీఏ కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నాడు. రెన్యువల్ కోసం పరిశీలించి రిపోర్టు ఇచ్చేందుకు ఎంవీఐ రూ.5వేలను డిమాండ్ చేసాడు. డబ్బులు ఇవ్వడం ఇష్టంలేని సందీప్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బుధవారం ఉదయం ఎసీబీ అధికారులు ఆర్టీఏ కార్యాలయానికి చేరుకొని సందీప్‌తో డబ్బులను పంపించారు. ఎంవీఐ డబ్బులు చేతితో తీసుకోకుండా అక్కడే పనిచేసే హోంగార్డు సాయిరాంకు చెప్పాడు. హోంగార్డు కార్యాలయం బయట సాయికుమార్ అనే ఏజెంట్ ఉంటాడని అతనికి డబ్బులు ఇవ్వాల్సిందిగా సందీప్‌కు చెప్పాడు. బయట ఉన్న ఏజెంట్‌కు డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తనకు ఏం సంబంధం లేదని ఎంవీఐ, హోంగార్డు చెప్పిన మేరకే డబ్బులు తీసుకున్నానని సమాధానం ఇచ్చాడు. ఆర్టీఏ కార్యాలయంలోకి వెళ్లిన ఏసీబీ అధికారులు విచారించి ఎంవీఐతో పాటు హోంగార్డు, ఏజెంట్‌ను అరెస్టు చేసారు. కేసు విచారణ చేపడుతున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

కందులు కొనాలంటూ రహదారి దిగ్బంధం

రోడ్డుపైనే వంటావార్పు చేపట్టిన రైతులు



నర్వ సింగిల్‌విండో కార్యాలయం ముందు
రోడ్డుపై వంటావార్పు చేస్తున్న రైతులు

నర్వ, జనవరి 30: రైతులు కష్టించి పండించిన పంటను మార్కెట్‌లో విక్రయించుకుందామన్న కొనుగోలు చేసే వారు లేకపోలేరా.. ఒక పక్క రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా ఉంటాం పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆర్భాటంగా చెబుతున్నారు. కానీ వనపర్తి జిల్లా నర్వ మండలంలోని సింగిల్‌విండో కార్యాలయం ద్వారా కందుల కొనుగోలును గత 15 రోజులు చేపట్టి... ఇప్పుడు కందులు కొనుగోలు చేయడం లేదని చెప్పడం ఎంతవరకు సమంజసమని వివిధ గ్రామాల రైతులు కార్యాలయం ముందు రహదారిని దిగ్బందం చేశారు. బుధవారం రోడ్డుపైనే వంటావార్పు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా కంది బస్తాలను తీసుకోవచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఆరుగంటల పాటు రహదారిపైనే రైతులు ఉండడంతో ఎక్కడి బస్సులు అక్కడే నిలిచి పోయాయి. సొసైటీ ద్వారా ఇప్పటి వరకే లక్ష క్వింటాళ్ళ కందులను కొనుగోలు చేశామని అధికారులు అంటున్నారు. నర్వ మండలంలో అన్ని గ్రామాలకు సంబంధించి లక్ష క్వింటాళ్ల కందులు కూడా లేవని, మండల వాసులకు సంబంధించిన కందులను కొనుగోలు చేయకుండా ఇతర ప్రాంతాల వారికి చెందిన కందులను కొనుగోలు చేస్తే ఎలా అని రైతులు అధికారులను ప్రశ్నించారు. లక్ష క్వింటాళ్ళకు సంబంధించి ఎవరెవరి వద్ద కొనుగోలు చేశారో మాకు వివరాలు ఇవ్వాలని రైతులు సొసైటీ సిబ్బందిని నిలదీశారు. ఈ మండల ప్రాంతంలో రైతులు పండించిన కందులను కొనుగోలు చేయకపోవడం ఎంత వరకు సమంజసమని రైతులు అంటున్నారు. సొసైటీ సిబ్బంది మాత్రం కందుల కొనుగోలును ప్రభుత్వం నిలిపి వేసిందని, ప్రభుత్వం నుండి ఆదేశాలు వస్తే కొనుగోలు చేస్తామని అంటున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి తక్షణమే కందుల కొనుగోలును చేపట్టాలని లేని పక్షంలో ఇంక రైతు ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని వివిధ గ్రామాల రైతులు హెచ్చరించారు. ధర్నా వద్ద హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని సమస్యను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో రైతులను సమూదాయించి ధర్నాను విరమించారు. అనంతరం రైతులు తహాశీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు.

ఇక సాయుధ బలగాలతో కలప స్మగ్లర్ల వేట


ఉమ్మడి ఆపరేషన్‌తో కలప రవాణాకు అడ్డుకట్ట ★ టోల్ ప్లాజాల వద్ద టింబర్ స్కానర్లతో తనిఖీలు ★ మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పహారా

ఆంధ్రభూమి బ్యూరో

ఆదిలాబాద్, జనవరి 30: కరడుగట్టిన స్మగ్లర్ల ధాటికి కర్పూరంలా కరిగిపోతున్న అటవీ సంపదను కాపాడేందుకు ప్రభుత్వం కఠినమైన చట్టాలకు పదునుపెడుతూ సాయుధ బలగాలతో ఉమ్మడి వ్యూహంతో సమాయత్తమైంది. రాజకీయ నేతలు, పోలీసులు, అటవీ అధికారుల కనుసన్నల్లో అడ్డుఅదుపు లేకుండా సాగుతున్న విలువైన కలప స్మగ్లింగ్‌ను నిరోదించేందుకు చెక్‌పోస్టుల వద్ద పోలీసులు, అటవీ శాఖ సిబ్బందికి ఆయుధాలు అప్పగించి నిఘా ముమ్మరం చేసింది. పచ్చదనం పెంచేందుకు హరిత హారం, సామాజిక నర్సరీలు, అడవుల్లో మొక్కల పెంపకం కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతుండగా మరోవైపు కరడుగట్టిన స్మగ్లర్లు అధికారులు, నేతలతో చేతులుకలిపి యథేచ్ఛగా వనమేధానికి పాల్పడుతూ అటవీ సంపదను కొల్లగొడుతున్న వరస సంఘటనలపై ముఖ్యమంత్రి కెసిఆర్ సీరియస్‌గా స్పందించి ఆదేశాలు జారీ చేయడంతో అటవీ, పోలీసు అధికారులు మొద్దు నిద్రను వదిలి స్మగ్లర్ల వేటకు నడుం బిగించారు. రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో ఆదిలాబాద్ జిల్లాలో అటవీ సంపద ఉండగా 2లక్షల 10వేల 500 హెక్టార్లలో ఆవరించి ఉన్న కవ్వాల్ అభయారణ్యం సైతం వేటగాళ్ళ ధాటికి ఎడారిలా మారుతోంది. మరోవైపు ఏడాదికాలంలోనే రెండు పులులు, రెండు చిరుతలతో పాటు భారీ సంఖ్యలో వన్యమృగాలు ప్రాణాలు కోల్పోతున్న ఘటనపై కేంద్ర అటవీ విభాగం అధికారులు సైతం ఆందోళన చెంది అత్యవసర సంరక్షణ చర్యలకు ఉపక్రమించారు. గత ఐదు రోజుల కిందట ఇచ్చోడ మండలం కేశవ్‌పట్నం అటవీ ప్రాంతం నుండి నేరడిగొండ చెక్‌పోస్టు మీదుగా నిజామాబాద్‌కు రూ.17లక్షల విలువైన టేకు కలపను తరలిస్తుండగా నిర్మల్ పోలీసులకు అందిన సమాచారం మేరకు సోన్ వద్ద నిఘా పెట్టి వాహనాన్ని పట్టుకున్నారు. కలప స్మగ్లింగ్‌పై ఆరా తీయగా కరడు గట్టిన స్మగ్లర్లకు పోలీసులు, అటవీ అధికారులు నిలుస్తున్నారన్న చేదు నిజం బయటపడింది. ఈమేరకు ఈ కేసులో ప్రమేయం ఉన్న నేరడిగొండ ఎస్సై శేఖర్, ఇచ్చోడ సిఐ సతీష్, నిజామాబాద్ ఏ ఆర్ ఎస్సై షకీల్‌లపై సస్పెన్షన్ వేటు విధించడమే గాక క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయడం రాష్ట్రంలోనే సంచలనం రేపింది. పెంబి అడవుల్లో వన్యప్రాణుల వధించిన కేసులో ఫారెస్ట్ రేంజ్ అధికారితో పాటు ఐదుగురిని సస్పెండ్ చేసిన ఘటన అనంతరం ముగ్గురు పోలీసు అధికారులపై వేటు పడడంతో అటవీ శాఖ ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహించి బహుముఖ వ్యూహంతో ప్రణాళిక రూపొందించారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు జిల్లాల్లో జాయింట్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడమే గాక 400 పోలీసు సిబ్బందికి కలప స్మగ్లింగ్ నిరోదించేందుకు బాధ్యతలు అప్పగించారు. పొరుగునే గల మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ నుండి ఆదిలాబాద్ జిల్లా మీదుగా కలప స్మగ్లింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేకంగా చెక్‌పోస్టులను సైతం ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వరకు జాతీయ రహదారిపై ఆరు చోట్ల ఉన్న టోల్‌ప్లాజాల వద్ద టింబర్ స్కానర్లతో పాటు తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా మీదుగా గోదావరి తీరం నుండి నిత్యం అక్రమంగా పొరుగు జిల్లాలకు కలప తరలిపోతున్న నేపథ్యంలో లక్ష్మీచాంద మండలం దర్మారం, పీచర, చింతల్‌చాంద, సోన్ మండలం కూచన్‌పల్లి, మామడ మండలం కమల్‌కోట్, ఖానాపూర్ మండలం బాదన్‌కుర్తి, కడెం మండలం బెన్‌లాల్, గొడ్చిసిరాల ప్రాంతాల్లో ప్రత్యేక నిఘాతో కూడిన సాయుధ బలగాలను మోహరింపజేయాలని నిర్ణయించారు. నిరంతరం పర్యవేక్షణ కోసం పోలీసు శాఖ నుండి సి ఐ, ఎస్సై అధికారులతో పాటు అటవీ రేంజ్ అధికారి, సిబ్బందితో కూడన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఇకపై నిఘా పెట్టనున్నాయి. దీనికి తోడు ప్రత్యేక ఆర్మ్‌డ్ ఫోర్స్ బలగాలు రహదారుల మీదుగా నిఘా పెట్టి పర్యవేక్షించనున్నాయి.

సాయుధ బలగాలతో అడవుల్లో జల్లెడ పట్టి స్మగ్లర్ల ఆటకట్టించేలా ప్రత్యేక ప్రణాళికతో పోలీసులు, అటవీ సిబ్బంది సమాయత్తం కానున్నారు. తద్వారా విలువైన అటవీ సంపదను కాపాడడంతో పాటు వన్యప్రాణులు, అటవీ భూములు ఆక్రమణకు గురి కాకుండా బహుముఖం వ్యూహంతో ముందుకు సాగాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం.

'డ్రా'లో వరించిన సర్పంచ్ పదవి..!



డ్రాలో పదవి దక్కించుకున్న హుస్సేన్

కేసముద్రం, జనవరి 30: డ్రాలో కార్లు... బహుమతులు గెల్చుకోవడం విన్నాం.. చూశాం.. అయితే అందుకు భిన్నంగా... మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెద్దమోరితండా పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవి డ్రాలో ఓ అభ్యర్థి ఎగరేసుకుపోయిన ఉదంతం ఇది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెద్దమోరి తండా గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా ఇద్దరు అభ్యర్థులు ఆంగోత్ లక్ష్మణ్, గుగులోత్ హుస్సేన్ పోటీ పడగా బుధవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 427 ఓట్లకు గాను 421 ఓట్లు పోలు కాగా ఇందులో 5 ఓట్లు చెల్లకుండా పోయాయి, చెల్లుబాటైన 416 ఓట్లలో లెక్కింపు తరువాత హుస్సేన్, లక్ష్మన్‌కు చెరి సమానంగా 208 ఓట్లు లభించాయి. చెరిసమానంగా ఓట్లు లభించడంతో అధికారులు ఎన్నికల నియమావళి ప్రకారం ఇద్దరి పేర్లతో పది చిటీలను రాసి డ్రా తీయగా, అందులో గుగులోత్ హుస్సేన్ పేరు రావడంతో సర్పంచ్‌గా ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు ప్రకటించారు.

ఇద్దరు బధిర విద్యార్థినుల అదృశ్యం ముంబయిలో ఆచూకీ లభ్యం



అదృశ్యమైన కటికేరి నింగమ్మ
ఆలెపు పూజ (ఫైల్‌ఫొటోలు)

మిర్యాలగూడ టౌన్, జనవరి 30: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం విద్యానగర్ కాలనీలోని గిరిజన బాలికల వసతి గృహం నుండి ఇద్దరు బధిర విద్యార్థినిలు అదృశ్యమయ్యారని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆడావత్ పార్వతి బుధవారం స్థానిక ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 29 ఉదయం 5 గంటలకు వాచ్‌మెన్‌కు మాయమాటలు చెప్పి బ్యాగులతో వెళ్లిపోయారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఆమె కోసం గాలించిన అనంతరం బుధవారం మధ్యాహ్నాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐతే ఈ బాలికలిద్దరూ ముంబయిలో ఉన్నట్టు రాత్రి బాగా పొద్దు పోయాక పోలీసులకు సమాచారం అందింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం కటకేరి సాయిబన్న కుమార్తె కటకేరి నింగమ్మ, కరీంనగర్ జిల్లా చిప్పలపల్లి గ్రామానికి చెందిన ఆలపు మహేష కుమార్తె ఆలెపు పూజ మిర్యాలగూడ ప్రభుత్వ బధిర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు చెప్పపెట్టకుండా బ్యాగులతో వెళ్లిన విద్యార్థుల ఆచూకీ తెలుసుకునేందుకు కేసు నమోదు చేసి ఒన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

విచారించిన ఆర్డీఓ

మిర్యాలగూడ పట్టణం విద్యానగర్‌లో ఉన్న ఎస్సీ వసతిగృహం నుంచి ఇద్దరు బధిర విద్యార్థినిల అదృశ్యం కావడాన్ని తెలుసుకున్న ఆర్డీఓ జగన్నాధరావు, ఎఎస్‌సిడబ్లుఓలు బుధవారం నాడు వసతి గృహాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు విద్యార్థినిలు కె.నింగమ్మ, ఎ.పూజలు ఈ నెల 29 ఉదయం బ్యాగులు తీసుకుని వెళ్లారని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆడావత్ పార్వతి తెలిపారు. వాచ్‌మెన్ కళ్లు కప్పి ఇద్దరు వెళ్లారన్నారు. వారు అదృశ్యమైన అనంతరం వారి గురించి అన్ని చోట్ల ఆరా తీసామన్నారు. ఎక్కడ కానరాకపోవడంతో ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆర్డీఓకు వివరించారు.

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ షురూ

అసెంబ్లీ సెగ్మంట్ల వారీగా ఏఆర్‌వోల నియామకం ★ ఎన్నికల నిర్వహణ సిబ్బంది కోసం ప్రారంభమైన కసరత్తు ★ పోలింగ్ స్టేషన్ల తనిఖీలు

నాగర్‌కర్నూల్, జనవరి 30: గ్రామపంచాయతీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. జిల్లాల పునర్విభజన అనంతరం తొలిసారిగా జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను ఇప్పటికే చేపట్టి నాగర్‌కర్నూల్ ఎస్సీ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారిగా నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇ.శ్రీధర్‌ను నియమించడంతో పార్లమెంట్ ఎన్నికలకు సంబందించిన ప్రక్రియను గత పక్షం రోజుల నుంచి కొనసాగిస్తున్నారు. నాగర్‌కర్నూల్ ఎస్సీ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఈ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి అసెంబ్లీ సెగ్మంట్‌లతోపాటు వనపర్తి జిల్లాలోని వనపర్తి, గద్వాల జిల్లాలోని గద్వాల, అలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లు వస్తాయి. దీనితో ఆయా సెగ్మెంట్‌లకు ఎన్నికల కమిషన్ సహాయ రిటర్నింగ్ అధికారులను నియమించడం జరిగింది.

నాగర్‌కర్నూల్ అసెంబ్లీ సెగ్మంట్‌కు జేసీ పి.శ్రీనివాస్‌రెడ్డి, కొల్లాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు నాగర్‌కర్నూల్ ఆర్డీవో హనుమ నాయక్‌ను, అచ్చంపేట సెగ్మెంట్‌కు ఆర్డీవో పాండునాయక్, కల్వకుర్తి సెగ్మెంట్‌కు కల్వకుర్తి ఆర్డీవోను, వనపర్తి సెగ్మెంట్‌కు వనపర్తి జేసీని, గద్వాలకు గద్వాల జేసీ నిరంజన్‌రావును, అలంపూర్ సెగ్మెంట్‌కు గద్వాల ఆర్డీవోను సహాయ రిటర్నింగ్ అధికారులుగా నియమించడం జరిగింది. దీనితో ఆయా సెగ్మెంట్‌ల పరిధిలో ఎన్నికల సిబ్బందిని గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా సెగ్మెంట్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులలో విధులను నిర్వహించేందుకు ఫిట్‌గా ఉన్న వారిని గుర్తించి వెంటనే నివేదికను ఇవ్వాలని, పోలింగ్ స్టేషన్లను తహాశీల్దార్లు విధిగా తనిఖీ చేసి మౌలిక సదుపాయలు, కేంద్రం స్థితి తదితర వాటిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులపై నివేదికలను ఇవ్వాలని సోమవారం నిర్వహించిన అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఆదేశించడంతో పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని అన్నీ సెగ్మెంట్‌లలో అధికారులు దీనిపై నిమగ్నమైపోయారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబందించి ముఖ్యంగా డూప్లికేట్ ఓటర్ల తొలగింపు తదితర వాటిని పకడ్బందీగా చేయాలని, ఏవైనా లోపాలుంటే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లాకు చెందిన అధికారులను నోడల్ అధికారులుగా నియమించగా, వారినే పార్లమెంట్ ఎన్నికలకు సంబందించి నోడల్ అధికారులుగా నియమించడంతోపాటు వనపర్తి, గద్వాల జిల్లాలకు చెందిన అధికారులను కూడా నియమించనున్నట్లు తెలుస్తున్నది. మొత్తంమీద నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో రాజకీయ వాతావరణం కూడా వేడెక్కనున్నది.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
గురువారం, 31 జనవరి 2019

రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఉన్న 'సచివాలయాన్ని' మరోచోటికి తరలించాలన్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం. స్వచ్ఛ 'భాగ్యనగరం' మళ్లీ అవతరించడానికి కొత్తగా మరోచోట సచివాలయాన్ని నిర్మించడం దోహదం చేయగలదు. అలా దోహదం చేయగల రీతిలో నూతన సచివాలయం ప్రాంగణాన్ని ఎంపిక చేసుకోవడానికి పర్యావరణ పరిరక్షణ ప్రాతిపదిక కావాలి! కాలుష్యం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతున్న హుస్సేన్ సాగర్ లేదా 'వినాయక్ సాగర్' జలాల ప్రక్షాళనకు సైతం సచివాలయం తరలింపు ఉపకరించగలదు. కొన్ని వేల మంది ఉద్యోగులు మాత్రమేకాక అనేక వేల మంది సందర్శకులు సచివాలయం ప్రాంగణంలోకి ప్రవేశిస్తుండడం వల్ల ప్రతిరోజు గుమికూడుతున్నందువల్ల రకరకాల కాలుష్యాలు కేంద్రీకృతమవుతున్నాయి. నిజానికి సచివాలయం, హుస్సేన్ సాగరం కాలుష్యాన్ని కేంద్రీకరించడంలోను, విస్తరింపచేయడంలోను పరస్పర పరిపోషక పాత్రను పోషిస్తుండడం ఏళ్లతరబడి కొనసాగుతున్న వైపరీత్యం! 'హుస్సేన్ సాగరం' పరిసరాల నుంచి తరలిపోవడం వల్ల తెలంగాణ ప్రభుత్వ సచివాలయం- కొత్త-ప్రాంగణంలో పరిశుభ్రమైన పవనాలు సహజంగా వీచే అవకాశం ఉంది. సమీపంలో 'సచివాలయం' సందడి తగ్గిపోవడం వల్ల హుస్సేన్ సాగర్ కాలుష్యం కూడ కొంత తగ్గే అవకాశం ఉంది. ప్రధానంగా 'ప్లాస్టిక్' కాలుష్య ప్రభావం తగ్గిపోతుంది. ఈ 'తరలింపు'వల్ల హుస్సేన్ సాగర్ జలాలను పరిశుభ్రపరచి స్వచ్ఛ సేవనయోగ్యంగా వీలైతే పానయోగ్యంగా మార్చే ప్రక్రియ కూడ పుంజుకోవచ్చు! జలాశయాలలోని నీరు జనం తాగగలగడం స్వచ్ఛ భారత పునర్ అవతరణలోని ప్రధాన అంశం! లక్షల కోట్ల సంవత్సరాల చరిత్ర కలిగిన మన జాతీయ జీవన ప్రస్థాన పథంలో అవిరళ, అమలిన జల వాటికలు, జల వాహినులు విజ్ఞాన కేంద్రాలు కావడం చరిత్ర.. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడం చరిత్ర. అనంతగిరి ఓషధీ రసాలను నింపుకున్న ముచికుంద- మూసీ నది అమృత జల ప్రవంతిగా ప్రవహించిన నాటి 'మూసీ' నది చరిత్ర గురించి తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు స్వయంగా ప్రస్తావించి ఉన్నారు. ప్రస్తుతం 'మూసీ' అవిరళ- నిరంతర- ప్రవాహం కాదు, అమలిన జలాలూ లేవు. 'మూసీ' మురుగు- అన్నది మాత్రమే గత కొన్ని దశాబ్దులుగా భాగ్యనగర వాసులకు తెలిసిన వాస్తవం, అనుభవం! అందువల్ల 'మూసీ' మురుగు పక్కన నిలచి ఉన్న 'ఉన్నత న్యాయస్థానం' ప్రాంగణాన్ని కూడ అక్కడ నుంచి తరలించి మరో పరిశుభ్ర ప్రాంగణంలో నెలకొల్పడం ''ఊపిరి పీల్చుకొనడానికి'', స్వచ్ఛవాయువులు అనుభవించడానికి దోహదం చేయగలదు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణతో ముడిపడిన ప్రధాన పరిణామంలలో ఒకటి- అవశేష ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధానిని నిర్మించవలసిన అవసరం ఏర్పడడం. ఇదివరకే జనంతో కిక్కిరిసి ఉన్న, కాలుష్యం కేంద్రీకృతమైన నగరాలలోకాక వీటికి దూరంగా ప్రశాంత సీమలలో 'అమరావతి'ని ఏర్పాటు చేయాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్ణయం కూడ సత్ సంకల్పం. ఈ శుభ సంకల్పం వల్ల చిన్న చిన్న రాజధాని ఏర్పడుతుందని, కాలుష్యం కేంద్రీకృతంకాదని జనం ఆకాంక్షించడం సహజం! చిన్న నగరాలు, చిన్న రాజధానులు ఏర్పడడం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న స్వచ్ఛ ఉద్యమాలలో భాగం... అంతర్జాతీయ స్థాయి రాజధానిని నిర్మిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పదే పదే ప్రకటించి ఉన్నారు. కానీ అంతర్జాతీయ స్థాయికి,

వికేంద్రీకరించండి..

గరిమకు ప్రాతిపదిక 'ప్రమాణం'కానీ 'పరిమాణం' కాదు, కాదు. క్రీస్తుకను పూర్వమే, శతాబ్దులపాటు అంతర్జాతీయ ఆదరణను పొందిన 'డమాస్కస్' ఉక్కు భారతదేశంలోని చిన్న చిన్న 'కొలిమి'బట్టీలలో తయారుకావడం చరిత్ర. దేశమంతటా ప్రధానంగా- నేటి- తెలుగు ప్రాంతాలలోని పల్లెలలోని 'కొలిమి 'బట్టీ'లలో 'విశ్వకర్మ'లు ఈ ఉక్కును తయారుచేశారు. ఒక్కొక్క 'కొలిమి'ని నిర్వహించిన ఒక్కొక్క 'విశ్వకర్మ' ఒక్కొక్క శాస్త్రవేత్త, స్థపతి. ప్రగతి, ప్రగతిని సాధించగల శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన అట్టడుగు స్థాయివరకు వికేంద్రీకృతం కావడం ప్రాచీన భారత చరిత్ర.. ఇది అంతర్జాతీయ గరిమకు ఒక ఉదాహరణ మాత్రమే, ఉదాహరణలు అసంఖ్యాకం.. అందువల్ల అంతర్జాతీయ స్థాయి రాజధానిని ఈ వికేంద్రీకృత ప్రగతి, పరిజ్ఞాన పరిధికు అనుగుణంగా నిర్మించడం మేలు.. ఆంధ్రప్రదేశ్‌లో సగం జనాభా రాజధానిలోనే కేంద్రీకృతం అయ్యే విధంగా ఊపిరాడని భారీ నగరాన్ని నిర్మించడం వల్ల కాలుష్యం మరింత పెరుగుతుంది.

అందువల్ల అమరావతిలో ఎనిమిదో తొమ్మిదో నగరాలను నిర్మించడం స్వచ్ఛ పరిసరాల స్ఫూర్తికి విఘాతకరం. 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని సగం విస్తీర్ణం అడవుల నిలయం కావాలన్న కార్యక్రమాన్ని అమలు జరుపుతున్న రాష్ట్ర ప్రభుత్వం రాజధానిని కూడ హరితమయం చేయగలగాలి. అమరావతిలో పరిపాలన నగరాన్ని మాత్రమే నిర్మించినట్టయితే స్వచ్ఛ రాజధాని ఏర్పడుతుంది. మిగిలిన వాణిజ్య, క్రీడ, తదితర నగరాలను ఒక్కొక్కదాన్ని ఒక్కొక్క జిల్లా కేంద్రంలో నిర్మించడం వల్ల ప్రగతి, పరిజ్ఞానం వికేంద్రీకృతం కాగలవు. ఈ వికేంద్రీకృత ప్రగతి వ్యవస్థ వల్ల మాత్రమే కాలుష్యం ఒకేచోట కేంద్రీకృతమై దుర్గంధం కొలువుతీరకుండా నిరోధించవచ్చు. అనేక అంతస్థుల భవనాలను ఒకేచోట నిర్మించడం వల్ల కూడ 'బొగ్గుపులుసు' వాయువు కేంద్రీకృతమైపోయి ప్రజలకు ఊపిరాడని దుస్థితి దాపురిస్తుంది. ప్రాచీన భారతదేశంలో రాజధానులు విద్యాకేంద్రాలు కాలేదు. విశ్వవిద్యాలయాల వంటి 'మహా విద్యాలయాలు', గురుకులాలు రాజధానులలో ఏర్పడలేదు. రాజధానికి దూరంగా ఉన్న నగరాలలో ఈ మహావిద్యాలయాలు ఏర్పడినాయి. రాజధానులు వాణిజ్య కేంద్రాలుగా కాని, తీర్థయాత్రస్థలాలుగా కాని, పర్యాటక పారిశ్రామిక కేంద్రాలుగా కాని ఏర్పడలేదు. ఈ దేశాన్ని మమకారం లేని, కేవలం కొల్లగొట్టుకొని పోవడం లక్ష్యమైన బ్రిటన్ దురాక్రమణదారులు వికేంద్రీకరణను విధ్వంసం చేసి 'కేంద్రీకరణ'ను వ్యవస్థీకరించారు. కాలుష్యం కేంద్రీకృతం కావడానికి ఇదీ చారిత్రక నేపథ్యం! కానీ భారత్ నుంచి పాఠాలు నేర్చుకున్న అమెరికాలోని యాబయి రాష్ట్రాలకూ చిన్న రాజధానులే ఏర్పడి ఉన్నాయి...

తెలంగాణ సచివాలయాన్ని తరలించడం మంచిదే కాని, కానీ కొత్త సచివాలయాన్ని 'బైసన్ పోలో'వంటి మహానగర మధ్య ప్రాంతాలలోకాక జన సమ్మర్దానికి దూరంగా ఉన్న శివారు ప్రాంతాలలో నిర్మించడం మేలు! భువనగిరి సమీపంలలో, షాదనగర్ సమీపంలలో, చేవెళ్ల చేరువలలో, సిద్దిపేట పరిసరాలలో కొత్త సచివాలయాన్ని, 'విధాన మండలి' భవనాలను, మంత్రులకు ఉద్యోగులకు ఇళ్లను ఎందుకని నిర్మించరాదు? ఉన్నత న్యాయస్థాన నూతన భవనాలను నిర్మించరాదు?? 'బైసన్ పోలో'లో తొంబయి ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించినట్టయితే అందుకు ప్రతిగా కేంద్ర ప్రభుత్వానికి వేరే చోట దాదాపు ఆరువందల ఎకరాల స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వం అప్పగించాలట. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం నిబంధనను విధించిందట! ఈ నిబంధనను తెలంగాణ ప్రభుత్వం ఇంకా అంగీకరించలేదని కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఉన్నత న్యాయస్థానానికి నివేదించింది. అందువల్ల ఈ విధమైన మార్పిడి వల్ల తెలంగాణ ప్రభుత్వానికి దాదాపు ఐదువందల ఎకరాల భూమి నష్టపోతుందట.. అందువల్ల 'బైసన్ పోలో' ప్రాంతంలోకాక మహానగరానికి దూరంగా కొత్త సచివాలయం నిర్మించడం వల్ల హైదరాబాదు ప్రాంగణంలో కాలుష్యం తగ్గుతుంది... జన సమ్మర్దం తగ్గుతుంది కనుక!! స్వచ్ఛ భాగ్యనగరం, స్వచ్ఛ తెలుగు రాష్ట్రాలు, స్వచ్ఛ భారతలను మళ్లీ సాధించవచ్చు...

యోగమా? యాగమా??

'కేంద్రం మాకు సహకరించడం లేదు'- అన్న మాట ఇటీవల భాజపా అధికారంలో లేని రాష్ట్రాల నుంచి తరచు వినబడుతూనే వుంది. ఆంధ్రాలో ముఖ్యమంత్రికి, కేంద్రంలో ప్రధానమంత్రి మోదీకి మధ్య 'లడాయి' తారాస్థాయికి చేరుకున్నది. కేరళలో సరేసరి.. కేంద్రం తమకు సహకరించడం లేదంటూ ఏకరువు పెడుతూ ఎవరికివారే మరో గోల చేస్తోంది వామ పక్ష ఫ్రంట్ ప్రభుత్వం. ఒడిశాలో, పశ్చిమ బెంగాల్‌లో ఎక్కడా 'కేంద్రా'నికి సదరు రాష్ట్ర ప్రభుత్వాల ఏలికలకీ పొత్తు కుదరటం లేదు. అది సహజమేగానీ, ఒక ఫెడరల్ సిస్టమ్‌లో వుండదగ్గ- కేంద్ర, రాష్ట్రాల మధ్య 'పొందిక' కూడా లేదు. అన్నిటికన్నా ముందు మమతా బెనర్జీ పాలనలోని బెంగాల్‌లో యింకా ఏ 'కూటమి' కుదురుగా ఏర్పడలేదు. కేంద్రంలో పరిపాలిస్తున్న భారతీయ జనతాపార్టీకి- అడుగడుగునా అటంకాలు, కష్టాలూ ఎదురవుతున్నాయి. 'మోదీ- షా'ల అపురూప సంగమంగా వున్న భాజపాకి స్పీడు బ్రేకర్లు, రాస్తా రోకోలు పెట్టడానికి ఎన్ని 'గట్స్' వుండాలి?- అన్నాడో మోదీ వీరాభిమాని.

''ఏమనుకుంటున్నారో ఏమో! యీ మమతాబెనర్జీలు, చంద్రబాబులు యిక్కడ.. కేంద్రం చేతిలోనే వీళ్ల పిలక వుంటుంది. కేంద్రం దగ్గర మిలటరీ పోలీసులుంటారు. మర బాంబులుంటాయి.. తెలుసా?'' అంటూ వీరావేశం ప్రదర్శించాడు ఒక యువకుడు. 'కాషాయ రంగు, కమలం' వాళ్ల సింబల్స్ అయినంత మాత్రాన వాళ్లంతా విరక్తులు, వియోగులు, యోగులు, సాధువులు అనుకోవద్దు- అంటూ కొంత ఆందోళన ప్రకటిస్తున్నారు పునాది స్థాయి కార్యకర్తలు. వెనుకటి రాజుల కాలంలా కేంద్రంతో తమ రాజ్యాల బలగాలు పోరాడాలనే అభిలాష కూడా వుంది కొందరికి! ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో 'దీదీ' సర్వకాల సర్వావస్థల యందూ- తెల్లని సీదాసాదీ చీర ధరిస్తూ- అతి నిరాడంబరంగా హవాయి చెప్పులు వేసుకుని నడుస్తూ- వైరాగ్య స్థాయి- జీవితం గడుపుతూ వున్నా- ముఖ్యమంత్రి పాత్రలో ఆమె జీవిస్తున్నప్పుడు మాత్రం యీ సహనశీలం కనబడదు.


వీరాజీయం
సెల్: 92900 99512

చంద్రబాబు తన రాష్ట్రంలోకి సీబీఐని 'అనుమతి లేనిదే రాకూడదు' అన్నాడు గానీ, ఇక బెంగాల్‌లోకి భారతీయ జనతాపార్టీ నాయకులకే పరోక్షంగా ప్రవేశాన్ని నిరోధిస్తున్నారు- అంటున్నారు 'కమల దళం' నాయకులు. చూడగా చూడగా యింకా ఏ 'కూటమి'కీ ఒక రోడ్డు మ్యాప్ గానీ, ఒక కామన్ ప్రణాళిక గానీ ఏర్పడలేదు. 'పశ్చిమ బెంగాల్‌లో భాజపాకి బెంగాలీ ఎదురుగాలి ముక్కూ మొహం వాచేలాగా ఎదురవుతున్నది. ఇటీవల బెంగాల్‌లో జరిగిన భారతీయ జనతాపార్టీ 'ర్యాలీ'- అదీ మామూలు ర్యాలీ కాదుట! అమిత్‌షా, స్మృతీ ఇరానీలు విజృంభించి పాల్గొనటానికి సకల సన్నాహాలూ చేసుకుని వచ్చిన ర్యాలీలు- యించుమించు భగ్నం అయ్యాయి. కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ తన గ్లామర్- టి.వి. తారగా వున్న ప్రజాకర్షణ, వాగ్ధాటి వగైరాలను యినుమడింపజేస్తూ - పశ్చిమ బెంగాల్‌లోని జార్‌ఘ్రామ్‌కు చెందిన 'శాల్‌బణీ'లో- బ్రహ్మాండమయిన ర్యాలీకి, నాయకత్వం వహించడానికి- మధ్యాహ్నం పన్నెండున్నర గంటల ముహూర్తం పెట్టుకున్నారు.

ఐతే, అడుగడుగునా భాజపా నాయకుల ప్రయాణ రథ చక్రాలకు 'గాలి'పోతూ వుండటంతో, ఆమె జార్‌గ్రామ్ చేరడానికే పొద్దుపోయింది. ఆమె ప్రయాణిస్తున్న హెలికాప్టర్ తాత్కాలికంగా నిర్మించిన హెలిపాడ్‌కు నలభై అయిదు కిలోమీటర్ల దూరంలో దిగిపోయింది. ఇదంతా మమతా బెనర్జీ ఆదేశాల మీద బెంగాలీ అధికార యంత్రాంగం కల్పించిన విఘాతమేనని- స్మృతీ ఇరానీతోపాటూ వున్న భాజపా జాతీయ కార్యదర్శి కైలాశ్ విజయవర్గీయ నమ్మకం. జిల్లా అధికార యంత్రాంగం పన్నిన పన్నాగం వల్లనే ఇరానీ వెళ్తున్న హెలికాప్టర్ అనుకున్న దగ్గరకాక- 'కళాయికుండ' విమానాశ్రయంలోనే దిగడిపోయింది. 'బీరభూమ్'కి ఎగరాలి అది. అక్కడ మర్నాడు- 'సూరి', అనేచోట కేంద్రమంత్రి స్మృతితో అమిత్ షాకూడా పాల్గొనాల్సి వుంది. గానీ, ఇరానీ ర్యాలీ- రైలుబండ్ల ప్లాట్‌ఫారాల మీద ప్రకటిస్తూంటారే- 'ఫలానా రైలు నిరవధికంగా లేటు'- అని, అలాగ బాగా లేటయిపోయింది.

అంతేకాదు- భాజపాకి మకుటం లేని 'షా' అయిన అమిత్‌జీకి సుస్తీచేసి- రెండు సభలను 'రద్దు'చేసుకునే స్థితి వచ్చి- ఆయన తిరుగు ప్రయాణంలో వుండగా- ఇరానీకి ఇక్కడ బీర్ (వీర్ లెండి, బీరుకాదు) భూమిలో చుక్కలు కనపడ్డాయి! ''అక్కడ మన వేదిక దగ్గరగానే హెలిపాడ్ నిర్మించారయ్యా!.. పద భాయీ'' అంటే హెలికాప్టర్ చోదకుడు- ''అమ్మా! అక్కడ పొలాల్లో నాగేటి చాలుల్లో హెలికాప్టర్‌ని యీ మునిమాపువేళలో దించామో- అంతే సంగతులయిపోతామ్'', అన్నాడు.

స్మృతి ఇరానీ గ్లామర్ వున్న నటి, అనర్గళంగా మాట్లాడగల ధీమంతురాలూ కనుక సరిపోయింది. పైగా జనం కాస్త అసహనం, అల్లరి మొదలెట్టేసరికి ఆమె బెంగాలీ భాషలో ''బోర్... బోషో...'' అంటూ లెక్చర్ దంచేసింది. అసలు అంతకు ముందు మరోసభ ఆమె లేకుండానే కొనసాగింది. మమతాబెనర్జీ నేరుగా యిటువంటి విఘాతాలు కల్పిస్తున్నదని అంటూ ఇరానీ నినద భీకరంగా నిందించేసరికి తృణమూల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అక్కడే వున్నాడు. అతనికి మండింది. అతను 'మమతాసేన'లో చాలా గట్టివాడు- నవ్వేస్తూ అన్నాడు- ''ఎందుకు అలా నోరుపారేసుకుంటారు? మా పార్టీ, మా ప్రభుత్వం ఏమీ అడ్డం పడటం లేదు. ఏర్పాట్లదేముందీ వాటివల్ల మాకేమి పోతుంది? మీకే గ్రహచారం బాగోలేదు. మీ తారాచంద్రబలం అధ్వానంగా వుంది. పోయి ఏదైనా యజ్ఞం చేయించండి'' అంటూ ఎద్దేవా చేశాడు.

నిజానికి ఫిబ్రవరి నెలలో ప్రధానమంత్రి నరేంద్ర దాస్ మోదీ పర్యటన వుంది. అదీ ఫెయిలవుతుందేమో? దానికీ మేమే కారణం అంటారు మీ వాళ్లు''- అన్నారు తృణమూల్ కాంగ్రెస్ వాళ్లు. మొత్తానికి- 'నోరుంటే తల కాస్తుంది' అన్నట్లు స్మృతి గనుక- పైట బిగించి మైకు ముందు శంఖారావాలు ఒత్తుతున్నట్లు- జనాకర్షక ప్రసంగం చేసింది గానీ మరొకరైతేనా? జావకారిపోయేవారు. అద్సరే.. రేపో మాపో 'నమో'తో అమిత్ షా కూడా బెంగాల్‌కు రావాల్సి వుంటుంది. దానికి గగనతలంలో- ఇలాతలంలో కేంద్ర బలగాలు ముందే వచ్చి- ఏర్పాట్లు గట్టిగా చేసుకోవాలేమో?! బైదిబై- కేసీఆర్ చండీయాగం చేసి ఘన విజయం సాధించాడన్న గాఢ నమ్మకం మిగతా పార్టీల నాయకులకు పురుగై దొలుస్తున్నట్లుంది. అందుకే భాజపాకి- ''యజ్ఞం చేయండి- గ్రహదోషం పోతుంది''- అన్న సలహా యిచ్చినాడు తృణమూల్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు. దీదీకి కూడా 'ఫీలర్' అందాలనుకున్నాడేమో అతగాడు.

'యోగా' ఆర్ 'యాగా'? విచ్ ఈజ్ పవర్‌ఫుల్...?

ప్రియాంక ప్రతిష్టకు పెను సవాల్!

ప్రియాంకా వాద్రా రాజకీయాల్లో ఇక చురుకైన పాత్ర నిర్వహిస్తారన్న విషయం తేటతెల్లమైంది. ఆమె క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తారా? రారా? అన్న చర్చకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎట్టకేలకు తెరదించారు. ఒకప్పుడు నెహ్రూ, గాంధీ కుటుంబం నుంచి వారసులు రాజకీయాల్లోకి వస్తున్నారంటే పెద్ద చర్చ జరిగేది. అయితే, ఇపుడు ప్రియాంక రాజకీయ రంగప్రవేశంపై ప్రజలు ఆసక్తిని కనపరచడం లేదు. ఎవరైతే ఏంటి? మనకు ఒరిగేదేముందనే భావన నేటి యువతలో కనిపిస్తోంది. దేశం కంటే వ్యక్తిగత లాభనష్టాలతో జీవితాలను బేరీజు వేసుకుని బతకడం, వ్యక్తిగత ఆనందాన్ని ఇచ్చే సామాజిక మాధ్యమాల్లో యువత మునిగి తేలడం వల్ల- 'రాజకీయాల్లోకి ప్రియాంక రావడం' అన్నది ప్రసార మాధ్యమాలకే పరిమితమైంది.

గతంలో వలే ప్రస్తుతం ప్రజల్లో బానిస మనస్తత్వం లేదు. చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమం గురించి పక్కనపెడితే, ప్రతిభ ప్రాతిపదికన రాజకీయాల్లోనూ రాణిస్తేనే మనుగడ ఉంటుంది. ప్రియాంక రాజకీయాల్లో వస్తే ఊరేగింపులు చేయాలా? అని యువత నిర్మొహమాటంగా ప్రశ్నించడం అభినందనీయమే. నెహ్రూ, గాంధీ కుటుంబానికి చెందినందున వారసత్వ రాజకీయాల్లోకి ఆమెకు అవకాశం వచ్చిందే తప్ప సహజంగా వచ్చిందా? అని ప్రశ్నించిన వారున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆమె తన నాయకత్వ లక్షణాలను నిరూపించుకుంటే తప్ప- నాన్న రాజీవ్ గాంధీ, నానమ్మ ఇందిరా గాంధీ మాదిరిగా జనం బ్రహ్మరథం పట్టే అవకాశాలు లేవు.

నెహ్రూ-గాంధీ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన 11వ వ్యక్తి ప్రియాంక. మోతీలాల్ నెహ్రూ, ఆయన కుమారుడు జవహర్‌లాల్ నెహ్రూ, జవహర్‌లాల్ కుమార్తె ఇందిరా గాంధీ (ప్రధానమంత్రి), ఆమె భర్త ఫిరోజ్ గాంధీ, ఇందిర కుమారులు సంజయ్ గాంధీ, రాజీవ్ గాంధీ రాజకీయాల్లో పలు పదవులు నిర్వహించారు. రాజీవ్ మరణించాక కొన్నేళ్ల విరామం అనంతరం ఆయన భార్య సోనియా గాంధీ 1999లో రాజకీయాల్లోకి వచ్చారు. సోనియా వారసుడిగా రాహుల్ గాంధీ ప్రస్తుతం కాంగ్రెస్ అధ్యక్ష పదవిలో ఉన్నారు. సంజయ్ గాంధీ అకాలమరణంతో ఆయన భార్య మేనకాగాంధీ మొదటి నుంచి కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలోనే ఉన్నారు. ప్రస్తుతం ఆమె ఎన్డీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా ఉన్నారు. మేనక కుమారుడు వరుణ్‌గాంధీ బీజేపీ ఎంపీగా ఉన్నారు. దేశ రాజకీయాలను దాదాపు 120 సంవత్సరాలుగా ప్రత్యక్షంగా, పరోక్షంగా శాసిస్తూ వచ్చిన నెహ్రూ-గాంధీ కుటుంబంలో ఇపుడు ప్రియాంక రాజకీయ భవిష్యత్తును దేశ ప్రజలు నిర్ణయిస్తారు.

తొలుత మోతీలాల్ నెహ్రూ కాంగ్రెస్ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర వహించారు. ఆ తర్వాత ఆయన కుమారుడు జవహర్‌లాల్ నెహ్రూ మూడు సార్లు దేశ ప్రధానిగా బాధ్యతలు నిర్వహించారు. ఇందిరాగాంధీ 16 ఏళ్లపాటు, రాజీవ్ గాంధీ ఐదేళ్ల పాటు ప్రధానమంత్రి పదవిలో ఉన్నారు. కాశ్మీరీ బ్రాహ్మణులైన ఈ కుటుంబం దేశ రాజకీయాలపై 20వ శతాబ్దం అంతా తనదైన ముద్ర వేసింది. 21వ శతాబ్దంలో కూడా తమ పట్టును సడలనివ్వకుండా రాజకీయాల్లో ఈ కుటుంబ సభ్యులు తమ ఆధిపత్యాన్ని రుజువు చేసుకున్నారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉందంటే, అందుకు సోనియా గాంధీ రాజకీయ వ్యూహం, చతురత వల్లనేనని చెప్పాల్సిన పనిలేదు.

సంజయ్ గాంధీ అకాల మరణం, ఇందిరాగాంధీ ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోవడంతో పైలెట్‌గా ఉన్న రాజీవ్ గాంధీ అనూహ్య రీతిలో ప్రధానమంత్రి అయ్యారు. 1984 నుంచి 1989 వరకు ప్రధానిగా రాజీవ్ అనేక సంస్కరణలు తెచ్చినా, దౌత్యం, చాణక్యనీతి లోపించడం వల్ల శ్రీలంక తమిళుల విషయంలో చేసిన తప్పు ఆయన ప్రాణాలనే బలిగొంది. రాజీవ్ గాంధీ తమిళ ఉగ్రవాదుల చేతిలో మరణించడంతో దాదాపు ఆ కుటుంబం రాజకీయాలకు పదేళ్ల పాటు దూరమైంది. కాంగ్రెస్ పార్టీని రక్షించేందుకు రాజీవ్ భార్య సోనియా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా, యూపీఏ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆమె క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చిన చాలా సంవత్సరాల తర్వాత తర్వాత రాహుల్ గాంధీ పార్టీ పదవులను చేపట్టారు.



తమతో పొత్తుకు నిరాకరిస్తున్న ప్రాంతీయ పార్టీలకు చెక్ పెట్టేందుకు తన చెల్లెలు ప్రియాంకను రాహుల్ రంగంలోకి దింపారు. ఆమెను లోక్‌సభ ఎన్నికల్లో తమ ప్రచారానికి బ్రహ్మాస్త్రంగా ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ప్రియాంకను ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతం పార్టీ ఇన్‌చార్జిగా రాహుల్ నియమించారు. ఎఐసీసీ ప్రధాన కార్యదర్శిగా కూడా బాధ్యతలు అప్పగించారు. కాంగ్రెస్‌లో ప్రధాన కార్యదర్శి పదవి అంటే సామాన్య విషయం కాదు. వారసత్వ రాజకీయాల వల్లనే ఆమెకు అంత ఉన్నత పదవి సునాయాసంగా లభించింది.

మరో రెండు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ ప్రభంజనాన్ని ఎదుర్కొనేందుకు, తమతో పొత్తుకు నిరాకరిస్తున్న ప్రాంతీయ పార్టీలకు చెక్ పెట్టేందుకు తన చెల్లెలు ప్రియాంకను రాహుల్ రంగంలోకి దింపారు. ఆమెను లోక్‌సభ ఎన్నికల్లో తమ ప్రచారానికి బ్రహ్మాస్త్రంగా ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ప్రియాంకను ఉత్తరప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతం పార్టీ ఇన్‌చార్జిగా రాహుల్ నియమించారు. ఎఐసీసీ ప్రధాన కార్యదర్శిగా కూడా బాధ్యతలు అప్పగించారు. కాంగ్రెస్‌లో ప్రధాన కార్యదర్శి పదవి అంటే సామాన్య విషయం కాదు. వారసత్వ రాజకీయాల వల్లనే ఆమెకు అంత ఉన్నత పదవి సునాయాసంగా లభించింది. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు 2022లో జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో ముఖ్యమంత్రి పదవికి ప్రియాంక అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తామనే సంకేతాలు కూడా రాహుల్ ఇచ్చారు. అయితే, వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆమె రాజకీయ భవిష్యత్తు ఏ మలుపు తిరుగుతుందో తెలుస్తుంది. ఇప్పటికే యూపీలో బీఎస్పీ, ఎస్పీల మధ్య పొత్తు ఖరారైంది. యూపీ రాజకీయాల్లో బ్రాహ్మణులు 14 శాతం మంది ఉన్నారు. వీరితో పాటు ఠాకూర్లు, రాజపుత్రులు,వైశ్యులు, ఇతర అగ్ర వర్ణాల ఓట్లు గంపగుత్తగా కాంగ్రెస్‌కు పడేవి. ఈ ఓట్లు బీఎస్పీ, ఎస్పీలకు పడవు. 'మా ఓట్లు మీకు బదలాయింపు అవుతున్నాయి, కానీ మీ ఓట్లు మాకు రావడం లేదం'టూ ఇప్పటికే బీఎస్పీ అధినేత్రి మాయావతి కాంగ్రెస్‌తో పొత్తుకు గుడ్ బై చెప్పారు. ప్రియాంక వల్ల కాంగ్రెస్‌కు గత వైభవం వస్తుందా? లేదా?? అనేది లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో తేలిపోతుంది. కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికలు నిజంగా అగ్నిపరీక్షే. పార్టీని బలోపేతం చేయడం, ఇతర పార్టీలకు తరలివెళ్లిన ఓటు బ్యాంకును తిరిగి తెచ్చుకోవడం లాంటి పనులను జయప్రదంగా ప్రియాంక నిర్వహిస్తారా? అన్నది తేలాలి.

ప్రియాంక ముఖ కవళికలు ఇందిరా గాంధీతో పోలి ఉన్నాయని కొంత మంది కాంగ్రెస్ నేతలు చెబుతుంటారు. ఇటువంటి కాకమ్మ కబుర్లకు కాలం చెల్లింది. ఈ తరహా కాలదోషం పట్టిన సిద్ధాంతాలతో చేసే ప్రచారాలను నమ్మే స్థితిలో జనం లేరు.

భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకలో వారసత్వ రాజకీయాలను ప్రజలు ఆదరించే ధోరణి క్రమేపీ తగ్గుతుంది. ఈ దేశాల్లో ఒకప్పుడు వారసత్వ రాజకీయాలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. ఈ తరహా పాచికలను నమ్మి జనం ఓట్లు వేసే పరిస్థితులు ఇప్పుడు లేవు. బీజేపీని నిలువరించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని చెప్పడంలో సందేహానికి తావులేదు. ప్రజల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా రాజకీయంగా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని వారికి చేరువయ్యే ప్రయత్నాలు చేయడం వల్ల కాంగ్రెస్‌కు భవిష్యత్తు ఉంటుంది. రాహుల్ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే పెద్ద పొరపాటు చేసింది. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఆ సమయంలో కేంద్రమంత్రిగా రాహుల్ గాంధీ పదవీ బాధ్యతలను చేపట్టి ఉంటే కొంత అనుభవం వచ్చి ఉండేది. ఇందిరా గాంధీ లాల్ బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో పనిచేసి రాజకీయాలపై అవగాహన పెంచుకున్నారు. రాజకీయాలంటే ఇష్టపడని రాజీవ్ గాంధీ ఎకాఎకిన దేశ ప్రధాని అయ్యారు. కొన్ని విషయాల్లో అనుభవ రాహిత్యం వల్ల ఏమి జరిగిందో అందిరికీ తెలిసిందే.

పీవీ నరసింహారావు, వాజపేయి, మన్మోహన్‌సింగ్ లాంటి అగ్రశ్రేణి నేతలు ప్రధానిగా రాణించారంటే వారు అంతకుముందు పరిపాలనలో కీలకమైన పదవులు నిర్వహించారు. పీవీ మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్రంలో వివిధ పదవులు నిర్వహించి చివరకు ప్రధానమంత్రి అయ్యారు. ఆయన మంత్రివర్గంలోనే ఆర్థికశాఖ మంత్రిగా పనిచేసిన మన్మోహన్‌సింగ్ ప్రధాని అయ్యారంటే ఆ అనుభవం ఎంతో ఉపయోగపడింది. అటల్ బిహారీ వాజపేయి జనతా పార్టీ ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా పనిచేసి అందరి మన్ననలు పొందారు. సుదీర్ఘ రాజకీయానుభవం తర్వాత ప్రధాని అయ్యారు. దేవెగౌడ కూడా మంత్రిగా, కర్నాటక సీఎంగా పనిచేసిన తర్వాతనే ప్రధానమంత్రి పదవిని చేపట్టారు. ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా గుజరాత్ ముఖ్యమంత్రిగా 12 ఏళ్లు పనిచేశారు. ఈ అనుభవాలను చూసైనా రాహుల్, ప్రియాంకలు రాజకీయంగా పాఠాలు నేర్చుకోవాలి. నెహ్రూ- గాంధీ కుటుంబంలో పుట్టిన వారు ప్రధానమంత్రి పదవి తప్ప మరో పదవి చేపట్టరనే సెంటిమెంట్లు పనిచేయవు.


వారసత్వ రాజకీయాలపై విమర్శలను పక్కనపెడితే, ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కుమారుడు లోకేష్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించారు. దీని వల్ల పరిపాలనాపరంగా అనుభవం వస్తుంది. తెలంగాణ సీఎం కేసీఆర్ కూడా తన కుమారుడికి తొలి ఐదేళ్లు మంత్రిగా అవకాశం కల్పించారు. రెండవసారి గెలిచిన తర్వాత పార్టీ బాధ్యతలు అప్పగించారు. పార్టీలో,ప్రభుత్వంలో పనిచేయకుండా ఒకేసారి అత్యున్నత పదవిని చేపడితే వ్యక్తిగతంగా కంటే, దేశానికి చేకూరే నష్టం ఎక్కువ. వందిమాగధులు, భజనపరులు, అవాస్తవాలను వాస్తవాలుగా చూపేవారు అధికారం ఎక్కడ ఉంటే అక్కడ చేరుతారు. నేడు రాజకీయాల్లో వ్యక్తి ఆరాధన సంస్కృతిని ప్రజలు ఇష్టపడడం లేదు. స్వయం కృషితో పైకి వచ్చిన చంద్రబాబు, కేసీఆర్, మాయావతి, అఖిలేశ్ యాదవ్, నితీష్ కుమార్, షీలా దీక్షిత్, యోగి ఆదిత్యనాథ్ దాస్, శివరాజ్ సింగ్ చౌహాన్, అశోక్ గెహ్లాట్ లాంటి నేతలను కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం ఒక మోడల్‌గా తీసుకోవాలి. ప్రియాంక రాజకీయాల్లోకి వచ్చినంత మాత్రాన కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం దానంతట అదే వస్తుందనే పగటి కలలు, భ్రమల నుంచి ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు బయటపడడం మంచిది.

-కె.విజయ శైలేంద్ర 98499 98097

ఈవీఎంల 'ట్యాంపరింగ్' దుమారం!

దేశంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ చాలా మంది నేతలు ఈవీఎంల ట్యాంపరింగ్ పై పదే పదే మాట్లాడుతున్నారు. ఈ విషయమై ప్రస్తుతం పెద్ద దుమారమే చెలరేగుతోంది. బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఒకరిపై ఒకరు ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా చాలామంది రాజకీయ నాయకులు ఈవీఎంలను విశ్వసించడం లేదు. వాటి నిర్వహణ, వినియోగంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ఈవీఎంల ద్వారా అవకాశం ఉందని అనుమానిస్తున్నారు.

ఈ నేపథ్యంలో అమెరికా సైబర్ నిపుణుడు సయ్యద్ షుజా ఈవీఎంల ట్యాంపరింగ్‌పై ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ అనుమానాలకు ఊతం ఇచ్చాయి. ఇండియన్ జర్నలిస్ట్ అసోసియేషన్ యూరప్ విభాగం ఇటీవల లండన్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో షుజా కాలిఫోర్నియా నుంచి లైవ్ వీడియో ద్వారా మాట్లాడారు. 2014 లోక్‌సభ ఎన్నికలలో ఉపయోగించిన ఈవీఎంలను కొందరు ట్యాంపరింగ్ చేశారని ఆయన ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీల్లో ఇలా అక్రమాలు జరిగినట్లు వివరించారు. ఈ అవకతవకల వల్లనే కాంగ్రెస్ పార్టీ ఓడిపోయి బిజెపీ గెలిచిందని చెప్పారు. రిలయన్స్ కమ్యూనికేషన్స్ సంస్థ సాయంతో ఫ్రీక్వెన్సీ తగ్గించి ఈవీఎంలను హ్యాక్ చేశారని ఆయన ఆరోపించారు. 2015 ఢిల్లీ శాసనసభ ఎన్నికలు, ఇటీవల జరిగిన మధ్యప్రదేశ్- ఛత్తీస్‌గఢ్- రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో కూడా ఈవీఎంలను హ్యాక్ చేసి గెలిచేందుకు బీజేపీ ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. అయితే, తమ బృందం ఆ ప్రయత్నాలను అడ్డుకోవడం వల్ల ఈ రాష్ట్రాల్లో బీజేపీ ఓటమిపాలైందన్నారు. కాగా, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఈసీఐఎల్ ఆధ్వర్యంలో ఉన్నత ప్రమాణాలతో, కట్టుదిట్టమైన భద్రత, నిఘా మధ్య తయారైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లపై అనుమానాలకు తావులేదని భారత ఎన్నికల సంఘం (ఈసీ) స్పష్టం చేసింది. ఈవీఎంలను ట్యాంపర్ చేయడం సాధ్యం కానేకాదని వివరణ ఇచ్చింది. ఈవీఎం అనేది ఓట్లను నమోదుచేసే యంత్రం మాత్రమేనని, దానిని ఎవరూ నియంత్రించలేరని (ప్రోగ్రామ్ చేయలేరని) ఎన్నికల ప్రధాన అధికారి (సీఈసీ) సునీల్ అరోరా స్పష్టం చేశారు. గత లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన పలు శాసనసభ ఎన్నికల్లో ఫలితాలు భిన్నంగా వచ్చాయని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్‌లో జరిగే ఏ ఎన్నికల్లోనూ బ్యాలెట్ పత్రాలను ప్రవేశపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.



ప్రపంచంలో నూతన ఆవిష్కరణలు ఎన్ని జరుగుతున్నాయో అంతకుమించి వాటిని దుర్వినియోగం చేసేవారు కూడా తయారవుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా వినియోగిస్తున్నారో పరిశీలిస్తే ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యమేమీ కాదని అర్థమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో ఈవీఎంలను వినియోగించడం లేదు. 20 దేశాలలో మాత్రమే వినియోగిస్తున్నారు. టెక్నాలజీని ప్రమోట్ చేసే చంద్రబాబు ఈవీఎంలను వ్యతిరేకిస్తున్నారంటే కాస్త ఆలోచించవలసిన విషయమే. ప్రజాస్వామ్యాన్ని యంత్రాలపై ఆధారపడేలా చేయడం సమంజసం కాదని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. బ్యాలెట్ పత్రాల ద్వారా పోలింగ్ నిర్వహించాలని టీడీపీ, కాంగ్రెస్ సహా పలు పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈవీఎంలకు వ్యతిరేకంగా పోరాడతామని వీరు స్పష్టం చేశారు. దమ్ముంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బ్యాలెట్‌తో పోలింగ్ నిర్వహించాలని బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి ఛాలెంజ్ విసిరారు. ఈవీఎంలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న దృష్ట్యా వచ్చే సార్వత్రిక ఎన్నికలలో బ్యాలెట్‌లనే వినియోగించాలని జాతీయ స్థాయిలో 22 బీజేపీయేతర పార్టీల ప్రతినిధులు త్వరలో ఎన్నికల సంఘాన్ని కలిసి కోరనున్నారు. ఈవీఎంలపై ఇన్ని అనుమానాలు, ఇంత దుమారం రేగుతున్న సమయంలో ఎన్నికల సంఘం బాధ్యత మరింత పెరుగుతోంది. ఈవీఎంలను దుర్వినియోగం చేయడానికి అవకాశం ఉన్నందున ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా బ్యాలెట్ల అంశాన్ని ఎన్నికల సంఘం పరిశీలించాలి. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఈవీఎంలనే వినియోగించినా తగిన జాగ్రత్తలు, గట్టి భద్రతా చర్యలు తీసుకోవలసిన అవసరం ఎన్నికల సంఘంపై ఉంది.

-శిరందాసు నాగార్జున 94402 22914

కక్ష సాధిస్తున్న అమెరికా

ఉత్తరాయణం

అమెరికా పెత్తనాన్ని ధిక్కరిస్తూ సామ్యవాదాన్ని అవలంబిస్తున్న దేశంగా నిలిచిన వెనెజులా తీవ్ర సంక్షోభంలో ఉంది. గత కొన్నేళ్లుగా ఆర్థిక యుద్ధంలో ఉన్నట్లు ప్రకటించిన ఆ దేశం ప్రస్తుతం రాజకీయ, సామాజిక సంక్షోభంలో చిక్కుకోవడంలో అమెరికా హస్తం ఉంది. ఆ దేశపు తిరుగులేని నేత చావెజ్ మరణించిన పిమ్మట అధ్యక్షుడిగా మదురో ఎన్నిక కాబడినా ఆ దేశపు రాజకీయ, ఆర్థిక అంతర్గత విషయాల్లో నేరుగా తలదూర్చడం అమెరికా పెద్దల వశం కాలేదు. అందుకనే పరోక్ష పద్ధతుల్లో వెనెజులా దేశాన్ని దారిలోకి తెచ్చుకోడానికి అమెరికా పాలకులు చూస్తున్నారు. ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మొదలైన ఆంక్షల యుద్ధం ట్రంప్ జమానాలో మరింత ఉధృతమైంది. వెనెజులా దేశానికి ఆదాయంలో ముఖ్యభాగం పెట్రోల్ ఎగుమతులు ద్వారా వస్తుంది. అమెరికా అంచెలంచెలుగా ఆ దేశం నుండి పెట్రోల్ దిగుమతులు తగ్గిస్తూ వచ్చింది. గత కొద్ది ఏళ్లుగా పెట్రోల్ ధరలు తగ్గుతూ రావడంతో వారి ఆదాయం తగ్గింది. ద్రవ్యోల్బణం కొన్ని లక్షల శాతం పెరిగింది. మందులు, తిండిగింజల కొరత పెరిగింది. ఇలాంటి సందర్భంలో రాజకీయ సంక్షోభం ఆ దేశానికి మరో శాపమైంది. ప్రజాభిప్రాయంతో ఎన్నికల ద్వారా మదురో అధ్యక్షుడిగా ఉన్నారు. జాతీయ అసెంబ్లీ అధ్యక్షుడిగా ఉన్న ప్రతిపక్ష నాయకుడు గైడో తాను దేశాధ్యక్షునిగా ప్రకటించుకొంటే వెంటనే అమెరికా, దాని మిత్రదేశాలు అతణ్ణి గుర్తిస్తున్నట్టు ప్రకటించాయి. అయితే వెనెజులా సైన్యం కూడా గైడో నాయకత్వాన్ని ఆమోదించలేదు. ఈ అంతర్గత వివాదాన్ని చూపి అమెరికా వెనెజులాలో అతిపెద్ద ప్రభుత్వ పెట్రోలియం సంస్థ లావాదేవీల్ని స్తంభింపచేసింది. తద్వారా మరింత ఆర్థిక నష్టాల్లోకి ఆ దేశాన్ని నెట్టడం, దారిలోకి తెచ్చుకోవడం అమెరికా ఎత్తుగడ. ఇది అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు, వ్యాపార నిబంధనలకు విరుద్ధం. అంతర్జాతీయ సమాజం ఈ దుందుడుకు చర్యను ఖండించాలి.

-డా. డీవీజీ శంకరరావు, పార్వతీపురం

త్వరలోనే ప్రజల ముందుకు నిజాలు

❑ 'రాఫెల్'పై మరోసారి రెచ్చిపోయిన రాహుల్
❑ ప్రధానికి సరిగా నిద్ర కూడా పట్టడం లేదని వ్యంగ్యాస్త్రాలు

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 30: రాఫెల్ యుద్ధ విమానాల కుంభకోణానికి సంబంధించిన నిజాలు త్వరలోనే దేశ ప్రజల ముందుకు వస్తాయని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చెప్పారు. బుధవారం ఢిల్లీలో కాంగ్రెస్ 'యువ క్రాంతి ర్యాలీ'లో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రిలయెన్స్ అధినేత అనిల్ అంబానీకి సహాయం చేసేందుకే రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం చేసుకున్నారని ఆయన పదేపదే ఆరోపించారు.

ఈ కొనుగోలు గురించి అప్పటి రక్షణ శాఖ మంత్రి మనోహర్ పారిక్కర్‌తో చర్చించలేదు.. రక్షణ శాఖ అధికారులతో చర్చించలేదని ఆయన ఆరోపించారు. రాఫెల్ కుంభకోణం నిజాలను ఎన్‌డీఏ ప్రభుత్వం లోనివారే బయటపెడతారని రాహుల్ చెప్పారు. ఈ కుంభకోణం మూలంగా నరేంద్ర మోదీకి నిద్రకూడా పట్టడం లేదని.. కలలో కూడా ఆయనకు దేశం, రాఫెల్ యుద్ధ విమానం.. భారత వాయుసేన, హెచ్‌ఏఎల్ కనిపిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు తెలిపారు. అనిల్ అంబానీని, బ్యాంకులకు వేలాది కోట్ల రూపాయల మేరకు టోపీపెట్టిన నీరవ్ మోదీని కూడా నరేంద్ర మోదీ 'అన్నా' అని పిలుస్తారు.. దాని అర్థం ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించని మోదీ కొందరు పారిశ్రామికవేత్తల కోట్లాది రూపాయల రుణాలు రద్దు చేయించారని ఆరోపించారు. దేశంలోని యువతకు ప్రతి సంవత్సరం కోటి ఉద్యోగాలు కల్పిస్తానంటూ ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రధాని మోదీని నిలదీశారు.



మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతుల రుణాలను అధికారంలోకి వచ్చిన పది రోజుల్లో మాఫీ చేశాయని రాహుల్ చెప్పారు. దేశంలో డబ్బు కొరత లేదు.. అనిల్ అంబానీకి 32వేల కోట్లు ఇస్తారు.. కానీ రైతుల రుణాలు మాఫీ చేయరు.. రుణాలు ఇప్పించలేరు అంటూ ఆయన ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. రుణాలు మాఫీచేస్తే రైతుల అలవాట్లు దెబ్బతింటాయంటారు.. అనిల్ అంబానీకి ప్రజల డబ్బు ఇప్పిస్తే ఆయన అలవాట్లు చెడిపోవా? అని ప్రశ్నించారు. పారిశ్రామికవేత్తల రుణాలు మాఫీ అయితే రైతుల రుణాలు కూడా మాఫీ కావాలి.. న్యాయం అందరికీ సమానంగా ఉండాలని ఆయన చెప్పారు. స్వచ్ఛభారత్ పేరుతో అందరితో చీపురుకట్ట పట్టించే నరేంద్ర మోదీ పారిశ్రామికవేత్తలు అనిల్ అంబానీ, అదానీలతో చీపురు ఎందుకు పట్టించరు? వారికి స్వచ్ఛభారత్ అవసరం లేదా? అని రాహుల్ నిలదీశారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు అభివృద్ధి చెందితేనే చైనాతో పోటీ పడగలుగుతాం.. నరేంద్ర మోదీ ప్రభుత్వం చిన్న, మధ్యతరహా పరిశ్రమలను చావుదెబ్బ తీసిందని అన్నారు. యువకులకు ఉపాధి కల్పించకుండా పకోడీలు వేసుకుని బతక మంటున్నారంటూ ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లలో దేశాన్ని విభజించే పని చేశారు. జమ్మూకశ్మీర్, తమిళనాడు, హర్యానా, కేరళ తదితర రాష్ట్రాల్లో మంట పెడుతున్నారు.. దేశాన్ని ముక్కలు చేస్తున్నారని రాహుల్ తీవ్రంగా ఆరోపించారు. కేవలం కాంగ్రెస్ మాత్రమే దేశాన్ని సమైక్యంగా ఉంచగలుగుతుందని ఆయన ప్రకటించారు. కాంగ్రెస్ మాత్రమే దేశ ప్రజలను సరైనదారిలో నడిపించగలుగుతుందని అన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని రాహుల్ జోస్యం చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశ ప్రజలకు కనీస ఆదాయం హక్కు కార్యక్రమాన్ని అమలు చేస్తామని ఆయన మరోసారి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ పారిశ్రామికవేత్తలకు వ్యతిరేకం కాదు.. దొంగ పారిశ్రామికవేత్తలు, నరేంద్ర మోదీతో ఉంటున్న పారిశ్రామికవేత్తలకు వ్యతిరేకమని రాహుల్ తెలిపారు. కాంగ్రెస్ యువత దేశ ప్రజలకు ప్రాతినిధ్యం వహించాలి.. వారి ప్రయోజనాల పరిరక్షణ కోసం పోరాడాలని అన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ విధానాలు సరైనవి కావని, ఈ దేశం అన్ని వర్గాలు, మతాలు, కులాలకు చెందిందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇక మీదట ముందుండి పోరాడుతుందని రాహుల్ మరోసారి ప్రకటించారు.



ఫిలిప్పీన్స్‌లోని మకాటీలో 47 అంతస్తుల జీటీ టవర్ బిల్డింగ్‌ను ఎలాంటి సహాయక లేదా రక్షణ సామాగ్రి లేకుండానే ఎక్కిన ఫ్రెంచ్ క్లైంబర్ అలైన్ రాబర్ట్‌ను అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసులు. ప్రపంచంలోని ఎత్తయిన భవనాలను ఈ విధంగా ఎక్కుతూ 'స్పైడర్‌మన్' అని పేరుతెచ్చుకున్న ఈ ఫ్రెంచ్ వీరుడు మనీలాకు తూర్పున ఉన్న జీటీ టవర్‌ను రెండు గంటల్లోపే ఎక్కేశాడు. కిందికి దిగిన తర్వాత పోలీసులు అతనిని విచారణ నిమిత్తం అరెస్టు చేశారు. లాంఛనంగా ప్రశ్నించిన తర్వాత విడిచిపెట్టారు.

యూపీలో రోడ్డు ప్రమాదం

❑ ఐదుగురు మృతి

సోనాభద్ర (యూపీ), జనవరి 30: యూపీలో జరిగిన రోడ్ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. వేగంగా వచ్చిన ట్రక్ బస్సును ఢీకొని పక్కనే ఆగిఉన్న ట్రక్కుపైకి దూసుకుపోయిన సంఘటనలో ఐదుగురు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం యూపీలోని అనపర పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైరపన్ గ్రామంలో మంగళవారం రాత్రి వేగంగా వచ్చిన ఒక ట్రక్కు ఒక బస్సును ఢీకొని సమీపంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో ఆగిఉన్న ట్రక్కుపైకి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆగిఉన్న ట్రక్కు వద్ద టైరు మారుస్తున్న వారితో పాటు బస్సులోని ప్రయాణికులు మొత్తం ఐదుగురు సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్టు పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి శైలేష్ రాజ్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రక్కు డ్రైవర్ దానిని అక్కడే వదిలేసి పరారయ్యాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

పారిశ్రామికవేత్తలకు జమ్మూకాశ్మీర్‌లో ప్రోత్సాహం

❑ 50 కోట్లు అంతకన్నా ఎక్కువ పెట్టుబడులు పెడితే పన్ను రీయింబర్స్‌మెంట్
❑ ఆమోదం తెలిపిన ఎస్ఏసీ

జమ్మూ, జనవరి 30: జమ్మూ, కాశ్మీర్‌లో పారిశ్రామిక రంగంలోకి పెట్టుబడులను ప్రోత్సహించే నిమిత్తం గవర్నర్ సత్యపాల్ మాలిక్ నేతృత్వంలోని స్టేట్ అడ్మినిస్ట్రేటివ్ కౌన్సిల్ (ఎస్ఏసీ) రాష్ట్రానికి చెల్లించిన పన్నులను రీయింబర్స్‌మెంట్ (తిరిగి చెల్లింపు) చేయడానికి అంగీకారం తెలిపింది. పారిశ్రామిక పాలసీ-2016 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక, సేవా రంగాల నుంచి ప్రతిఏడాది రెండు వేల కోట్ల రూపాయలను పెట్టుబడులుగా సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే పలు పారిశ్రామిక సంస్థలకు రాష్ట్రం అవి చెల్లించిన పన్నులకు రీయింబర్స్ చేస్తూ, కేంద్రం ఎప్పటికప్పుడు ప్రవేశపెడుతున్న పలు పథకాలను అమలు చేస్తూ, ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను అడ్జస్ట్ చేస్తూ వాటిని ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలోనే పెట్టుబడుదారులను మరింత ఆకర్షించాలన్న ధ్యేయంతో ఏడాదికి రెండు వేల కోట్ల రూపాయల పెట్టుబడులను సేకరించాలని ధ్యేయంగా పెట్టుకుంది. దీంతో రాష్ట్రంలో 50 కోట్లు, అంతకన్నా ఎక్కువ మొత్తంతో కొత్తగా పరిశ్రమలను ఏర్పాటు చేసే వారికి, ఉన్న వాటిని విస్తరించే వారికి రాష్ట్రపన్నులను రీయింబర్స్ చేయాలని గవర్నర్ నేతృత్వంలోని ఎస్ఏసీ నిర్ణయించిందని అధికార ప్రతినిధి ఒకరు బుధవారం తెలిపారు. అయితే స్టేట్ గూడ్స్, సర్వీస్ టాక్స్ (ఎస్‌జీఎస్‌టీ)ని నగదు రూపంలో చెల్లించిన వారికి ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను సర్దుబాటు చేసిన తర్వాతే ఈ రీయింబర్స్‌మెంట్‌ను వర్తింపజేస్తారని ఆయన చెప్పారు. అయితే ఈ ఏడాది జనవరి ఒకటిన ప్రభుత్వం విడుదల చేసిన నెగటివ్ పరిశ్రమలకు ఈ ప్రోత్సాహం వర్తించదు. ఈ లిస్టులో టొబాకో, పాన్‌మసాలా, ప్లాస్టిక్ కేరీ బ్యాగ్స్, పవర్ ఉత్పత్తి పరిశ్రమలు, కోక్, ఫ్లైయాష్, సిమెంట్, స్టీల్, రోలింగ్ మిల్లులు ఉన్నాయి. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించి, తద్వారా రాష్ట్రంలో మరింత మందికి ఉద్యోగాలు కల్పించాలన్న ధ్యేయంతో ఈ రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టామని అధికారి ప్రతినిధి తెలిపారు.

పరువునష్టం కేసులో వివేక్‌దోవల్ స్టేట్‌మెంట్ నమోదు

న్యూఢిల్లీ, జనవరి 30: అసత్య ఆరోపణలతో తనపై ఆర్టికల్‌ను ప్రచురించినందుకు, దానిని ఆధారంగా చేసుకుని విమర్శలు చేసినందుకు 'ద కారవాన్' మేగజైన్‌పై, కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్‌పై అజిత్ దోవల్ కుమారుడు వివేక్ దోవల్ వేసిన పరువునష్టం కేసుకు సంబంధించి ఆయన స్టేట్‌మెంట్‌ను కోర్టు బుధవారం రికార్డు చేసింది. అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ సమర్ విశాల్ వద్ద ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. తనపై ఆరోపణలు అన్నీ ఆధార రహితమని, మేగజైన్‌లోని కథనం ఆధారంగా జైరాం రమేష్ చేసిన నిరాధారణ ఆరోపణలు తన పరువుకు తీవ్ర భంగం కలిగించేవిధంగా ఉన్నాయని ఆయన కోర్టుకు తెలియజేశారు. ఆయనతో పాటు అతని స్నేహితుడు నిఖిల్‌కపూర్, వ్యాపార భాగస్వామి అమిత్‌శర్మ కూడా వివేక్‌దోవల్‌కు అనుకూలంగా తమ స్టేట్‌మెంట్లను ఇచ్చారు. ద కారవాన్ మేగజైన్, జైరాం రమేష్ తన తండ్రి పరువుకు భంగం కలిగించడానికి ఉద్దేశపూర్వకంగానే తనపై ఈ ఆరోపణలు చేశారని ఆయన తన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇంకా పలువురి ప్రకటనలు రికార్డు చేయాల్సి ఉందని పేర్కొంటూ కోర్టు కేసును ఫిబ్రవరి 11కు వాయిదా వేసింది. కాగా, ద కారవాన్ మేగజైన్ ఆన్‌లైన్‌లో జనవరి 16న 'ద డీ కంపెనీస్' శీర్షికతో ఒక వార్తాకథనాన్ని ప్రచురించింది. పన్నుకట్టని వారికి స్వర్గధామంగా భావించే కేమాన్ ఐలాండ్స్‌లో వివేక్ దోవల్ పెట్టుబడులు పెట్టి హెడ్జింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించింది. మోదీ 500, వెయ్యి రూపాయల నోట్ల రద్దు నిర్ణయం ప్రకటించిన 13 రోజుల తర్వాత ఇది జరిగిందని పేర్కొంది.

ఈయూది సమష్టి నిర్ణయం

❑ మిచెల్ బార్నియర్

బ్రస్సెల్స్, జనవరి 30: బ్రిటన్ వ్యవహారంలో యూరోపియన్ యూనియన్(ఈయూ)ది ఒకే విధానమని బ్రిగ్జిట్ సంధానకర్త మిచెల్ బార్నియర్ స్పష్టం చేశారు. 'బ్రిగ్జిట్ ఒప్పందంపై మధ్యవర్తిత్వానికి ఈయూ సిద్ధం. యూకేతో మాట్లాడేందుకు ఇబ్బంది లేదు. ఈయూ ఎప్పుడూ యూకేకు వ్యతిరేకం కాదు'అని బుధవారం ఆయన స్పష్టం చేశారు. గతవారం బ్రిటన్ పార్లమెంట్‌లో బ్రిగ్జిట్‌పై జరిగిన చర్చ, ఓటింగ్ తదితర అంశాలపై యూరోపియన్ పార్లమెంట్ అధికారులతో బార్నియర్ చర్చలు జరిపారు.

విపత్తులపై యుద్ధం

❑ జమ్మూకాశ్మీర్‌లో ఎమర్జెన్సీ సెంటర్లు ❑ అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు

జమ్మూ, జనవరి 30: జమ్మూకాశ్మీర్‌లో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధంగా ఉంది.

పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేయడంతో పాటు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ల(ఈఓసీలు) ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కేంద్రాలు అన్ని జిల్లా కేంద్రాల్లో ఏర్పాటుచేయనున్నారు. విపత్తుల నివారణ సంస్థ, పునరావాసం, పునర్నిర్మాణ విభాగం కార్యదర్శి ఫరూక్ అహ్మద్ అబ్దుల్లా అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆధునిక సాంకేతి పరిజ్ఞానంతో ఆపరేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అననుకూల పరిస్థితులు, అవాంఛనీయ సంఘటనల ఏర్పడే పరిస్థితులు తలెత్తినప్పుడు సామాన్య ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటారు. 'జమ్మూకాశ్మీర్‌లో రకరకాలపై ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయి. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనడానికి ఈఓసీలు కీలక భూమిక పోషిస్తాయి'అని షా వెల్లడించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం నివారించేందుకు కేంద్రాలు పనిచేస్తాయని ఆయన అన్నారు.

జిల్లా అధికారులలో కలిసి ఓ కార్యాచరణ రూపొందించుకోవాలని డీఎంఆర్ఆర్ అధికారులను ఆయన ఆదేశించారు. తక్షణం ఈఓసీల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. అవసరమైన సామగ్రి, పరికరాలు, సమాచార వ్యవస్థ, శాటిలైట్ ఫోన్ సౌకర్యం సమీకరించుకోవాలని ఆయన అన్నారు. సమావేశానికి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

మా రైతాంగాన్ని ఆదుకోండి

❑ తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయండి ❑ కేంద్ర మంత్రికి టీడీపీ బృందం విజ్ఞప్తి

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 30: పెథాయ్ తుపాను, వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ విజ్ఞప్తి చేసింది. కరవు, తుఫాన్లు, వర్షాల మూలంగా నష్టపోయిన రైతులను కేంద్రం ఆదుకోవాలని బుధవారం రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు నేతృత్వంలో తెలుగు దేశం ఎంపీల బృందం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి కృష్ణరాజ్‌ను కలిశారు. అనంతరం ప్రత్తిపాటి, సోమిరెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ వరుస విపత్తులతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ రైతులను ఆదుకోవాలని కేంద్ర మంత్రిని కోరినట్టు చెప్పారు. ఇటీవల తుపాన్లు, వర్షాల ప్రభావంతో తడిసిపోయిన ధాన్యాన్ని కేంద్ర కొనుగోలు చేయాలని కోరినట్టు వెల్లడించారు. రాష్ట్రంలో మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోయిందని, దాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలోని రైతులకు ఇన్పుట్ సబ్సిడీ కింద రూ.1970 కోట్లు కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సి ఉందని, ఆ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరినట్టు చెప్పారు. ఏపీ రైతులకు రావాల్సిన పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరినట్టు వెల్లడించారు. వరస విపత్తులతో సతమతమవుతున్న ఏపీకి రూ.4919కోట్లు నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక సమర్పిస్తే, కేవలం రూ.900 కోట్లు మాత్రమే కేంద్రం విడుదల చేసిందని వారు ఆరోపించారు. కేంద్ర మంత్రిని కలిసిన బృందంలో మాగంటి బాబు, పి.రవీంద్రబాబు, తోట సీతారామలక్ష్మి, గల్లా జయ్‌దేవ్ ఉన్నారు.



కరవు, తుపాన్లు, వర్షాల మూలంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బుధవారం తెలుగుదేశం ఎంపీల బృందం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి కృష్ణరాజ్‌ను కలిసిన దృశ్యం



భారత పౌరసత్వం సవరణ బిల్లు (2016)ను వ్యతిరేకిస్తూ, గతంలో తమకు ఇచ్చిన జ్ఞాపికలతో గౌహతిలోని కాంరప్ మెట్రో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన నిరసర ప్రదర్శన. అసోం ఉద్యమంలో అసువులు బాసిన 855 వీరుల కుటుంబాలకు చెందిన వీరంతా సౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నారు.

పౌరసత్వ బిల్లుపై వెనుకడుగు లేదు

❑ త్రిపుర సీఎం దేవ్ స్పష్టీకరణ

కోల్‌కతా, జనవరి 30: ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించి పౌరసత్వ బిల్లుపై వెనకడుగు వేసే ప్రసక్తిలేదని త్రిపుర ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్ స్పష్టం చేశారు. కొన్ని సంస్థలు ఉద్దేశపూర్వకంగానే బిల్లును వ్యతిరేకిస్తున్నాయని, వాటికి జనం మద్దతు లేదని ఆయన విమర్శించారు. రాజకీయ ప్రయోజనాలను ఆశించే పౌరసత్వ బిల్లును అడ్డుకుంటున్నాయని దేవ్ ఆరోపించారు. 'బిల్లును బీజేపీ వెనక్కి తీసుకుంటుందని కొందరు ప్రచారం చేస్తున్నారు. అదంతా వట్టిదే. నిరాధారమైన ఆరోపణలు. బీజేపీ వెనక్కి తగ్గలేదన్నది మాత్రం వాస్తవం'అని ఆయన వెల్లడించారు. పౌరసత్వ బిల్లును వ్యతిరేకిస్తున్న పరిస్థితుల్లోనూ ఈనెల 19న జరిగిన హిల్ కౌన్సిల్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిందని ఆయన తెలిపారు. ఉత్తర చఛార్ హిల్స్ అటానమస్ కౌన్సిల్ ఎన్నికల్లో 28 స్థానాలకు 19 చోట్ల బీజేపీ గెలిచిందని త్రిపుర సీఎం స్పష్టం చేశారు. ఈ ఫలితాలను బట్టి చూస్తే బీజేపీ తలపెట్టిన పౌరసత్వ బిల్లుకు జనం మద్దతు ఇస్తున్నట్టు అర్థమవుతోందని ఆయన పేర్కొన్నారు. 2014 డిసెంబర్ 31 తరవాత బంగ్లాదేశ్, ఆఫ్గనిస్తాన్, పాకిస్తాన్ నుంచి వచ్చిన ముస్లిం యేతరులకు భారత పౌరసత్వం లభిస్తుందని దేవ్ తెలిపారు. లోక్‌సభలో బిల్లుకు ఆమోదం లభించడంతో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. విశాల దృక్పథంతో తీసుకొస్తున్న పౌరసత్వ బిల్లును కొన్ని పార్టీలు, సంస్థలు వ్యతిరేకించడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ఆ నాయకులకు జనాదరణ లేదా మద్దతు లేదని విప్లవ్‌కుమార్ దేవ్ విమర్శించారు. ఈశాన్య రాష్ట్రాల్లో 25 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ 300 లోక్‌సభ స్థానాలు కైవసం చేసుకుంటుందని త్రిపుర సీఎం జోస్యం చెప్పారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడుతుందని తెలిపారు.

పెరిగిన చలితీవ్రత

చండీగఢ్, జనవరి 30: పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో చలితీవ్రత కొనసాగుతూనే ఉంది. బుధవారం కనిష్ట ఉష్ణోగ్రతల స్థాయి స్వల్పంగా పెరిగిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌లో ఆరు డిగ్రీలు, పాటియాలలో 6.6, అమృతసర్‌లో 7 అంబాలలో 7.7, 8.8 డిగ్రీల సెల్సియస్ లుధియానాలో నమోదైనట్టు వారు చెప్పారు. కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్‌లో రికార్డు స్థాయిలో 7 డిగ్రీల సెల్సియల్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే హర్యానాలోని హిసార్‌లో రికార్డుస్థాయిలో 5.1 డిగ్రీల సెల్సియస్ కనిష్టం నమోదు కాగా, భివానిలో 6, సిర్సాలో 6.8, 7.7లో అంబాలలో నమోదైనట్టు వాతావరణ శాఖ అధికారులు వివరించారు.




సర్వే తారుమారు కావడం ఇదే తొలిసారి

❑ తెలంగాణ ఎన్నికల ఫలితాలపై లగడపాటి ❑ ఎవరి ప్రలోభాలకు లొంగనని స్పష్టీకరణ

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 30: ఇకనుంచి పార్లమెంట్, శాసనసభల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే సర్వే ఫలితాలను వెల్లడిస్తానని విజయవాడ మాజీ లోక్‌సభ సభ్యుడు లగడపాటి రాజగోపాల్ వెల్లడించారు. ఢిల్లీలో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తెలంగాణ శాసనసభ ఎన్నికల ఫలితాలపై అనుమానాలను వ్యక్తం చేశారు. తెలంగాణ సర్వే ఫలితాలు తను ప్రకటించనప్పటి నుంచీ తన వ్యక్తిత్వంపై కొన్ని పత్రికలు, కొంత మంది సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, అందుకే ఇన్ని రోజుల తరువాత మీడియా ముందుకు వచ్చినట్టు వెల్లడించారు. ఇప్పటివరకు తను వెల్లడించిన ఫలితాలలో తెలంగాణ ఎన్నికలు మొదటి సారిగా తారుమారయ్యాయని చెప్పారు. తెలంగాణలో పోలింగ్ శాతం వివరాలు చాలా ఆలస్యంగా రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించిందని, ఆ వివరాలను ప్రకటించడానికి ఒకటిన్నర రోజులు ఎందుకు పట్టిందని ఆయన ప్రశ్నించారు. ఎలక్ట్రానిక్ యుగంలో ఇంత సమయం ఈసీకి ఎందుకు పట్టిందన్నారు. వీవీప్యాట్‌లు లెక్కిస్తే అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చని, దీనిపై హైకోర్టులో కేసు విచారణ జరుగుతోందని అన్నారు. శాసనసభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఏకపక్షంగా విజయం సాధించిన వెంటనే జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ బలం గణనీయంగా పెరిగిందని అన్నారు. తెలంగాణ శాసనసభ ఎన్నికల సర్వే ఫలితాల వెల్లడించడంలో తాను ప్రలోభాలకు లొంగి ఫలితాలను వెల్లడించారని కొందరు విమర్శలు చేశారని.. తాను ఎవరికీ లొంగే వ్యక్తిని కాదని.. తాను ఏ పార్టీకి చెందని స్వతంత్ర వ్యక్తినని పేర్కొన్నారు. నా సర్వే తప్పయితే తప్పుని ఒప్పుకోవడానికి ఎలాంటి అభ్యతరం లేదని, నావల్ల ఎక్కడైన తప్పు జరిగితే క్షమాపణ చేప్పేందుకు సిద్ధమేనని చెప్పారు. రాష్ట్ర విభజన విషయంలో తాను చెప్పిన మాటకు కట్టుబడి రాజకీయాల నుంచి తప్పుకున్నానని, మళ్లీ వివిధ పార్టీలు తమ పార్టీలో చేరాలని ఒత్తిడి చేసినా రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని ప్రకటించారు.



అవకాశం వస్తే మాత్రం తెలంగాణ నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు మారోసారి ప్రకటించారు. తెలుగుదేశం పార్టీలోకి ఎప్పుడు చేరుతున్నారని విలేఖరులు ప్రశ్నించాగా.. తాను చాటుమాటు రాజకీయాలు చేసే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. మళ్లీ రాజకీయాలకు రావాలనుకుంటే అందరికీ చెప్పే వస్తానని అన్నారు. ఇటీవల ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఎందుకు కలిశారని విలేఖరులు ప్రశ్నించగా.. ఆ విషయాలను బయటకు చెప్పేందుకు లగడపాటి నిరాకరించారు.

మేఘాలయ చర్చిలో దోపిడీ

❑ మతగురువులపై దాడి ❑ డబ్బు తస్కరించి పరారీ

తురా(మేఘాలయ), జనవరి 30: గుర్తు తెలియని దుండగులు చర్చిలోని ఇద్దరు సీనియర్ క్రైస్తవ మత గురువులపై దాడిచేసి గాయపరచడంతోబాటు సుమారు లక్ష రూపాయల నగదు తస్కరించి పరారైన ఘటన మేఘాలయలోని వెస్ట్‌గ్యారోహిల్స్ జిల్లాలో బుధవారం తెల్లవారు ఝామున చోటుచేసుకుంది. ఓ సీనియర్ పోలీసు అధికారి కథనం మేరకు గత నెల రోజుల వ్యవధిలో ఈప్రాంతంలోని చర్చిల వద్ద ఇలాంటి నాలుగు దోపిడీ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఒకే గ్యాంగ్ ఈ దోపిడీలన్నింటికీ కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. సుమారు రాత్రి 1గంట ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో ఇరవై మంది దుండగులు ఇక్కడి డామినిక్ సావియో మిషన్ భవనంలోకి చొరబడ్డారు. మత గురువులు రెవరెంట్ ఎఫ్ఆర్ థామస్ జాన్, డేనియల్ ఎం. సంగ్మాలను తాళ్లతో బంధించి ఇనుప రాడ్లతో చితక బాదారు. తర్వాత చర్చిలో విధ్వంసానికి పాల్పడి సుమారు 1.25 లక్షల రూపాయల విలువైన నగదు, రెండు స్మార్ట్ ఫోన్లు తీసుకుని పరారయ్యారని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎంజీఆర్ కుమార్ విలేఖరులకు తెలిపారు. ఈఘటనపై డామ్నిక్ సేవియో మిషన్ అధినేత, మత గురువు జాన్ మాథియాస్ ఎం మరాక్ పోలీసులకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను చూస్తుండగానే దుండగులు చర్చి అలారమ్ వద్ద సైతం అడ్డుగా నిలిచి ఘాతుకాలకు పాల్పడి పరారయ్యారని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ఈస్ట్‌గారోహిల్స్ ప్రాంతంలోని దావగ్రే వద్ద, సౌత్‌గారో హిల్స్ ప్రాంతంలోని చోక్‌పోట్, పశ్చిమ ప్రాంతంలోని దాలూ వద్ద గతంలో చోటుచేసుకున్న దోపిడీ ఘటనల్లాగే ఇవీ ఉన్నాయని ఎస్పీ కుమార్ తెలిపారు. దుండుగులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

11న భారత్‌లో ఇజ్రాయిల్ ప్రధాని పర్యటన

జెరూసలెం, జనవరి 30: ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ఫిబ్రవరి 11న భారత్‌లో పర్యటించనున్నారు. తన ఒకరోజు పర్యటనలో నెతన్యాహూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో వివిధ అంశాలపై చర్చలు జరుపనున్నారు. గత ఏడాది జనవరి జనవరిలో ఇజ్రాయిల్ ప్రధాని తొలిసారిగా మన దేశంలో పర్యటించారు. ఇపుడు రెండోసారి మళ్లీ పర్యటనకు రానున్నారు. యూదు దేశంలో తొలిసారిగా పర్యటించిన ఘనత భారత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కింది. 2017లో మోదీ ఇజ్రాయిల్‌లోని టెల్ అవివ్‌లో పర్యటించారు. ఫిబ్రవరి 11న జరిగే ఒకరోజు పర్యటనలో ఇజ్రాయిల్ పర్యటనలో కేవలం ప్రధాని మోదీని మాత్రమే కలుసుకుని వివిధ అంశాలపై నెతన్యాహూ చర్చలు జరుపుతారని సంబంధిత అధికార వర్గాలు పీటీఐ ప్రతినిధికి స్పష్టం చేశాయి. ఇదిలావుండగా ఇజ్రాయిల్ జాతీయ భద్రతా సలహాదారు మీర్ బెన్ షబ్బత్ గత నెలలో భారత్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో ఆయన చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో ఇరు దేశాల ప్రధానమంత్రుల ఒకరోజు సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇజ్రాయిల్‌లో క్నెస్సెట్ (పార్లమెంటు) ఎన్నికలు ఈ ఏడాది 9వ తేదీన జరుగనున్న నేపథ్యంలో మళ్లీ అధికారంలోకి రావాలని ఉవ్విళ్లూరుతున్న నెతన్యాహూ వివిధ దేశాలతో అంతర్జాతీయ సంబంధాలు మరింత బలపరచుకునేందుకు భారత పర్యటన దోహదం చేస్తుందని భావిస్తున్నారు.



హైకోర్టు సీజే రాధాకృష్ణన్‌తో సమావేశమైన బీసీ కమిషన్ సభ్యులు

రిజర్వేషన్ల కోసం 1న బీసీల చలో ఢిల్లీ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు 27 నుంచి 50 శాతానికి పెంచాలని కేంద్రంపై వత్తిడి తెచ్చేందుకు ఫిబ్రవరి 1న నిర్వహించ నున్న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమంలో బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఢిల్లీలో రాష్ట్రపతిని, ఉప రాష్ట్రపతిని, పలువురు కేంద్ర మంత్రులను, 36 ప్రతిపక్షాల నాయకులను కలిసి బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టేలా, ఆమోదం పొందేలా కృషి చేయాలని కోరనున్నట్లు కృష్ణయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ, రాజకీయ, పాలన రంగాల్లో బీసీలకు కనీస ప్రాతినిధ్యం లేని బీసీ కులాలను గత 71 సంవత్సరాలుగా పట్టించుకోలేదని ఆయన తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జరిపిన ఉద్యోగుల సర్వేలో ఒబీసీలు 14 శాతం, అగ్రకులాలు 63 శాతం ఉద్యోగులు ఉన్నట్లు తేలిందని ఆయన ఉదహరించారు. న్యాయ వ్యవస్థలో కూడా మెజారిటీ అగ్రకులాలే ఉన్నారని ఆయన తెలిపారు.

రాష్ట్రానికి 21 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు పారిశ్రామికాభివృద్ధి కోసం చేపడుతున్న అనేక ప్రత్యేక చర్యలలో భాగంగా ఐ-పాస్ ఏర్పాటు చేయడం జరిగిందని ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. బుధవారం నగరంలో ఏర్పాటైన 'ఫిక్కీ' జాతీయ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 21 బిలియన్ డాలర్లు పెట్టుబడులుగా వచ్చాయని తెలిపారు. ఎమ్ఎస్ఎమ్ఇకి కూడా ప్రత్యేక పార్కును ఏర్పాటు చేయబోతున్నదని అన్నారు. మేకిన్ తెలంగాణలో భాగంగా ఎలక్ట్రానిక్, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్ పార్కులను కూడా ఏర్పాటు చేయడానికి ప్రత్యేకంగా రూపకల్పన చేయడం జరిగిందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు దరఖాసస్తు చేసిన 8,500 కంపెనీలకు కేవలం 15 రోజుల్లోనే అనుమతులు ఇవ్వడం జరిగిందని ఆయన చెప్పారు. ఏ కంపెనీ అయినా తమ సంస్థ కార్యకలాపాలు నిర్వహించడానికి అవసరమైన మానవ వనరులను అందించడానికి ప్రత్యేకంగా టాస్క్‌ను ఏర్పాటు చేశామని, ఈ టాస్క్ ద్వారా యువతకు అవసరమైన నైపుణ్యాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిక్కీ అధ్యక్షుడు సందీప్ సోమాని, ప్రముఖ ఆర్థికవేత్త, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ వైవి రెడ్డి, ఫిక్కీ, సీనియర్ వైస్-ప్రెసిడెంట్ సంగీతారెడ్డి, ఫిక్కీ సెక్రటరీ జనరల్ దిలీపీ చినాయ్, ఫిక్కీ తెలంగాణ కో-చైర్ టీ.మురళీధరన్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ఫిక్కీ ప్రతినిధులు హాజరయ్యారు.

వైకాపాలోకి భారీగా వలసలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి భారీగా వలసలు కొనసాగుతున్నాయి. గుంటూరు జిల్లా గురజాల నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు పలువురు బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి పార్టీలో చేరారు. జగన్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. డాక్టర్ నాగ మల్లిఖార్జున రావు, వర్ల రత్నం తమ అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. గుంటూరు జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారు జగన్‌తో అన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మహేశ్‌రెడ్డి, లావు శ్రీకృష్ణ దేవరాయులు అధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు.

వర్శిటీ టీచర్లకూ హెల్త్ కార్డులు ఇవ్వాలి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి హెల్త్ కార్డులను అందజేయాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ టి పాపిరెడ్డి కోరారు. ఏడో సీపీసీకి సిఫార్సు చేయాల్సిందిగా కోరుతూ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఒక నివేదికను ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్‌మిశ్రాను కోరారు. ప్రైవేటు ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల లెక్చరర్లకూ హెల్త్ కార్డులు అందజేయాలని , కాలేజీలు, యూనివర్శిటీల్లో రిటైరైన టీచర్లకు నవీకరించిన పెన్షన్‌ను అందజేయాలని, ఇప్పటికే వారికి ఎంతో నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు.

గుర్తింపు కార్డు ఉన్నవారందరికీ ఓటు

విజయవాడ, జనవరి 30: ఓటరు గుర్తింపు కార్డు ఉన్నవారందరికీ ఓటు హక్కు కల్పించాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అనిల్ చంద్ర పుణేఠా ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో 2019 సాధారణ ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్సు బుధవారం ఆయన నిర్వహించారు. ఎన్నికలు వేసవిలో జరుగుతున్న నేపథ్యంలో మంచినీరు వంటి మౌలిక సదుపాయాలపై నిర్లక్ష్యం చూపవద్దని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణతో ప్రత్యక్ష సంబంధం ఉన్న అధికారులను, ఉద్యోగులను ఫిబ్రవరి 10లోగా సొంత జిల్లాల నుంచి బదిలీ చేయాలన్నారు. మరో నెల రోజుల్లో ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో ఈలోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. శ్రీకాకుళం నుంచి గుంటూరు జిల్లాల వరకూ ఫిబ్రవరి 10లోగా, మిగిలిన జిల్లాల్లో ఫిబ్రవరి 28లోగా బదిలీలు పూర్తి చేయాలని ఈసీ ఆదేశించింది.

మళ్లీ దీక్షలో అన్నా హజారే

- లోక్‌పాల్ ఏర్పాటులో జాప్యానికి నిరసన
- హామీలు నెరవేర్చేవరకూ విశ్రమించేది లేదని స్పష్టీకరణ



రాలెగాన్ సిద్ధి (మహారాష్ట్ర), జనవరి 30: జాతీయ స్థాయిలో లోక్‌పాల్ ఏర్పాటుతోపాటు ఆయా రాష్ట్రాల్లో లోకాయుక్తల ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తున్నందుకు నిరసనగా సామాజిక ఉద్యమ నేత అన్నా హజారే నిరాహార దీక్షకు దిగారు. ఎన్నికల సంస్కరణలు, రైతుల మేలు కోసం ఉద్దేశించిన స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్నా హజారే బుధవారం నిరాహార దీక్ష ప్రారంభించారు. గత లోక్‌సభ ఎన్నికలకు ముందు లోక్‌పాల్ ఏర్పాటుతోపాటు ఆయా రాష్ట్రాల్లో లోకాయుక్తలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నా హజారే ధ్వజమెత్తారు. మహారాష్ట్రలోని అహమ్మద్‌నగర్ జిల్లా, తన స్వగ్రామం రాలేగాన్‌సిద్ధిలోని పద్మావతి ఆలయంలో ఆయన బుధవారం ఉదయం పూజలు నిర్వహించారు. అనంతరం తనకు మద్దతిచ్చేందుకు వచ్చిన విద్యార్థులు, యువకులు, రైతులతో కలసి ర్యాలీగా బయలుదేరి యాదవ్ బాబా ఆలయం సమీపంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. రైతు సమస్యలతోపాటు, లోక్‌పాల్, లోకాయుక్త అంశాలు రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అత్యంత కీలకం కానున్నాయని ఆయన అన్నారు.

జూన్ నాటికి కాళేశ్వరం నీరు పంపింగ్

ఏప్రిల్ వరకు అన్ని పనులు పూర్తి ★ సివిల్ సర్వీసెస్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్



జలసౌధలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకు తెలంగాణ నీటి ప్రాజెక్టులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి జూన్ వరకు నీటిని పంపింగ్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని, ఇందుకు సంబంధించిన పనులు ఏప్రిల్ నెలాఖరుకల్లా పూర్తి చేయనున్నట్టు కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ హరిరామ్ వెల్లడించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ ట్రైనీ అధికారుల బృందానికి బుధవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో కాళేశ్వరం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాలను, సాంకేతిక వివరాలను మ్యాప్‌ల ద్వారా హరిరామ్ వివరించారు. ప్రాజెక్టు పనులపై డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రించిన వీడియోలను కూడా వారికి చూపించారు. మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని నాలుగు దశల్లో చేపట్టినట్టు మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్యామ్ సుందర్ వివరించారు. నాలుగు దశల్లో చేపట్టిన పనులకు 8741 కోట్ల రూపాయల అంచన వ్యయంతో చేపట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 21.39 లక్షల ఎకరాల స్థిరీకరించబోతున్నామన్నారు. చెరువుల పునరుద్ధరణలో 27,653 చెరువులు చేపట్టి అందులో 20,192 చెరువుల పనులు పూర్తి చేశామన్నారు. మిషన్ భగీరథ కార్యక్రమం ద్వారా 25 వేల గ్రామాలకు శుద్ధి చేసిన మంచినీటిని అందించే కార్యక్రమం దాదాపు పూర్తి అయిందని రిటైర్డు చీఫ్ ఇంజనీర్ జగన్‌మోహన్ వివరించారు.

ఏపీలో రేపు బ్లాక్ డే

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 30: రాష్ట్రానికి బీజేపీ చేసిన అన్యాయానికి నిరసనగా ఫిబ్రవరి ఒకటో తేదీన నల్ల బ్యాడ్జీలతో శాంతియుతంగా నిరసన తెలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. ఎలక్షన్ మిషన్- 2019పై బుధవారం పార్టీ నేతలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనా వైఫల్యాలను చైనా గ్లోబెల్ టైమ్స్ తేటతెల్లం చేసిందని చెప్పారు. భారతదేశం గందరగోళం.. నిరుద్యోగ సమస్యతో మోదీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. విపత్తు సాయంలోనూ ఏపీపై మోదీ వివక్ష చూపారని ఎన్‌డీఆర్ఎఫ్ నిధుల కేటాయింపే ఇందుకు నిదర్శనమన్నారు. మహారాష్ట్రకు 4717 కోట్లు ఇచ్చి ఏపీకి 900 కోట్లు మాత్రమే విదిలించారు.. 374 కరవు మండలాల ఊసేలేదు.. తిత్లీ తుపాన్ వల్ల వేల కోట్ల నష్టం వాటిల్లింది.. ఆపై పెథాయ్ కుదిపివేసింది.. అయినా కేంద్రం రూపాయి ఇవ్వలేదు.. అడుగడుగునా ఏపీపై వివక్ష చూపుతున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. బీజేపీ చిత్తుగా ఓడితేనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందన్నారు. అటు పార్లమెంటు సమావేశాలు..ఇటు అసెంబ్లీ సమావేశాలు.. ఈ 60 రోజులు అప్రమత్తంగా ఉండాలని పార్టీశ్రేణులను హెచ్చరించారు.



మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని గరిడేపల్లి మండలంలో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖ కార్టూనిస్టు, యానిమేషన్ డైరెక్టర్ అవినాష్. ఎన్నికల్లో పాల్గొనడం ఓ బాధ్యతగా భావించి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా అవినాష్ విజ్ఞప్తి చేశారు.

1వ పేజీ తరువాయి

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో

స్టాల్‌లో చెలరేగిన మంటలు క్రమంగా పక్కనున్న మరో నాలుగు స్టాళ్లకు వ్యాపించటంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ నాలుగు స్టాళ్లకు సమీపంలో ఉన్న సందర్శకులు అరుపులు, కేకలతో ఒక్కసారిగా పరుగులు తీయడంతో మొత్తం నుమాయిష్‌లో అలజడి చోటుచేసుకుంది. చాలాసేపటివరకు అసలేం జరిగిందో తెలియక అక్కడి నుంచి దూరంగా స్టాళ్లను తిలకిస్తున్న జనం కూడా పరుగులు పెట్టారు. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ డిజాస్టర్ రెస్క్యూ బృందాలు, ఫైర్ విభాగానికి చెందిన నాలుగు ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పేందుకు రంగంలోకి దిగాయి. ఇదిలావుండగా, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు.

ప్రమాదానికి కారణమేమిటి?

అవకాశమున్నా, అక్కడ నీరు అందుబాటులో లేకపోవటం వల్లే మంటలు వ్యాపించాయని మరో స్టాల్‌లోని ఒక యువకుడు తన సెల్‌ఫోన్‌లోని వీడియోను చూపించాడు. కాగా, స్టాళ్లలో ఎక్కువ మోతాదులో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు నిల్వ చేయటంతో మంటలు మరింతగా వ్యాపించాయి.

కంటతడి పెట్టిన కోల్‌కతా వ్యాపారి

నుమాయిష్‌లో బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో కోల్‌కతాకు చెందిన బట్టల స్టాల్ మొత్తం కాలి బూడిదైంది. తాము పదిహేనేళ్ల నుంచి ప్రతి ఏడాదీ ఇక్కడ స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఎపుడూ ఇలా జరగలేదని కోల్‌కతా, కాశ్మీర్‌కు చెందిన వ్యాపారులు కంటతడి పెట్టారు. కేవలం హైదరాబాద్ పైనున్న ప్రత్యేక అభిమానంతో తాము నుమాయిష్‌లో మాత్రమే స్టాల్ ఏర్పాటు చేసుకుని, ప్రదర్శన ముగిసిన తర్వాత తిరిగి వెళ్తామని సదరు వ్యాపారి వాపోయారు.

మందిరం కట్టేస్తాం

హక్కులు కాపాడుకోవడానికి పలు హైందవ సంస్థలు పట్టుబడుతున్నాయి. కుంభమేళా సందర్భంగా ప్రయాగరాజ్‌కు వేలాది మంది సాధుసంతవులు వచ్చారు. అదేవిధంగా వివిధ ప్రాంతాలకు చెందిన హిందూమత సంస్థలు, పీఠాల నుంచి ఎంతోమంది అధిపతులు హాజరయ్యారు. అదేసమయంలో సమావేశమైన ధర్మ్ సంసద్ సుప్రీంకోర్టు తీర్పు వరకు వేచిచూడాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. ఇలావుంటే, అయోధ్యలో రామమందిర నిర్మాణానికి ఇదే సరైన సమయమని స్వరూపానంద సరస్వతి స్పష్టం చేశారు. ఒకవేళ శంకుస్థాపన కార్యక్రమానికి నాయకత్వం వహిస్తున్నవారిని అడ్డుకుంటే, దేశ నలుమూలల నుంచి వచ్చిన హిందువులంతా ఏకమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వివాదాస్పదమైనదిగా చెబుతున్న 0.3 ఎకరాల భూమిని కాకుండా మిగతా భూమిని అప్పగించాలని ప్రభుత్వం కోరడం విచిత్రంగా ఉందని అన్నారు. వివాదాస్పదం అనే పేరుతో ఆ భూమిని తిరిగి ఇచ్చేయాలని చెప్పే హక్కు ప్రభుత్వానికి ఎక్కడిదని నిలదీశారు. అయోధ్యలోని మొత్తం 66 ఎకరాల్లో రామమందిరాన్ని నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు.

టీఆర్‌ఎస్‌దే హవా

సమాచారం ప్రకారం 4116 పంచాయతీలకుగాను (ఏకగ్రీవం కలిపి) టీఆర్‌ఎస్ పార్టీ 2450 సర్పంచ్‌లను, కాంగ్రెస్ 840, బీజేపీ 32, టీడీపీ 19, సీపీఐ 9, సీపీఎం 14 సర్పంచ్‌లను గెలుచుకుంది. మొత్తంగా అన్ని దశల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్2503, కాంగ్రెస్ 953, బీజేపీ59, టీడీపీ13, సీపీఐ19, సీపీఎం21, ఇతరులు 507 పంచాయతీలను కైవసం చేసుకుంది.

మూడో దశ ఎన్నికల్లో జిల్లాల వారీగా

ఆదిలాబాద్ జిల్లాలో 82.99 శాతం, భద్రాద్రి కొత్తగూడెంలో 87.24 శాతం, జగిత్యాలలో 77.70 శాతం, జనగామలో 89.42 శాతం, భూపాలపల్లిలో 84.51 శాతం, గద్వాలలో 89.81 శాతం, కామారెడ్డిలో 86.97 శాతం, కరీంనగర్‌లో 89.66 శాతం, ఖమ్మంలో 94.56 శాతం, ఆసీఫాబాద్‌లో 86.30 శాతం, మహబూబాబాద్‌లో 91.54 శాతం, మహబూబ్‌నగర్‌లో 85.94 శాతం, మంచిర్యాలలో 84.04 శాతం, మెదక్‌లో 90.28 శాతం, నాగర్‌కర్నూల్‌లో 87.40 శాతం, నల్లగొండలో 91.73 శాతం, నిర్మల్‌లో 89.05 శాతం, నిజామాబాద్‌లో 79.81 శాతం, పెద్దపల్లిలో 88.79 శాతం, సిరిసిల్లలో 85.30 శాతం, రంగారెడ్డిలో 88.40 శాతం, సంగారెడ్డిలో 90.15 శాతం, సిద్దిపేటలో 90.73 శాతం, సూర్యాపేటలో 92.60 శాతం, వికారాబాద్‌లో 83.68 శాతం, వనపర్తిలో 85.41 శాతం, వరంగల్ రూరల్‌లో 89.78 శాతం, వరంగల్ అర్బన్‌లో 88.80 శాతం, యాదాద్రిలో 94.99 శాతం పోలింగ్ శాతం నమోదు అయింది. కాగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో మొదటి, రెండో దశలోనే ఎన్నికలు ముగియడంతో మూడవ దశలో ఎన్నికలు నిర్వహించలేదు.

ఆఖరి పోరాటం

కూడా ట్రిపుల్ తలాక్ బిల్లును గట్టిగా వ్యతిరేకించనున్నాయి. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారంపై మరోసారి ఉభయ సభల్లో గొడవ చేయనున్నాయి. రాఫెల్ వివాదంలో ప్రతిపక్షాన్ని దెబ్బతీసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కాగ్ నివేదికను పార్లమెంటులో ప్రతిపాదించాలని ఆలోచిస్తోంది. కాగ్ నివేదికలో రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన వివరాలు ఉన్నాయని అంటున్నారు. రాఫెల్ యుద్ధ విమానం ఖరీదుకు సంబంధించిన వివరాలు కూడా కాగ్ నివేదికలో ఉన్నాయి. కాగ్ నివేదికను పార్లమెంటులో ప్రతిపాదించటం ద్వారా విమానాల కొనుగోలులో వేలాది కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఇతర నాయకులు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని ఎన్‌డీఏ ప్రభుత్వం వ్యూహం. తెలుగుదేశం పార్టీ ఎంపీలు ఈ సమావేశాల్లో కూడా ప్రత్యేక హోదా సాధనకోసం పోరాటం కొనసాగించనున్నారు. గత సమావేశాల్లో చేసినట్లు బడ్జెట్ సమావేశాల్లో కూడా తెలుగుదేశం సభ్యులు పార్లమెంటు లోపల, బయట తమ పోరాటాన్ని కొనసాగించనున్నారు. ఫిబ్రవరి పదమూడో తేదీ వరకు జరిగే సమావేశాల్లో ఉభయ సభల్లో పది సిట్టింగ్‌లు ఉంటాయి.

నేటి నుంచి విద్యుత్ 'కోతలు'

పవర్‌గ్రిడ్ నుంచి దక్షిణ సదరన్ గ్రిడ్‌కు తాల్చేర్ నుంచి కర్నాటకలోని కోలార్ పవర్‌గ్రిడ్‌కు విద్యుత్ సరఫరా అవుతోంది. విద్యుత్ కారిడార్ నుంచి కొంత విద్యుత్‌ను తెలంగాణకు వాడుకుంటున్నామని చెప్పారు. తెలంగాణతో పాటు రాయలసీమ జిల్లాలకు కూడా వారం రోజుల పాటు విద్యుత్ కోతలు తప్పవని అంటున్నారు. దాదాపు దక్షిణాది రాష్ట్రాలకు ఎక్కువగా తాల్చేర్ థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న కారిడార్ నుంచి సదరన్ గ్రిడ్‌కు విద్యుత్ సరఫరాకు కొంత సమయం పట్టవచ్చని అంటున్నారు. తాల్చేర్ థర్మల్ విద్యుత్ కేంద్రంలో మరమ్మతులు చేపడుతున్నందున ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ సరఫరాకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. విద్యుత్ కారిడార్ ద్వారా అవసరాన్ని బట్టి రోజూ తాల్చేర్ నుంచి గురు,శుక్రవారాలు 1000 మెగావాట్లు, ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకు 2000 మెగావాట్లు, ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 6వ తేదీ వరకు 1000 మెగావాట్లు విద్యుత్ రావాల్సి ఉంది. అయితే రేపేర్ల కారణంగా తెలంగాణకు రావాల్సి విద్యుత్ రాకపోవడంతో కోతలు అనివార్యమని అధికారులు చెబుతున్నారు. కాగా తెలంగాణలో రామగుండం, కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పిత్తిని షట్‌డౌన్ చేశారు. అలాగే చత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు రావాల్సిన విద్యుత్‌ను నిలిపివేశారు. మరోపక్క తెలంగాణలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో విద్యుత్ వినియోగం బాగా తగ్గింది. ఈనెల 29న 139 మిలియన్ల యూనిట్ల విద్యుత్ వినియోగం పడిపోయిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే దాదాపు1000 మెగావాట్ల విద్యుత్ తగ్గింది. వాతారణం చల్లబడమే దీనికి ప్రధాన కారణం.

చలితో జనం గజగజ

హైదరాబాద్‌లో 9 డిగ్రీలు, రామగుండంలో 12, హకీంపేట, హన్మకొండ, మెదక్, నిజామాబాద్‌లో 13 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. హిందూ మహా సముద్రం, అండమాన్ సముద్రం, ఆగ్నేయ బంగాళాఖాతం ప్రాంతాల్లో అల్ప పీడన ద్రోణి కొనసాగుతున్నందున, రాబోయే నాలుగైదు రోజులు తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమలో పొడి వాతావరణం ఉంటుందని వాతావరణ పరిశోధనా కేంద్రం తెలిపింది. చలి గాలుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు ప్రజలకు సూచించారు.

వీవీ ప్యాట్‌లపై వివరణ ఇవ్వండి

ఈసీకీ హైకోర్టు ఆదేశం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 30: వీవీ ప్యాట్‌లను లెక్కించాలని దాఖలైన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ఎన్నికల కమీషన్‌ను హైకోర్టు ఆదేశించింది. కోదాడ, తుంగతుర్తి, ధర్మపురి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు పద్మావతి, అద్దంకి దయాకర్, లక్ష్మణ్, మల్‌రెడ్డి రంగారెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై బుధవారం హైకోర్టు విచారణ చేపట్టింది. వీవీ ప్యాట్ల మన్నిక, నాణ్యతపై ఎన్నికల కమీషన్ హైకోర్టుకు వివరణ ఇచ్చింది. వీవీ ప్యాట్‌లపై నమోదైన గుర్తులు ఐదు సంవత్సరాల పాటు ఉంటాయని ఎన్నికల కమీషన్ తరపు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. దీనిపై పిటిషనర్ల తరపు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏటీఎం, ఫ్యాక్స్ యంత్రాలలో ఉపయోగించే థర్మల్ కాగితాన్నే వీవీ ప్యాట్లలో ఉపయోగించడంతో వీటి మన్నిక ఎక్కువ కాలం ఉండదని వారు వాదించారు. వీవీ ప్యాట్‌లపై పిటిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలపై ఫిబ్రవరి 7 వరకు లిఖిత పూర్వకంగా కౌంటర్ దాఖలు చేయాలని ఎన్నికల కమీషన్‌ను ఆదేశిస్తూ విచారణను ఫిబ్రవరి 14కు హైకోర్టు వాయిదా వేసింది.

అమరావతిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి నేడు భూకర్షణం

విజయవాడ(సిటీ), జనవరి 30: ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిలో కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరుని ఆలయ నిర్మాణానికి భూకర్షణ కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా భూకర్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అమరావతిలోని వెంకటపాలెంలో ఆలయ నిర్మాణ ప్రాంతలో జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం తిరుపతి జెఈవో పోలా భాస్కర్, సివీఎస్వో గోపినాథ్ జెట్టితో కలిసి ఈవో అనిల్ కుమార్ పరిశీలించారు. ఈసందర్భంగా ఈవో అనిల్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ ఉదయం 9.15 నిముషాల నుండి 9.40 గంటల మధ్య మీనలగ్నంలో శాస్త్రోకంగా భూకర్షణ జరుగుతుందాన్నారు. పదిరోజుల పాటు వైదిక కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఫిబ్రవరి 10వ తేదీ నుండి ఆలయ నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో సీఆర్డీఏ కేటాయించిన 25 ఎకరాల స్థలంలో 7 ఎకరాల్లో రూ.150 కోట్ల వ్యయంతో రాతి కట్టడంతో శ్రీవారి ఆలయం నిర్మిస్తున్నట్లు చెప్పారు. టెండర్లు పూర్తియ్యాయని, రెండు సంవత్సరాల కాలంలో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. మిగిలిన 18 ఎకరాల స్థలంలో మాస్టర్ ప్లాన్ రూపొందించి అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ధర్మ ప్రచారంలో భాగంగా పెద్ద పట్టణాలు, పుణ్యక్షేత్రాల్లో ఆలయాల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా హర్యానా రాష్ట్రం కురుక్షేత్రంలో రూ.34.60 కోట్లతో, తమిళనాడు రాష్ట్రంలోని కన్యాకుమారిలో రూ.22.50 కోట్లతో శ్రీవారి ఆలయాలు నిర్మించామన్నారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి రూ.7.5 కోట్లు కేటాయించామన్నారు. అదేవిధంగా విశాఖపట్నంలో రూ. 7.90 కోట్లతో, ఏజెన్సీ ప్రాంతాలైన శ్రీకాకుళం జిల్లా సీతంపేట, విజయనగరం జిల్లా పార్వతీపురం, తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం ప్రాంతాల్లో కలిపి రూ.13.50 కోట్లతో శ్రీవారి ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. చెన్నైలో రూ. 5.75 కోట్లతో శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ నిర్మాణం జరుగుతోందన్నారు. భూకర్షణ కార్యక్రమంలో రాష్ట్రంలోని 13 జిల్లాల నుండి శ్రీవారి సేవకులు, మండళ్ల సభ్యులు, భజన కళాకారులు పాల్గొంటారని చెప్పారు. భూకర్షణ కార్యక్రమాన్ని భక్తులందరూ వీక్షించేలా స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు. బుధవారం చతుర్వేద పారాయణం, గోపూజ, శ్రీవారి నూతన ఆలయ ప్రదేశంలో వాస్తుహోమం, యాగశాల కార్యక్రమాలను నిర్వహించామన్నారు. గురువారం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి, లోకకల్యాణం కోసం ఫిబ్రవరి 7 నుండి 10వ తేది వరకు అష్టోత్తర శతకుండాత్మక శ్రీనివాస యాగం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అనిల్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఇలు వెంకటేశ్వర్లు, శ్రీ రాములు, డిఎఫ్ఓ ఫణికుమార్ నాయుడు, ఎస్టేట్ ఆఫీసర్ విజయ సారథి, డిప్యూటీ ఈవో రాజేంద్రుడులు పాల్గొన్నారు.

క్రీడాభూమి

ఐదు దశాబ్దాల కల నెరవేరేనా?

• నేడు న్యూజిలాండ్‌తో భారత్ నాలుగో వనే్డ • గెలిస్తే మరో రికార్డు

• కోహ్లీకి విశ్రాంతి, కెప్టెన్‌గా రోహిత్ • తుది జట్టులో శుభ్‌మాన్‌కు అవకాశం?



నెట్ ప్రాక్టీస్ సెషన్‌లో మహేంద్ర సింగ్ ధోనీ

హామిల్టన్, జనవరి 30: ఈ ఏడాది వరుస విజయాలతో దూసుకుపోతున్న టీమిండియా, మరో రికార్డులో చేరువైంది. ఆస్ట్రేలియా గడ్డపై 72 ఏళ్ల తర్వాత టెస్ట్ సిరీస్‌ను 2-1తో నెగ్గినా కోహ్లీ సేన, అద్భుత ప్రదర్శనతో వనే్డ సిరీస్‌ను సైతం చేజిక్కించుకుంది. ఆ తర్వాత న్యూజిలాండ్ పర్యటనలోనూ వరుస విజయాలతో ఆకట్టుకుంటోంది. ఇప్పటికే రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే వనే్డ సిరీస్ నెగ్గింది. అయితే 1967 నుంచి న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న భారత జట్టు ఐదు దశాబ్దాల్లో 4-0 తేడాతో ఇప్పటివరకు విజయాన్ని అందుకోలేదు. ప్రస్తుతం టీమిండియాను ఆ రికార్డు ఊరిస్తోంది. నేడు హామిల్టన్ వేదికగా జరిగే మ్యాచ్‌ను రోహిత్ సేన గెలిస్తే ఐదు దశాబ్దాల కల నెరవేరనుంది. 2008-09 పర్యటనలో మహేంద్ర సింగ్ ధోనీ సారథ్యం వహించగా భారత్ 3-1 తేడాతో విజయాన్ని అందుకుంది.



రోహిత్ శర్మ

రోహిత్‌కు 200వ వనే్డ..

టీమిండియా హిట్టర్ రోహిత్ శర్మకు న్యూజిలాండ్‌తో జరిగే నాలుగో వనే్డ కెరీర్‌లో 200వ వనే్డ మ్యాచ్. 31 ఏళ్ల రోహిత్ తన మొదటి వనే్డను 2007లో బెల్ ఫాస్ట్ వేదికగా ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌తో అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు 199 వనే్డ మ్యాచ్‌లాడిన ఈ హిట్ మ్యాన్ 7799 పరుగులు చేశాడు. ఇందులో 22 సెంచరీలు, 39 అర్ధ సెంచరీలున్నాయి. 200వ వనే్డ మ్యాచ్ ఆడుతున్న రోహిత్ తనే కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

మూడుసార్లు 'డబుల్'

కెరీర్ 199 వనే్డ మ్యాచ్‌లాడిన రోహిత్ శర్మ మూడు సార్లు డబుల్ సెంచరీ చేసి రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఈ ఘనత మరే క్రికెటర్‌కు సాధ్యపడలేదు. మూడు డబుల్ సెంచరీల్లో 2013 బెంగళూరు వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 209, ఆ తర్వాతి ఏడాదే (2014) కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ వేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 264 పరుగులు చేశాడు. రోహిత్ కెరీర్, వనే్డ కెరీర్‌లో ఇవే అత్యుత్తమ పరుగులు. మూడో డబుల్ సెంచరీని 2017 మోహాలీ వేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 208 పరుగులు సాధించాడు. శ్రీలంకపైనే రెండు డబుల్ సెంచరీలు సాధించడం విశేషం.


కోహ్లీ స్థానంలో శుభ్‌మాన్ గిల్

వరుస మ్యాచ్‌లాడుతున్న భారత కెప్టెన్ విరాట్ కోహ్లీకి సెలక్టర్లు రానున్న ప్రపంచ కప్ దృష్ట్యా విశ్రాంతిని కల్పించారు. న్యూజిలాండ్‌తో ఐదు వనే్డల సిరీస్‌ను, మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే భారత్ 3-0తో గెలుచుకోవడంతో మిగతా రెండు వనే్డలు, టీ20 సిరీస్‌కు విశ్రాంతి తీసుకోనున్నాడు. అయితే కోహ్లీ స్థానంలో అండర్-19 ఆటగాడు శుభ్‌మన్ గిల్‌ను ఆడించాలని సెలక్టర్లు భావిస్తున్నారు. అండర్-19 ప్రపంచ కప్‌లో శుభ్‌మన్ గిల్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న విషయం తెలిసిందే. శుభ్‌మన్ గిల్‌ను ఆడించే విషయమై మాజీ కెప్టెన్లు సౌరవ్ గంగూలీ, సునీల్ గవాస్కర్ కూడా బీసీసీఐకి సూచించారు.

జట్టుకు ధోనీ అదనపు బలం

• టీమిండియా మాజీ క్రికెటర్ గౌతం గంభీర్

• 2019 వరల్డ్ కప్ తన కలల జట్టును ప్రకటించిన మాజీ ఓపెనర్



న్యూఢిల్లీ, జనవరి 30: టీమిండియా సినీయర్ క్రికెటర్, మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ జట్టుకు అదనపు బలమని, తప్పకుండా ప్రపంచకప్‌లో ఆడించాలని మాజీ క్రికెటర్ గౌతం గంభీర్ పేర్కొన్నాడు. ఇంగ్లాండ్, వేల్స్ సంయుక్తంగా నిర్వహించే 2019 ప్రపంచకప్ మే 30 నుంచి జూన్ 14 వరకు జరగనుంది. ఈ నేపథ్యంలో మాజీ ఓపెనర్ గౌతం గంభీర్ ప్రపంచ కప్ తన కలల జట్టును ప్రకటించాడు. అంతేకాకుండా జట్టులో ఎవరుంటే బాగుంటుంది.. ఎవరు ఏ స్థానంలో ఆడితే జట్టుకు ప్రయోజనకరంగా ఉండనుందనే 15మంది సభ్యులు గల జట్టును ప్రకటించాడు.

అశ్విన్‌కు అవకాశం..

మొతం 15మందితో కూడిన తన కలల జట్టులో గంభీర్ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్‌కు చోటు కల్పించాడు. అంతేకాకుండా ఇటీవల మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి వివాదంలో చిక్కుకున్న హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌లకు సైతం జట్టులో అవకాశమిచ్చాడు.

ఓపెనర్లుగా వారిద్దరే..

అన్ని వనే్డ ఫార్మట్లలాగే ప్రపంచ కప్‌కు భారత ఓపెనర్లుగా రోహిత్ శర్మ, శిఖర్ ధావన్ కొనసాగాలని, మూడో స్థానంలో కేఎల్ రాహుల్, నాలుగో స్థానంలో విరాట్‌కోహ్లీ వస్తే బాగుంటుందని సూచించాడు.

వారికి చోటు లేనట్లే..

ఆస్ట్రేలియా పర్యటనలో రాణించిన యువ వికెట్ కీపర్ రిషభ్‌పంత్, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాతో పాటు సీనియర్ క్రికెటర్ యువరాజ్ సింగ్, ఉమేశ్ యాదవ్, పృథ్వీ షాలు గంభీర్ కలల జట్టులో అవకాశం దక్కించుకోలేకపోయారు.

గంభీర్ ప్రకటించిన జట్టు:

విరాట్ కోహ్లీ (కెప్టెన్), రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, కేఎల్ రాహుల్, అంబటి రాయుడు, కేదార్ జాదవ్, దినేశ్ కార్తీక్, ఎంఎస్ ధోని, హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బూమ్రా, భువనేశ్వర్ కుమార్, మహ్మద్ షమీ, యుజువేంద్ర చాహాల్, కుల్దీప్ యాదవ్, రవిచంద్రన్ అశ్విన్.

కోలుకుంటున్న మాజీ క్రికెటర్ మార్టిన్



వడోదర, జనవరి 30: తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న భారత జట్టు మాజీ క్రికెటర్ జాకబ్ మార్టిన్ కోలుకుంటున్నట్లు శిశిర్ హట్టంగడీ ట్వీట్ చేశాడు. గత డిసెంబర్‌లో ప్రమాదానికి గురైన మార్టిన్‌కు ఊపిరితిత్తులు, కాలేయం దెబ్బతినడంతో ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. అయితే ప్రస్తుతం తనకు తానుగానే శ్వాస తీసుకుంటుండడంతో ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు తరలించారు. మార్టిన్ ప్రమాదానికి గురైన వెంటనే ఆయన కుటుంబం డబ్బుల కోసం తీవ్రంగా ఇబ్బందులు పడింది. దీంతో పలువురు క్రికెటర్లతో పాటు బీసీసీఐ, బరోడా క్రికెట్ అసోసియేషన్ సాయం చేసింది. మార్టిన్ ప్రమాదానికి గురై చికిత్సకు డబ్బులు అవసరం ఉందనే సమాచారం తెలిసిన వెంటనే మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, యూసుఫ్ పఠాన్, జహీర్ ఖాన్, ఆశిష్ నెహ్రా, కృనాల్ పాండ్యా, మునఫ్ పటేల్ తదితరులు తమ వంతుగా సాయం అందించారు. ఇప్పటివరకు ఆస్పత్రి ఖర్చులు రూ.15 లక్షలు కాగా, రూ.16 లక్షలు సాయంగా అందాయి. అయితే మరి కొన్ని రోజులు మార్టిన్ ఆస్పత్రిలోనే ఉండాల్సి రావడంతో మరికొన్ని డబ్బులు అవసరం కావాల్సి ఉంటాయి.

భారత్‌తో టీ20కి కివీస్ జట్టులో మార్పులు

• ఇద్దరు కొత్త ఆటగాళ్లకు ఛాన్స్ • స్పష్టం చేసిన కెప్టెన్, సెలక్టర్

వెల్లింగ్టన్, జనవరి 30: వచ్చే నెల 6 నుంచి భారత్‌తో జరిగే టీ20 సిరీస్‌కు న్యూజిలాండ్ కొన్ని మార్పులు చేసింది. ఇద్దరు కొత్త ఆటగాళ్లను జట్టులోకి తీసుకున్నట్లు కెప్టెన్ కేన్ విలియమ్సన్ పేర్కొన్నాడు. ఇప్పటికే భారత్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల వనే్డ సిరీస్‌లో న్యూజిలాండ్ 3-0తో వెనుకబడిన విషయం తెలిసిందే. అయితే కివీస్ టీ20కి 14 మంది సభ్యులు గల బలమైన జట్టును ఆడించే యోచనలో ఉంది. జట్టులోకి వచ్చిన కొత్త ఆటగాళ్లలో ఆల్ రౌండర్ డెరియల్ మిచెల్, పేసర్ బ్లయర్ టిక్‌నర్‌తో పాటు ఇటీవల శ్రీలంకతో జరిగిన టీ20లో రాణించిన జిమ్మి నిషమ్‌ను కూడా తీసుకోనున్నారు. న్యూజిలాండ్ డొమెస్టిక్ టీ20 లీగ్ సూపర్ స్మాష్‌లో మిచెల్ నార్తర్న్ నైట్స్‌పై 23 బంతుల్లో 61 పరుగులు చేయగా, సెంట్రల్ స్టాగ్స్‌పై రాణించాడు. అలాగే లాకీ ఫెర్గూసన్ స్థానంలో వస్తున్న టిక్‌నర్ సైతం డొమెస్టిక్ టోర్నీల్లో రాణించినట్లు న్యూజిలాండ్ జట్టు సెలక్టర్ గావిన్ లార్సన్ తెలిపాడు. కాగా, సీమర్ లాకీ ఫెర్గూసన్ మొదటి రెండు టీ20 మ్యాచ్‌లు ఆడనుండగా, టిక్‌నర్ అతడి స్థానంలో మూడో మ్యాచ్ ఆడనున్నాడు. మరోవైపు టీమిండియాలో కెప్టెన్ విరాట్ కోహ్లీకి సెలక్టర్లు విశ్రాంతి కల్పించడంతో వనే్డలో రెండు మ్యాచ్ లు, టీ20 సిరీస్‌లకు హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

న్యూజిలాండ్ టీ20 జట్టు: కేన్ విలియమ్సన్ (కెప్టెన్), డౌగ్ బ్రాస్‌వెల్, కొలిన్ డీగ్రాండ్‌హోమీ, లాకీ ఫెర్గూసన్, మార్టిన్ గప్టిల్, స్కాట్ కుగ్గెలైజన్, డెరియల్ మిచెల్, కొలిన్ మున్రో, మిచెల్ సాంత్నార్, టిమ్ సీఫార్ట్ (వికెట్ కీపర్), ఇష్ సోది, టిమ్ సౌథీ, రాస్ టేలర్, బ్లయర్ టిక్‌నర్.

ఎఫ్‌డీఐ నిబంధనల అమలుపై గడువు పొడిగించొద్దు

• స్నాప్‌డీల్, షాప్‌క్లూస్ విజ్ఞప్తి • ముందే కేంద్రాన్ని గడువు కోరిన అమెజాన్, వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్

• వెలుగుచూసిన ఈ కామర్స్ సంస్థల విభేదాలు




SHOPCLUES.COM

న్యూఢిల్లీ, జనవరి 30: విదేశీ ప్రత్యక్ష పెడులు (ఎఫ్‌డీఐ)లకు సంబంధించిన నిబంధనల్లో వెసులుబాట్లు కోరుతూ దరఖాస్తు చేసుకునేందుకు విధించిన డెడ్‌లైన్ ఫిబ్రవరి 1ని మళ్లీ పొడిగించవద్దని కొన్ని ఆన్‌లైన్ వాణిజ్య (ఈకామర్స్) సంస్థలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. స్నాప్‌డీల్, షాప్ క్లూస్ వంటి కొన్ని సంస్థలు ఈమేరకు ప్రభుత్వానికి లేఖలు రాశాయి. ఇందుకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేయాల్సిందిగా వచ్చే వత్తిడులను తీవ్రంగా వ్యతిరేకించాల్సిందిగా ఆ సంస్థలు కేంద్రానికి సూచించాయి. ఎఫ్‌డీఐ మౌలిక సూత్రాలను తాము అర్థం చేసుకునేందుకు మరికొంత గడువు కావాలని ఈకామర్స్ దిగ్గజ సంస్థలు అమెజాన్, వాల్‌మార్ట్, ఫ్లిప్‌కార్ట్‌లు గత డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన క్రమంలో దాన్ని వ్యతిరేకిస్తూ స్నాప్‌డీల్, షాప్‌క్లూస్ సంస్థలు ప్రభుత్వానికి సూచనలు చేయడం విఫణివీధిలోప్రాధాన చర్చనీయాంశమైంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ విజ్ఞప్తి మేరకు కేంద్రం కొత్త నియంత్రణలతో కూడిన 'ప్రెస్ నోట్-2'ను ప్రకటించడం జరిగింది. ఆ మేరకు ఆన్‌లైన్‌లో విక్రయాలు జరిగే వస్తువులపై వాటాలు కలిగివుంటే ఆ కంపెనీల్లో విదేశీయులు పెట్టుబడులు పెట్టవచ్చు. ఐతే ఇందుకు సంబంధించి ప్రత్యేక మార్కెట్ సదుపాయాలను ఏర్పాటు చేసుకోవడంపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈ మార్పులు ప్రధానంగా ఈ కామర్స్ దిగ్గజాలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలపై వ్యతిరేక ప్రభావం చూపే అవకాశాలున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దీంతో స్నాప్‌డీల్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో కునాల్ బాహల్ ఈనెల 25న కేంద్ర వాణిజ్య మంత్రి సురేష్‌ప్రభుకు ప్రత్యేకంగా లేఖ రాశారు. ప్రెస్‌నోట్-2ను సక్రమంగా, సరైన సమయానికి అమలు చేయడం ద్వారా ఈ కామర్స్‌లోని ఎఫ్‌డీఐ విధానానికి సంబంధించిన నిబంధనల అతిక్రమణకు అడ్డుకట్ట వేయవచ్చని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి గతంలో ప్రభుత్వం విధించిన కాలపరిమితి కూడా సరైనదేనని దీన్ని ఇక పొడిగించాల్సిన అవసరం లేదని కునాల్ స్పష్టం చేశారు. స్నాప్‌డీల్ ఇప్పటికే ఇందుకు సంబంధించిన సాంకేతిక అంశాలను అప్‌డేట్ చేయడం జరిగిందని, స్టాటుటరీ ఆడిటర్లను సైతం ఏర్పాటు చేశామని తెలిపారు. అమలులోకి రాబోయే నియమావళికి దృష్ట్యా పరిస్థితులు ఎలావుంటాయో అంచనా వేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ సరికొత్త నిబంధనలతో కూడిన ప్రతిపాదనలు భారతీయ రీటైల్ రంగాన్ని మరింతగా దెబ్బతీయకుండా చూస్తాయని ఆయన తెలిపారు. ఈ నిబంధనల అమలుకు మరింత కాలయాపన జరిగేలా చేసేందుకు తెచ్చే ఎలాంటి వత్తిడినైనా ప్రభుత్వం నిర్ద్వందంగా తిరస్కరించాలని షాప్‌క్లూస్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో సంజయ్ సేథీ తన లేఖలో పేర్కొన్నారు. స్పష్టత పేరుతో జాప్యం చేయడం తగదన్నారు. నిబంధనలను అతిక్రమించేందుకే ఇలాంటి గడువులు కోరతారని ఆయన విమర్శలు గుప్పించారు. ఎఫ్‌డీఐ నిబంధనలకు, వినియోగదారుని ప్రయోజనాలకు వ్యితిరేకంగా జరిగే పెద్ద ఈ కామర్స్ కంపెనీల ప్రయత్నాలకు సహకరించవద్దని వ్యాపారవేత్తల సంఘం 'కెయిట్' సైతం కేంద్ర వాణిజ్యమంత్రికి సూచించడం గమనార్హం. అమెరికా వత్తిడితో ఎలాంటి తప్పుడు నిర్ణయం తీసుకున్నా దేశంలో చిరు సంస్థలతో వ్యాపారాలు సాగించే 13 కోట్ల మందికి, వారి ఉద్యోగులకు ముప్పు కలుగుతుందని ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని స్వదేశీ జాగరణ్ మంచ్ సైతం ప్రభుత్వాన్ని హెచ్చరించింది.

వాణిజ్యభూమి

ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్లు

• అప్రమత్తంగా వ్యవహరించిన మదుపరులు



ముంబయి, జనవరి 30: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ఫ్లాట్‌గా ముగిశాయి. జనవరి నెల డెరివేటివ్స్ కాలపరిమితి ముగియనుండటంతో పాటు అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ వెలువడనుండటం, కేంద్రం శుక్రవారం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండటం వల్ల మదుపరులు తాజా కొనుగోళ్లకు పూనుకోకుండా ఆచితూచి అడుగులు వేయడంతో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) సెనె్సక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) నిఫ్టీ బుధవారం నామమాత్రపు నష్టాలతో ముగిశాయి. బీఎస్‌ఈ సెనె్సక్స్ నామమాత్రంగా 1.25 పాయింట్లు, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 0.4 పాయింట్ల దిగువన ముగిశాయి. దిగ్గజ సంస్థలు ఐసీఐసీఐ బ్యాంక్, టాటా స్టీల్ షేర్ల ధరలు అయిదు శాతం చొప్పున పుంజుకొని, సెనె్సక్స్ పడిపోకుండా కాపాడగలిగాయి. అమెరికా-చైనా మధ్య వాణిజ్య చర్చలు మొదలు కావడంతో ప్రపంచ స్టాక్ మార్కెట్లలో మిశ్రమ ధోరణి నెలకొంది. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్‌లో మదుపరులు మరింత అప్రమత్తంగా వ్యవహరించారు.

బీఎస్‌ఈ సెనె్సక్స్ బుధవారం తొలుత 359 పాయింట్లు దిగజారినప్పటికీ, తరువాత పుంజుకొని చివరకు క్రితం ముగింపుతో పోలిస్తే 1.25 పాయింట్ల దిగువన 35,591.25 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ క్రితం ముగింపుతో పోలిస్తే 0.40 పాయింట్లు దిగజారి 10,651.80 పాయింట్ల వద్ద స్థిరపడింది. రంగాల వారీగా చూస్తే, లోహ, బ్యాంకింగ్ షేర్లలో అధికంగా ర్యాలీ వచ్చింది. ఎఫ్‌ఎంసీజీ, స్థిరాస్తి రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే, బ్రాడర్ సూచీలు మంచి పనితీరును కనబరిచాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.78 శాతం పుంజుకోగా, బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.22 శాతం పెరిగింది. ఇదిలా ఉండగా, ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) మంగళవారం నికరంగా రూ. 354.36 కోట్ల విలువయిన షేర్లను విక్రయించగా, దేశీయ సంస్థాగత మదుపరులు (డీఐఐలు) రూ. 81.27 కోట్ల విలువయిన షేర్లను కొనుగోలు చేశారు. అమెరికా-చైనా మధ్య ఆరు నెలలుగా కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం వల్ల ఇరు దేశాలు బలహీనపడటంతో పాటు ఫైనాన్సియల్ మార్కెట్లు కుదుపునకు లోనయ్యాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటుపై నీలి నీడలు అలుముకున్నాయి. దీంతో ఈ వాణిజ్య వివాదాలకు తెరదింపే లక్ష్యంతో ఇరు దేశాల మధ్య రెండు రోజుల పాటు సాగే ఉన్నత స్థాయి చర్చలు మొదలు కావడంతో ప్రపంచ స్టాక్ మార్కెట్లలో మదుపరుల సెంటిమెంట్ మిశ్రమంగా కనిపించింది. జనవరి నెల ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ గడువు ముగియనుండటంతో పాటు కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌ను శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనుండటంతో దేశీయ స్టాక్ మార్కెట్‌లో మదుపరులు మరింత అప్రమత్తంగా వ్యవహరించారు.

చేనేత రంగానికి చేయూత

• కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖతో 'ట్రూబ్లూ' ఒప్పందం

• దళారీ బెడద తప్పించి ఆర్థిక వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రణాళిక • కేంద్ర మంత్రి స్మృతీఇరానీ



ముంబయి, జనవరి 30: బ్రాండెడ్ దుస్తుల కంపెనీ అరవింద్ ఫ్యాషన్స్, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సంయుక్త నిర్వహణలోని 'ట్రూ బ్లూ' కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ప్రకటించింది. భారత చేనేత రంగానికి ప్రత్యేక గుర్తింపును తీసుకురావడం దీని ప్రధాన లక్ష్యమని కంపెనీ తెలిపింది. ఈమేరకు చేనేత కార్మికులు, కళాకారుల నుంచి ప్రభుత్వ మద్దతుతోట్రూ బ్లూ సంస్థ నేరుగా ఉత్పత్తులను సేకరిస్తుంది. వాటిని 'ట్రూబ్లూ హస్త కళా వస్తువులు'గా తమ సంస్థ విక్రయాలు చేస్తుందని, దీన్ని తమ బ్రాండెడ్ విక్రయాల్లో భాగం చేస్తామని ట్రూ బ్లూ అధికారులు తెలిపారు. ఇందుకోసం సరికొత్త మార్కెట్లు, అవెన్యూలు ఏర్పాటు చేసి దేశీయ వినియోగదారులకు అందుబాటులో ఉంచుతామన్నారు. దేశ వ్యాప్తంగా వచ్చే మార్చి నెలలో ట్రూబ్లూ స్టోర్లలో ఇందుకు సంబంధించిన ప్రక్రియ ఆరంభమవుతుందన్నారు. పవర్ లూమ్స్‌తో సంబంధం లేకుండా కేవలం అసలైన చేనేత వస్త్రాలను ప్రోత్సహిస్తామన్నారు. చేనేత వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని, వీటిని ధరించడం గొప్పతనంగా విదేశీయులు భావిస్తారని అన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా ఏర్పడే కొత్త డిమాండ్‌కు అనుగుణంగా చేనేత కార్మికులు దేశంలోని సామాన్య ప్రజలను సైతం అకట్టుకునేలా సరికొత్త రకమైన ఉత్పతులను ఆవిష్కరించే అవకాశం కలుగుతుందన్నారు. కాగా, నేరుగా ఉత్పత్తులను సేకరించడం ద్వారా నేత కార్మికులకు మరింత గుర్తింపును, వారి ఉత్పత్తులకు మద్ధతు ధరలను, ఆర్థిక వెసులుబాటును కల్పించేందుకు, దళారీల బెడద లేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ఒప్పంద ద్వారా కృషి చేస్తోందని టెక్స్‌టైల్స్ మంత్రి స్మృతి ఇరానీ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. ప్రధానంగా తమిళనాడులోని కాంచీవరం, పశ్చిమ బెంగాల్‌లోని బలుచారి, జమ్దానీ, మహారాష్ట్రలోని పైతానీ, మధ్య ప్రదేశ్‌లోని చెందేరీ, మహేశ్వరీ, అస్సాంలోని ముగా, గుజరాత్‌లోని పటోలా, కాశ్మీర్‌లోని కని, ఒరిస్సాలోని టై అండ్ డై విచిత్రపురి, బొంకై, వారణాసిలోని బ్రోకేడ్స్, కేరళలోని బల్‌రామ్‌పురం, ఆంధ్రప్రదేశ్‌లోని పోచంపల్లి తదితర ప్రాంతాల నుంచి చేనేత వస్త్రాల సేకరణ జరుగుతుందని ఆమె వివరించింది. దేశ వ్యాప్తంగా 23 లక్షలకు పైగా చేనేత మగ్గాలుండగా, దాదాపు 43 లక్షల మంది చేనేత కార్మికులున్నారని చెప్పారు. చేనేత కార్మికుల్లో నిపుణతను మరింతగా పెంచేందుకు వారికి డిజైనింగ్ పరికరాలు, అత్యుత్తమ ముడిసరుకు తదితరాలు సమకూర్చాలని నిర్ణయించామని మంత్రి తెలిపారు.

బులియన్

ముంబయిలో		హైదరాబాద్‌లో	
బంగారం (22 క్యారెట్స్)		**బంగారం (22 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,214.00	1 గ్రాము:	రూ. 3,168.00
8 గ్రాములు:	రూ.25,712.00	8 గ్రాములు:	రూ. 25,344.00
10 గ్రాములు:	రూ. 32,140.00	10 గ్రాములు:	రూ. 31,680.00
100 గ్రాములు:	రూ.3,21,400.00	100 గ్రాములు:	రూ. 3,16,800.00
బంగారం (24 క్యారెట్స్)		**బంగారం (24 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,437.433	1 గ్రాము:	రూ. 3,388.235
8 గ్రాములు:	రూ. 27,499.464	8 గ్రాములు:	రూ. 27,105.88
10 గ్రాములు:	రూ. 34,374.33	10 గ్రాములు:	రూ. 33,882.35
100 గ్రాములు:	రూ. 3,43,743.3	100 గ్రాములు:	రూ. 3,38,823.5
వెండి		**వెండి**	
8 గ్రాములు:	రూ. 331.20	8 గ్రాములు:	రూ. 331.20
10 గ్రాములు:	రూ. 414.00	10 గ్రాములు:	రూ. 414.00
100 గ్రాములు:	రూ. 4,140.00	100 గ్రాములు:	రూ. 4,140.00
ఒక కిలో:	రూ. 41,400.00	ఒక కిలో:	రూ. 41,400.00

మళ్లీ పెరిగిన పసిడి ధర

• పది గ్రాములకు రూ. 320 పెరుగుదల

న్యూఢిల్లీ, జనవరి 30: దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు బుధవారం కూడా పెరిగాయి. పది గ్రాముల పసిడి ధర రూ. 320 పెరిగి, రూ. 34,000 మార్కును దాటింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న బంగారం ధరలకు అనుగుణంగా దేశీయ మార్కెట్‌లోనూ వాటి ధరలు పెరిగాయని అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. పది గ్రాముల పసిడి ధర రూ. 320 పెరిగి, రూ. 34,070కి చేరుకుంది. బంగారం బాటలోనే వెండి ధర కూడా కిలో గ్రాముకు రూ. 330 పెరిగి, రూ. 41,330కి చేరుకుంది. పారిశ్రామిక యూనిట్లు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ పెరగడంతో వెండి ధర పెరిగింది. ప్రపంచ మార్కెట్‌ను పరిశీలిస్తే న్యూయార్క్‌లో ఒక ఔన్స్ బంగారం ధర 1,314.76 డాలర్లకు పెరిగింది. అలాగే ఒక ఔన్స్ వెండి ధర 15.96 డాలర్లు పెరిగింది.






మహాత్మా గాంధీ 71వ వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద వందనం చేస్తున్న భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, పూలుజల్లి నివాళులర్పిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్.



మహిళలు కూడా పూజాది కార్యక్రమాలతో పాటు అపర కర్మల్లోనూ పాల్గొనవచ్చంటూ బుధవారం గంగానది వద్ద పుణ్యస్నానాలకు వెళుతున్న 'సాధ్వీ'లు. నది ఒడ్డున మంత్రోచ్చారణ

గంగానది ప్రక్షాళన త్రిసభ్య కమిటీలో డా. అనితా రాయ్ కొనసాగింపు

- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 30: గంగానది ప్రక్షాళన చేసే దిశగా పనిచేసే త్రిసభ్య కమిటీలో మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ అనితా రాయ్ కూడా సభ్యురాలుగా ఉంటారని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) స్పష్టం చేసింది. గంగా నది ప్రక్షాళనకు ఉద్దేశించిన ముగ్గురు సభ్యులు కలిగిన కమిటీకి ఉత్తరాఖండ్ హైకోర్టు మాజీ జస్టిస్ యూసీ ధ్యానీ నాయకత్వం వహిస్తున్నారు. ఈ కమిటీలో మాజీ ఐపీఎస్ అధికారిణి, ఐఐటీ తరపున ప్రాతినిధ్యం వహించేందుకుగాను అనితా రాయ్ నియామకాన్ని జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయెల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్న ఎన్‌జీటీ బెంచ్ ఖరారు చేసింది. త్రిసభ్య కమిటీలో సభ్యురాలిగా వ్యవహరించనున్న అనితా రాయ్‌కి తగిన గౌరవభత్యం కూడా ఇవ్వాలని బెంచ్ ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి సూచించింది. గోముఖ్ నుంచి హరిద్వార్, హరిద్వార్ నుంచి కాన్పూర్ వరకు గల గంగానది ప్రక్షాళనకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన ఫేజ్-1లోని సెగ్మెంట్-ఏ, సెగ్మెంట్-బీలలో సైతం డాక్టర్ అనితా రాయ్ సభ్యురాలుగా వ్యవహరిస్తారు. ఖచ్చితమైన పర్యవేక్షణతో హరిద్వార్ నుండి ఉన్నావో వరకు గల ప్రాంతంలో క్రమబద్ధంగా పనులు జరిగేలా చూడాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గతంలో సూచించింది. అంతేకాకుండా గంగానదిని వివిధ రూపాల్లో ప్రక్షాళన చేసేందుకు వీలుగా రెండు విభాగాలుగా విభజించింది. గోముఖ్ నుండి హరిద్వార్ (ఫేజ్-1), హరిద్వార్ నుండి ఉన్నావో (ఫేజ్-1లో సెగ్మెంట్-బీ), ఉన్నావో నుడి ఉత్తరప్రదేశ్ సరిహద్దు, యూపీ సరిహద్దు నుండి జార్ఖండ్, జార్ఖండ్ సరిహద్దు నుండి బెంగాల్ సముద్ర తీర ప్రాంతం వరకు వివిధ రూపాల్లో పనులు చేపట్టాలని ఎన్‌జీటీ ఆదేశించింది. హరిద్వార్‌తోపాటు ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావో ప్రాంతంలో తాగునీళ్లు, స్నానం చేసేందుకు ఉపయోగించే నీళ్లు చాలా అధ్వాన్నంగా ఉన్నాయని ఎన్‌జీటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఆయా ప్రాంతాల్లో నీటిని ఉపయోగించే అమాయక ప్రజలు అనారోగ్యంతో అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఎక్కడ పరిశుద్ధమైన నీరు తాగడానికి లేదా స్నానాలకు పనికి వస్తాయో అన్న అంశాలపై ప్రతి 100 కిలోమీటర్ల పరిధిలో బోర్డులు ఏర్పాటు చేయాలని ఎన్ఎంసీజీని ఆదేశించింది.

క్లిష్టతర రోగులకు చికిత్సలపై మార్గదర్శకాలకు లోబడి పనిచేయండి

- ప్రైవేటు ఆస్పత్రులు, వైద్యులకు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు
- మహిళ పిటిషన్‌పై స్పందించాల్సిందిగా ఢిల్లీ ప్రభుత్వానికి సూచన

న్యూఢిల్లీ, జనవరి 30: క్లిష్టతర రోగుల సంరక్షణపై నిర్దేశిత మార్గదర్శకాలకు లోబడి పనిచేయాలన్న పిటిషనర్ విజ్ఞప్తిపై స్పందించాలని ఢిల్లీ హైకోర్టు అక్కడి ప్రభుత్వాన్ని, రెండు ప్రైవేటు ఆస్పత్రులను బుధవారం ఆదేశించింది. ఈ మేరకు ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌కు సమాధానాలు ఇవ్వాల్సిందిగా ఆ మూడు ప్రైవేటు ఆస్పత్రులకు చెందిన ఐదుగురు వైద్యులను హైకోర్టు ఆదేశించింది. తన తల్లికి సరైన వైద్య సేవలు అందించడంలో జరిగిన నిర్లక్ష్యం వల్లే ఆమె గుండెపోటుకు గురై మృతి చెందిందన్నది పిటిషనర్ ఆరోపణ. బుధవారం హియరింగ్‌కు వచ్చిన ఈ కేసు తదుపరి విచారణను ఏప్రిల్ 23కు న్యాయమూర్తి విభుబక్రు వాయిదా వేశారు. గతంలో సైతం ఢిల్లీ ప్రభుత్వాన్ని ఈ విషయంపై స్పందించాల్సిందిగా కోరిన హైకోర్టు అందుకు మరికొంత సమయం ఇచ్చింది. పిటిషన్‌ను మహిళ అమెరికాకు చెందిన ఓ న్యూరో సైంటిస్ట్ సలహాల మేరకు దాఖలు చేశారు. క్లిష్టతర వైద్య సేవలు, సంరక్షణ విషయంలో మౌలికమైన, ఆధునిక లైఫ్ సపోర్టునిచ్చే 'కార్డియోపల్మనరీ రెసస్సిటేషన్' (హృదయ పునరుజ్జీవనం)పై ప్రత్యేక శిక్షణను ఢిల్లీ ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న వైద్యులకు, నర్సులకు ఇప్పించాలని పిటిషనర్ హైకోర్టు ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. పారామెడికల్ సిబ్బందికి ఇలాంటి శిక్షణ అవసరమేనని హైకోర్టు సైతం ఏకీభవించింది. రెండు ఆస్పత్రులకు చెందిన ఐదుగురు వైద్యులు తన తల్లిని ఆస్పత్రిలో చేర్చుకునేందుకు, చికిత్స చేసేందుకు నిరాకరించడం వల్ల తన తల్లి నిస్సహాయ స్థితిలో కారులోనే ప్రాణాలు విడిచారని బాధిత మహిళ తన పిటిషన్‌లో వాపోయింది. ఇలాంటి వైద్యుల వైఖరిని నేరపూరిత నిర్లక్ష్యం (క్రిమినల్ నెగ్లెక్ట్)గా పరిగణించాలని కోరారు. 2017 ఫిబ్రవరి 9న తూర్పు ఢిల్లీలోని రెండు ప్రైవేటు ఆస్పత్రుల వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఇలావుండగా బాధిత మహిళ ఎలాంటి పరిహారం కోరడం లేదని, వైద్యులు, ఆస్పత్రులకు మార్గదర్శకాలకు కట్టుబడి ఉండేలా చేయాలని మాత్రమే కోరుతున్నారని ఆమె తరపు న్యాయవాది దేహద్రాయ్ స్పష్టం చేశారు. అలాగే బాధ్యులైన రెండు ప్రైవేటు ఆస్పత్రులను పూర్తిగా మూసివేసి, వాటి లైసెన్సులు, అనుమతులు కూడా రద్దు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐదుగురు వైద్యుల లైసెన్సులు, డిగ్రీలు రద్దు చేయాలని ఢిల్లీ ప్రభుత్వానికి, ఆరోగ్య సేవల శాఖ డైరెక్టర్ జనరల్‌ను ఆదేశించాలని పిటిషనర్ కోరారు.

అణ్వాయుధ సరఫరా గ్రూప్‌లో భారత్

- ఆందోళన వ్యక్తం చేసిన చైనా
- అణ్వాయుధ నిరోధంపై చర్చించేందుకు పీ-5 సభ్యుల భేటీ

బీజింగ్, జనవరి 30: అణ్వాయుధ సరఫరా గ్రూప్ (ఎన్ఎస్‌జీ)లో భారత్ ప్రవేశించడంతో చైనా ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈమేరకు బుధవారం దీనిపై సుదీర్ఘంగా చర్చించేందుకు ఐదుగురు శాశ్వత సభ్యులు కలిగిన యూఎన్ సెక్యూరిటీ కౌన్సిల్ రెండురోజుల పాటు సమావేశం కావాలని నిర్ణయించింది. ఈ సమావేశాల్లో ముఖ్యంగా అణు నిరాయుధీకరణపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. 48 మంది సభ్యులు కలిగిన అణ్వాయుధ సరఫరా గ్రూప్ (ఎన్ఎస్‌జీలో) భారత్ ప్రవేశించడాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. భారత్ తీరు అణు నిరాయుధీకరణపై సంతకాలు చేసిందనడానికి పీ-5లోని సభ్యదేశాలు అమెరికా, రష్యా సైతం సాక్ష్యంగా ఉన్నాయని చైనా వాదిస్తోంది.

Printed and Published by **T. Venkateswarlu** on behalf of Deccan Chronicle Holdings Ltd. Printed at Deccan Chronicle Press situated at Plot No. 9, Alwal Village, Vallabh Nagar Taluk, Medchal Malkajgiri Dist., Telangana and Published at 36, S.D. Road, Secunderabad-3, Chief Editor **T.V.Ravi Reddy,**
PBX 27803930 (6Lines), Editorial: 27805056, **Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60**

మహాకూటమి గెలిస్తే రోజుకో ప్రధాని

- బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఎద్దేవా



కాన్పూర్, జనవరి 30: కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాకూటమి ఏర్పాటు కోసం జరుగుతున్న ప్రయత్నాలను బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఎండగట్టారు. ఒకవేళ అదే కూటమి అధికారంలోకి వస్తే, దేశానికి రోజుకో ప్రధాని ఉంటాడని ఎద్దేవా చేశారు. ఒకవేళ మహాకూటమి అనేది రూపుదిద్దుకుంటే, ముందుగానే ప్రధాన మంత్రి అభ్యర్థి పేరును ప్రకటించాలని డిమాండ్ చేశారు. సోమవారం అఖిలేష్ యాదవ్, మంగళవారం మమతా బెనర్జీ, బుధవారం శరద్ పవార్, గురువారం దేవెగౌడ, శుక్రవారం స్టాలిన్ ప్రధానులుగా ఉంటారని వ్యాఖ్యానించారు. ఆదివారాలు సెలవు ఉంటుందని బుధవారం ఇక్కడ జరిగిన బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ అమిత్ షా చమత్కరించారు. 'మార్పు తెస్తామంటూ మీరంతా నాయకుడు లేకుండానే బయలుదేరారు' అంటూ ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. ఇలాంటి పార్టీలన్నీ కలిపి పెట్టే మహాకూటమి దేశాన్ని ముందుకు నడిపించలేదని స్పష్టం చేశారు. మోదీ సర్కారు మాత్రమే దేశాన్ని బలోపేతం చేస్తుందని అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ విజయభేరి మోగిస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని అమిత్ షా జోస్యం చెప్పారు. నాయకుడు లేని మహా కూటమి భవిష్యత్తు అగమ్యగోచరమన్నారు.

గోయల్ సమర్పణలో మధ్యంతర బడ్జెట్

న్యూఢిల్లీ, జనవరి 30: లోక్‌సభలో మధ్యంతర బడ్జెట్‌ను తాత్కాలిక ఆర్థిక శాఖ మంత్రి పీయూష్ గోయల్ సమర్పిస్తారు. అయితే, మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో 'మధ్యంతర' అనే పదం వాడకుండా '2019-20 బడ్జెట్' అని ఉండడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ దీనిని 'మధ్యంతర' బడ్జెట్‌గా పేర్కొంటూ మరో ప్రకటన విడుదల చేయడంతో సస్పెన్స్‌కు తెరపడింది. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ తాత్కాలిక బడ్జెట్‌ను రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ఉపయోగించే ఒక ఆయుధంగా మలచుకోనున్నదన్న వాదన బలంగా వినిపిస్తున్నది. ఎన్డీఏ మిత్ర పక్షాల నుంచి ఎలాంటి ఇబ్బంది రాకుండా బీజేపీ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నది. ఇలావుంటే, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రస్తుతం వైద్య పరీక్షల నిమిత్తం అమెరికాలో ఉన్నారు. ఆయన స్థానంలో గోయల్‌కు తాత్కాలికంగా బాధ్యతలను అప్పచెప్పారు. పార్లమెంటు సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానుండగా, ప్రతిపక్ష పార్టీలు ఏ విధంగా వ్యవహరిస్తాయన్నది ఆసక్తిని రేపుతున్నది. ప్రత్యేక హోదా కోసం తెలుగు దేశం పార్టీ ఒక రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టడంతో, పార్లమెంటు సమావేశాల్లో మొదటి రోజే గందరగోళ పరిస్థితులు తప్పవన్న అనుమానం తలెత్తుతున్నది. వివిధ అంశాలపై తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలకు చెందిన ఎంపీలు కూడా నిరసన గళం విప్పే ప్రమాదం కనిపిస్తున్నది. ఇలావుంటే, గోయల్ సమర్పించబోయే మధ్యంతర ఎన్నికల్లో ఏఏ అంశాలను ప్రస్తావిస్తారన్న అంశంపై జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి. లోక్‌సభకు జరగబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, ఎన్డీఏ తన హామీలను పరోక్షంగా ఈ బడ్జెట్‌లో పొందుపరుస్తుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. ఎన్నికలు జరిగే సంవత్సరంలో ప్రవేశపెట్టబోయే మధ్యంతర బడ్జెట్‌ను ఓట్ ఆన్ అకౌంట్ విధానంలో ఉండడం లేదా ఆమోదం పొందడం అనేది ఆనవాయితీగా వస్తున్నది. 2014 ఫిబ్రవరిలో, అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడితే, అదే ఏడాది జూలైలో జైట్లీ పూర్తి బడ్జెట్‌ను లోక్‌సభ ముందు ఉంచారు. ఆ ఆనవాయితీ ప్రకారం ఎన్డీఏ సర్కారు కూడా ఓట్ ఆన్ అక్కౌంట్‌గానే బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

చట్టంతో ఆటలొద్దు

- కార్తీకి సుప్రీం స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 30: చట్టంతో ఆటలొద్దని, దానిని తు.చ తప్పకుండా పాటించాలని కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పీ. చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరానికి సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రూ.10 కోట్ల పూచీకత్తుమీద విదేశాలకు వెళ్లే అవకాశాన్ని కార్తీకి కల్పించింది. అయితే, దీనిని అలుసుగా తీసుకొని, చట్టంతో ఆడుకునే ప్రయత్నం చేయవద్దని, ఒకవేళ అదే జరిగితే, తీవ్ర పరిణామాలు తప్పవని తేల్చిచెప్పింది. ఈ ఏడాది మార్చి 5, 6, 7 తేదీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు హాజరుకావాలని ఆయనను ఆదేశించింది. 'మీరు ఎక్కడికైనా వెళ్లవచ్చు. కానీ, చట్టంతో ఆడుకోవద్దు. ఒకవేళ మీరు సహకరించకపోతే కఠినంగా వ్యవహరించక తప్పదు' అని బుధవారం కోర్టుకు హాజరైన కార్తీకి వ్యాఖ్యానించింది. కొంత మంది ఆర్థిక, ఇతర నేరస్థులు దేశం విడిచి వెళ్లిన తర్వాత, తిరిగి రావడానికి నిరాకరిస్తున్న విషయం తెలిసిందే. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసిందనేది స్పష్టం. ఈనెల 10 నుంచి 26వ తేదీ వరకూ, తిరిగి మార్చి 23 నుంచి 31వ తేదీ వరకూ తాను విదేశీ పర్యటనకు వెళ్లేందుకు అనుమతించాలని కార్తీ సుప్రీం కోర్టును కోరారు. ఆయన అభ్యర్థనపై స్పందించిన ధర్మాసనం అనుమతినిచ్చింది. అయితే, చట్టాన్ని ఉల్లంఘించకుండా, చట్టానికి సహకరించాలని వ్యాఖ్యానించింది. పది కోట్ల రూపాయల పూచీకత్తు ఇవ్వాలని తెలిపింది.


ఢిల్లీ హైకోర్టులో హై డ్రామా!

- వీరభద్ర సింగ్ కేసు విచారణను తిరస్కరించిన జడ్జి

న్యూఢిల్లీ, జనవరి 30: ఢిల్లీ హైకోర్టులో బుధవారం హైడ్రా చోటు చేసుకుంది. కాంఅగెస్ సీనియర్ నాయకుడు, హిమాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్, ఆయన భార్య ప్రతిభా సింగ్‌పై వచ్చిన అక్రమార్జన ఆరోపణల కేసు విచారణకు న్యాయమూర్తి వజీరీ తిరస్కరించారు. ఈ కేసులో ముద్దాయిల తరపున వాదించాల్సిన కాంగ్రెస్ సీనియర్ నేత, అడ్వొకేట్ అభిషేక్ సింఘ్వి వస్తేనే విచారణ సాధ్యమవుతుందని తేల్చిచెప్పారు. సింఘ్వి మరో కేసులో తీరిక లేకుండా ఉన్నారని, ఆయన తరపున తాను కేసును వాదిస్తానని ఓ లాయర్ వజీరీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన నిరాకరించారు. ఈ కేసు విచారణకు వచ్చిన తొందరేమీ లేదని, సింఘ్వి వచ్చిన తర్వాత వాదన కొనసాగుతుందని తేల్చిచెప్పారు. వీరభద్ర సింగ్ కేసును తాను చేపడతానని వచ్చిన లాయర్ పదేపదే చెప్పడంతో వజీరీ అసహనం వ్యక్తం చేశారు. ఈ దశలో మరో సీనియర్ న్యాయవాది ధ్యాన్ కృష్ణన్ వజీరీ ముందు హాజరై, సింఘ్వి అదే కోర్టులో, మరో కేసులో బిజీగా ఉన్నారని, కాబట్టి, ఆయన తరపున వాదించే అవకాశం తనకు ఇవ్వాలని కోరారు. కానీ, వజీరీ సానుకూలంగా స్పందించలేదు. కేసును ఫిబ్రవరి ఆరో తేదీకి వాయిదా వేశారు. 82 ఏళ్ల వీరభద్ర సింగ్, ఆయన భార్య ప్రతిభ అక్రమార్జన కేసులో ఈనెల 24న న్యాయమూర్తి ముక్తా గుప్తా కూడా ఇదే విధంగా కేసును విచారణకు స్వీకరించకుండా, వాయిదా వేశారు.

విభజన కష్టాలు!

సహకరించని కేంద్రం



- స్వయం కృషితోనే అభివృద్ధి
- ఈ ఏడాదిలోనే పోలవరం నుంచి నీళ్లు
- రుణమాఫీతో రైతులకు భరోసా
- ఐదేళ్లలో వ్యవసాయానికి రూ.81,554 కోట్లు
- ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యం
- సమగ్ర అభివృద్ధికి ఐదేళ్ల విజన్ డాక్యుమెంట్
- ఉభయ సభలనుద్దేశించి ప్రసంగంలో గవర్నర్

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 30: రాష్ట్ర విభజన చేసిన గాయం ఇప్పటికీ మానలేదు.. కేంద్ర సహకారం లేదు.. అయినా స్వయంకృషితో దార్శనిక పత్రాన్ని రూపొందించుకుని వాస్తవ రూపంలోకి తెచ్చాం.. దేశంలోనే వివిధ రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపామని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ స్పష్టం చేశారు. శాసనసభ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయసభలనుద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ తొలుత సమాజమే దేవాలయం.. ప్రజలే నా దేవుళ్లని దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నినదించారంటూ, మా ప్రభుత్వానికి మార్గదర్శకం ఆయన దూరదృష్టి' అంటూ ప్రసంగం ప్రారంభించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వం రూపొందించిన 40 పేజీల ప్రసంగం వివరాలిలా ఉన్నాయి. పునర్విభజన చట్టం ఫలితంగా అనేక సవాళ్లు ఎదరవుతున్నాయి. వాటిలో అనేకం ఇప్పటికీ నెరవేరలేదు. విభజన రాష్ట్ర ప్రజలను కష్టనష్టాలకు గురి చేసింది. ఎలాంటి హేతుబద్ధతలేదు. ప్రజలు, వారి ప్రతినిధులతో సంప్రదింపులు లేవు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించడం ఇదే తొలిసారని కాదు. గత బడ్జెట్ సమావేశాల్లో కూడా ఉదహరించాం... విభజన గాయం చాలా తీవ్రమైంది. నాలుగున్నరేళ్ల తరువాత కూడా చట్టంలో అనేక అంశాలు అమలుకు నోచుకోలేదు. తలసరి ఆదాయం తక్కువగా ఉన్న కొత్త రాష్ట్రం. హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు తరహా రాజధాని లేకుండా చేశారు. తీవ్ర ఆర్థిక లోటుకు తోడు అసమానంగా ఆస్తుల పంపకాలు జరిగాయి. పరిశోధన, అభివృద్ధి సంస్థల కొరత. ప్రామాణికంగా లేకుండా చేసిన విభజన తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. భౌగోళిక ప్రాతిపదికన ఆస్తుల పంపిణీ, జనాభా ప్రాతిపదికన అప్పుల పంపిణీ జరిగింది. 58.42 శాతం జనాభా ఉన్న ఏపీకి ఉమ్మడి రాష్ట్ర రాబడిలో 46 శాతం మాత్రమే కేటాయించటం, విద్యుత్ రంగంలో వినియోగం ప్రాతిపదిక కారణంగా పంపిణీతో మరిన్ని నష్టాలను చవిచూడాల్సి వచ్చిందని వివరించారు. రాష్ట్రంలో వృద్ధిరేటు 10.66 శాతంగా ఉంది. అదే సమయంలో జాతీయ స్థాయిలో 7.3 శాతం ఉంది. కేంద్ర సహకారం లేకపోయినా రాష్ట్రం వివిధ రంగాల్లో అద్భుతమైన అభివృద్ధిని సాధించటం విశేషం. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో రాష్ట్రం 11 శాతం రికార్డు స్థాయి అభివృద్ధిని సాధించింది. ఇది దేశంలోనే అత్యధికం. అదే జాతీయ స్థాయిలో 2.4 శాతం మాత్రమే వృద్ధిరేటు కనిపించింది. ఇలాంటి వృద్ధి ఫలితాలను సాధించటం అంత తేలిగ్గా జరగలేదు. అంకిత భావం, ప్రణాళికా బద్ధంగా కష్టపడి పనిచేయటం, సరళీకరించి మెరుగుపరిచిన ప్రభుత్వ విధానాలే వృద్ధి సాధనకు దోహదం చేశాయి. కేంద్రం సహకరించి ఉంటే మరింత అభివృద్ధిని సాధించే వాళ్లం. వయాడక్ట్ ప్లాట్‌ఫాంపై విజన్ 2019-24ను రూపొందించుకుని అడుగులు వేస్తున్నాం. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేర్చటం, మౌలిక సదుపాయాల కల్పన, అవసరమైన పౌర సేవల్లో చాలా వరకు గరిష్ఠస్థాయి పురోగతి సాధించటం విశేషం. మిగిలిన అన్ని విభాగాల్లో పూర్తి స్థాయిలో ప్రజలకు ప్రయోజనాలు అందించటం కోసం విజన్ 2019-24 రూపొందించుకుంటున్నాం. అసలు అంధకారం కంటే అధ్వాన్నమైన పరిస్థితి సరైన ప్రణాళిక లేకపోవటమే ని హెలెన్ కెల్లెర్ పేర్కొన్న మాటలను గవర్నర్ ప్రస్తుతించారు. 2029విజన్ ద్వారా ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. పట్టిసీమ ద్వారా గోదావరి - కృష్ణా అనుసంధానం దేశానికే మార్గదర్శకమన్నారు. 2019 జూలై కల్లా గ్రావిటీ ప్రాతిపదికన నీరివ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. కేంద్రం మరింతగా తోడ్పాటు ఇచ్చి ఉంటే పనులు ఇంకా శరవేగంతో పూర్తయ్యేవన్నారు. ప్రాజెక్ట్‌పై ఇప్పటి వరకు రూ 15,585.17 కోట్లు ఖర్చుచేశాం.. 2014 జూన్ నుంచి 10,449.30 కోట్లు ఖర్చయ్యాయి. 32,315.50 క్యూబిక్ మీటర్ల సిమెంట్ కాంక్రీట్ పనులు పూర్తిచేసి గిన్నిస్ బుక్ రికార్డు సాధించాం.. బెస్ట్ ప్రాజెక్ట్‌గా పోలవరానికి సీబీఐపీ అవార్డు వచ్చిందంటే అది ప్రభుత్వ ఘనత అన్నారు. రూ 24వేల కోట్లతో చేపట్టిన రుణమాఫీ రైతుల్లో భరోసా నింపిందన్నారు.

మాతృభూమి


పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

గురువారం, 31 జనవరి 2019

యోగాతో వెన్నునొప్పి దూరం








నిలకడస్థితిలో పని, కదలిక లేని జీవన విధానాల వల్ల వెన్నెముకలో, ముఖ్యంగా కింది భాగంలో నొప్పి కలగటం చాలా సాధారణం. తప్పుడు భంగిమ, చైతన్య రహిత జీవనం, ఎక్కువ సమయం కూర్చుని పనిచేయడం, పోషకాహారలోపం వల్ల వెన్నెముక కింది భాగంలో నొప్పిని కలుగచేసే కారణాలుగా చాలామంది చెబుతుంటారు. ఇది నిజమే.. వీటివల్ల భవిష్యత్తులో వెన్నునొప్పి మరింత పెరగవచ్చు. ఇలాంటి సమస్యలు ఉన్నా, భవిష్యత్తులో ఈ నొప్పి బారినపడకుండా ఉండాలంటే కొన్ని యోగా భంగిమలను అనుసరించాలి. కానీ వీటిని అనుసరించే ముందు నిపుణుల సహాయాన్ని తీసుకోవాలి. వెన్నెముక కింది భాగంలో నొప్పిని తగ్గించే వ్యాయామాలను చూద్దాం..



భుజంగాసనం

దీనినే 'కోబ్రా' భంగిమ అని కూడా అంటారు. ఈ యోగాసనం వల్ల వెన్నెముక భాగంలో కలిగే నొప్పులు తగ్గటమే కాకుండా వెన్నెముక వశ్యతను అంటే వంగే గుణాన్ని కూడా పెంచుతుంది. ఈ ఆసనాన్ని అనుసరించే పద్ధతిని తెలుసుకుందాం.. ఈ రకమైన భంగిమలో స్వతహాగా శరీరాన్ని వంచాలి. అంటే నుదురుభాగం భూమికి ఆనేలా నేలపై బోర్లా పడుకోవాలి. తరువాత అరచేతులను నేలపై ఉంచి శరీర సగభాగాన్ని లేపాలి. ఈ సమయంలో కాళ్లను అలాగే చాపి ఉంచి కాలి బొటనవేలును నేలను తాకి ఉంచాలి. ఈ భంగిమను చేసే ముందు గాలిని బాగా పీల్చి వదలాలి. ఈ భంగిమ చూడటానికి పాము పడగ విప్పినట్లు ఉంటుంది కాబట్టి దీన్ని కోబ్రా భంగిమ అని అంటారు. ఇలా చేయడం వల్ల వెన్నెముక నరాలపై ప్రభావం పడి నొప్పులను తగ్గిస్తుంది.





బ్రహ్మ ముద్ర


దీన్ని శ్వాస సంబంధిత యోగాసనం అని చెప్పవచ్చు. పైగా చాలా ముఖ్యమైన ఆసనం. ఇది గాలిని పీల్చుకుంటూ తలను తిప్పే వ్యాయామం. ఒక చదునైన నేలపై వెన్నును నిటారుగా ఉంచి కూర్చోవాలి. అంటే ధ్యాన భంగిమలో అన్నమాట. కానీ తొడలపై చేతులు ఉంచకూడదు. ఇప్పుడు నెమ్మదిగా గాలి పీలుస్తూ తగిన విధంగా తలను కుడి, ఎడమలకు తిప్పాలి. అదేవిధంగా గాలిని వదులుతూ తలను అదే స్థానానికి తీసుకురావాలి. ఇలా చేసే సమయంలో గాలి పీలుస్తూ తలను పక్కకు తిప్పిన తరువాత ఊపిరి బిగబట్టి పది అంకెలను లెక్కపెట్టాలి. తరువాత తిరిగి మామూలు స్థానానికి తలను తీసుకురావాలి. ఇదే పద్ధతిలో తలను పైకి, కిందకు కూడా కలపాలి. ఈ ఆసనం వల్ల కండరాలు ఒత్తిడికి గుర్రై విశ్రాంతి దశకు చేరతాయి. ఇలా రోజులో కొన్నిసార్లు చేయడం వల్ల మంచి ఫలితాలను పొందవచ్చు.

సుప్త హస్త పదాంగుస్టాసన


నిశ్చల జీవనశైలిని అనుసరించేవారికి, వెన్నెముక నొప్పులతో బాధపడేవారికి ఇది చాలా మంచి ఆసనం అని చెప్పవచ్చు. ముందుగా వెల్లకిలా పడుకుని శ్వాసను పీల్చుకుంటూ రెండు చేతులను రెండు పక్కలా చాచాలి. తరువాత కుడికాలును పైకి లేపి కుడి చేతితో అందుకోవాలి. తిరిగి సాధారణ స్థితికి వచ్చాక మీ ఎడమకాలిని కూడా ఎడమ చేతితో అందుకోవాలి. ఇలా రోజుకు ఐదు నుంచి పదిసార్లు చేయడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది.

ఈ ఆసనాలన్నీ వెన్నునొప్పిని తగ్గిస్తాయి. ఏ యోగాసనాలను అనుసరించే ముందు తప్పనిసరిగా యోగా నిపుణుల దగ్గర శిక్షణ అవసరం. ★

ఈ పాప బాధ తీర్చలేనిది!




ఈ అమ్మాయి పేరు జెస్సీ.. వయస్సు పదకొండు సంవత్సరాలు.. మెక్సికోకు చెందిన జెస్సీ యూట్యూబ్‌లో చాలా పాపులర్ స్టార్. ఈమె యూట్యూబ్ చానల్‌కు ఇప్పటివరకూ 13.5 కోట్ల వ్యూస్ వచ్చాయి. వీడియోలు చేయడానికి, కెమెరా ముందు మాట్లాడటానికి ఆమెకు ఎలాంటి స్క్రిప్టు అవసరం లేదు. కెమెరా ముందుకు రాగానే సంతోషంగా గలగలా మాట్లాడేస్తుంది. ఆ లక్షణమే ఆమెకు అంతటి ఆదరణను తీసుకొచ్చింది. తన సోదరుడు పెపెతో కలిసి జెస్సీ వీడియోలను రూపొందిస్తూ ఉంటుంది. డిస్నీ కోసం చేసిన ఓ వీడియోకు ఏకంగా 2.2 కోట్ల వ్యూస్ వచ్చాయి. తన వీడియోలను చూసి ప్రజలంతా సంతోషించాలని, తనకు బాగా పేరు రావాలనేది జెస్సీ కోరిక. అయితే.. కొన్ని వీడియోలకు తను ఆశించిన స్థాయిలో వ్యూస్ రాకపోతే ఆమె ఒక్కోసారి నిరాశకు గురయ్యేది. తరువాత మరో మంచి వీడియోతో యూట్యూబ్‌లో మెరిసేది. ఒకరోజు జెస్సీ ఉన్నట్లుండి యూట్యూబ్‌లో వీడియోలను పోస్ట్ చేయడం ఆపేసింది. కొద్దిరోజులు గడిచిన తరువాత మళ్లీ ఓ వీడియోను పోస్ట్ చేసింది.. అదేంటంటే.. "హలో.. నా పేరు జెస్సికా.. మీ అందరికీ నేను జెస్సీగా తెలుసు.. నా జీవితం ఎలా మారిపోయిందో.. ఈ రోజు మీ అందరికీ చెప్పాలనుకుంటున్నా.." అంటూ ప్రారంభమైన ఈ వీడియోలో జెస్సీ తన జీవితంలో జరిగిన ఓ విషాద సంఘటనను వివరించింది. జెస్సీ తల్లిపేరు అలైసియా.. జెస్సీ, ఆమె సోదరుడు పెపెల జీవితంలో వాళ్ల అమ్మ ఎంతో ముఖ్యమైన వ్యక్తి. "ఓ రోజు అమ్మకు బాగోలేదు. ఆమె నొప్పితో చాలా బాధపడింది. చివరికి ఆమెకు కేన్సర్ చివరిదశలో ఉందని తేలింది.. కొద్దిరోజుల్లోనే ఆమె చనిపోయింది." అంటూ వీడియోను ఆపేసింది జెస్సీ.. అలా ఆ చిన్నపాప జీవితంలో జరిగిన విషాధ సంఘటన చాలామందిని కంటతడి పెట్టించింది. తన తల్లిని ఎప్పటికీ గుర్తుంచుకోవాలని భావించిన జెస్సీ ఇక వీడియోలను చేయడం మానేసింది. తల్లిని తల్చుకుంటూ తన పనుల్లో తను మునిగిపోయింది. తరువాత జెస్సీ సోదరుడు పెపె తన తల్లి కవల సోదరితో కలిసి ఓ వీడియోను రూపొందించాడు. ఈ వీడియోకు ఇప్పటికే అరవై లక్షల వ్యూస్ వచ్చాయట.. ఇంకా వస్తూనే ఉన్నాయట.. "కొంతకాలంగా జెస్సీ యూట్యూబ్‌కు దూరంగా ఉండటం వల్ల కొద్దిగా ఆదరణ తగ్గింది. కానీ అమ్మను మర్చిపోవడానికి ఈ వీడియో సాయం చేస్తుందేమో అనిపిస్తోంది" అని అంటున్నాడు జెస్సీ సోదరుడు పెపె.. ఏది ఏమైనా జెస్సీ తన తల్లి జ్ఞాపకాల నుంచి బయటపడి మరిన్ని వీడియోలు చేయాలని ఆమె అభిమానులు భావిస్తున్నారు. ★



ఔషధాల గని.. బ్లూబెర్రీ

బ్లూబెర్రీలో చాలారకాల ఔషధ తత్వాలు ఉన్నాయి. అంతేకాదు ఇవి చాలా రుచిగా ఉంటాయి. ఇవి సాధారణంగా అమెరికా, యూరప్, కెనడా, ఆసియాలలో పెరుగుతాయి. బ్లూబెర్రీ మొక్కలు పొదల్లా పెరుగుతాయి. ఈ పొదలను అనుసరించి వీటిని మూడు రకాలుగా వర్ణించారు.





★ బ్లూబెర్రీ చర్మాన్ని మృదువుగా మారుస్తుంది.

★ మెదడు సామర్థ్యాన్ని పెంచడంలో బ్లూబెర్రీ ఎంతగానో సహాయపడుతుంది.

★ దీనిలో కేన్సర్ వ్యాధిని తగ్గించే లక్షణాలు ఉన్నాయి.

★ ఎక్కువకాలం యవ్వనంగా కనపడాలి అనుకునేవారు.. వారు పాటించే ఆహార ప్రణాళికలో బ్లూబెర్రీలను తప్పనిసరిగా కలుపుకోవాలి. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు అకాల వృద్ధాప్యాన్ని అడ్డుకుంటాయి. అంతేకాదు బ్లూబెర్రీలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు మెదడు పనితీరును స్థిరీకరిస్తాయి.

★ బ్లూబెర్రీలకు నీలిరంగును ఆపాదించే ఆంతోసైనిన్‌లు కేన్సర్ కారకపు ఫ్రీ రాడికల్‌పై దాడిచేసి, ట్యూమర్ పెరుగుదలను నియంత్రిస్తాయని అర్బానా-కాంపైన్‌లో ఉన్న 'యూనివర్శిటీ ఆఫ్ ఎట్ ఇల్లినాయిస్'వారు తెలిపారు. కావున కోలన్ కేన్సర్ లేదా ఇతర కేన్సర్‌లను కలిగి ఉన్నవారు రోజూ బ్లూబెర్రీలను తినాలి.




★ బ్లూబెర్రీలో వయసు సంబంధిత మతిమరుపు, అల్జీమర్స్ వంటి వాటిని తగ్గించి వేస్తుందని ఇంగ్లాండ్‌లో ఉన్న పెనిన్సులా మెడికల్ స్కూల్, యూనివర్శిటీ ఆఫ్ రీడింగ్ వారు తెలిపారు. బ్లూబెర్రీలో ఉండే ఫ్లేవనాయిడ్స్ అనే యాంటీ ఆక్సిడెంట్‌లు దీనికి కారణం వారు చెబుతున్నారు. కాబట్టి ఎండిన బ్లూబెర్రీలను స్నాక్స్‌గా తీసుకోవడం చాలా మంచిది.

★ బ్లూబెర్రీల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుందని మనకు తెలిసిందే.. ఈ ఫైబర్‌లు మలబద్ధకాన్ని నివారిస్తాయి. అంతేకాదు.. విటమిన్ ఇతర అన్ని రకాల పోషకాలను కలిగి ఉండే బ్లూబెర్రీలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.

★ టైప్-2 రకం మధుమేహవ్యాధి కలిగి ఉండేవారు బ్లూబెర్రీలను తినడం వల్ల రక్తంలోని చక్కెరస్థాయిలు నియంత్రణలో ఉంటాయని పరిశోధనల్లో రుజువైంది. రోజూ బ్లూబెర్రీలను తినే వారి రక్తంలోని చక్కెరస్థాయిలు తక్కువగా ఉంటాయి. ★




సోషల్ మీడియా చేటు..





సోషల్ మీడియా.. ఈ రోజుల్లో మనుషులు ఇందులో నవ్వుతున్నారు.. ఏడుస్తున్నారు.. అరుస్తున్నారు.. ఇంకా ఏమేమో చేస్తున్నారు. ప్రపంచ జనాభాలో దాదాపు 300 కోట్లమంది సోషల్ మీడియాలో విహరిస్తున్నట్లు అంచనా.. అంటే దాదాపు ప్రపంచ జనాభాలో నలభై శాతం మంది. వీరు రోజుకు సగటున రెండు గంట సమయం ఇందులోనే గడుపుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. జీవితంలో ఇంతగా భాగమైపోయిన ఈ సోషల్ మీడియా మనిషికి భారంగా మారుతోందా? మానవుల ఆలోచనలు, భావాలు, ఉద్వేగాలు, బంధాలపై ప్రభావం చూపుతోందా? అవుననే అంటున్నాయి నివేదికలు..



సోషల్ మీడియా దాదాపు దశాబ్దం కిందటే పుట్టుకొచ్చింది. అందువల్ల మనిషి భావోద్వేగాలపై దీని ప్రభావాన్ని కచ్చితంగా అంచనా వేయగల పూర్తిస్థాయి పరిశోధనలు ఇంకా జరగలేదు. ఇప్పటివరకు జరిగిన పరిశోధనలన్నీ దాదాపు ఫేస్‌బుక్ చుట్టూనే ఉన్నాయి. అయితే ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావంపై పరిశోధనలు మరింత లోతుగా జరుగుతున్నాయి. ఇప్పటివరకు వచ్చిన కొన్ని పరిశోధనల ఫలితాలను సమీక్షించి ఆసక్తికరమైన విషయాలను మీముందుంచుతున్నాం..

సోషల్ మీడియాలతో మానసిక ఒత్తిడి పెరుగుతోందా? అనే విషయంపై వాషింగ్టన్ డీసీకి చెందిన ప్యూ రీసెర్చ్ సెంటర్‌లో 2015లో పరిశోధనలు చేసింది. 1800 మంది పురుషులు, మహిళల అభిప్రాయాలను సేకరించింది. మహిళలు ఎక్కువగా ఒత్తిడికి లోనవుతున్నట్లు ఫలితాలు వచ్చాయి. ట్విట్టర్ విషయంలో పురుషులతో పోలిస్తే మహిళలు తక్కువ ఒత్తిడికి లోనవుతున్నట్లు ఆ పరిశోధన చెబుతోంది. మొత్తానికి సోషల్ మీడియా వల్ల ఒత్తిడి కొంతమేరకు ఉందని, అదేమీ భరించలేని స్థాయిలో లేదని ప్యూ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది.


సోషల్ మీడియా మానసిక స్థితిని కూడా ప్రభావితం చేయగలదు. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా 2009-2012 మధ్య 100 కోట్లకు పైగా ఫేస్‌బుక్ స్టేటస్ అప్‌డేట్లను పరిశీలించింది. వాతావరణం బాగా లేనప్పుడు నెగిటివ్ పోస్టులు ఒక శాతం పెరిగాయి. వర్షం పడుతున్న ప్రాంతంలోని వ్యక్తి ఒక నెగిటివ్ పోస్ట్ చేస్తే.. వర్షం పడని ఇతర ప్రాంతాలలోని సదరు వ్యక్తి స్నేహితులు కూడా ఆ ప్రభావంతో 1.3 నెగిటివ్ పోస్టులు పెట్టినట్లు పరిశోధకులు గుర్తించారు. ఇందులో మంచి విషయం ఏమిటంటే.. ఒక సంతోషకరమైన పోస్ట్ ప్రభావంతో 1.75 ఎక్కువ సంతోషకరమైన పోస్టులు వచ్చాయి.

సోషల్ మీడియా వినియోగదారులు అశాంతి, నిద్రలేమి, ఏకాగ్రత లేకపోవడం వంటి ఆందోళనకర పరిస్థితులకు లోనవుతున్నారా? అనే ప్రశ్నకు సమాధానంగా రెండు కంటే ఎక్కువ సోషల్ మీడియా వేదికలు ఉపయోగించేవాళ్లు మూడు రెట్లు అధికంగా ఆందోళన చెందేందుకు అవకాశం ఉందని 'కంప్యూటర్స్ అండ్ హ్యూమన్ బిహేవియర్ జర్నల్' ప్రచురించిన అధ్యయనం చెబుతోంది. అయితే సోషల్ మీడియా ఈ ఆందోళనకు ఎలా కారణమవుతుందో ఈ పరిశోధనలో తెలియలేదు.

ఆన్‌లైన్ వేదికగా జరిగే సంభాషణలకు దిగులు, నిరాశ, నిస్పృహ వంటి కుంగుబాటు లక్షణాలకు సంబంధం ఉన్నట్లు ఈ నివేదికలు చెబుతున్నాయి. దాదాపు 700 మంది విద్యార్థులపై జరిపిన రెండు అధ్యయనాలు ఈ విషయాలను వెల్లడించాయి. నెగిటివ్ పోస్టులు చేసినవారిలో ఎక్కువమంది కుంగుబాటుకు లోనవుతున్నట్లు పరిశోధకులు కనుగొన్నారు. అత్యధిక సోషల్ మీడియా వేదికలు ఉపయోగించేవారు మూడు రెట్లు అధికంగా కుంగుబాటుకు లోనయ్యే ముప్పు ఉందని 2016లో జరిపిన ఒక పరిశోధన తేల్చింది. ఆన్‌లైన్ వేధింపులు (సైబర్ బుల్లీయింగ్) వంటివి ఇందుకు కారణమని ఆ అధ్యయనం చెబుతోంది. కుంగుబాటును గుర్తించి సత్వరమే చికిత్స అందేలా చూడటానికి సోషల్ మీడియాను ఎలా వినియోగించుకోవచ్చనే అంశంపై శాస్త్రవేత్తలు దృష్టి పెట్టారు. మైక్రోసాఫ్ట్ పరిశోధకులు 476 మందికి చెందిన ట్విట్టర్ ప్రొఫైళ్లను విశ్లేషించారు. భాష, శైలి, భావోద్వేగం తదితర అంశాలను పరిశీలించారు. పదింట ఏడు కేసుల్లో కుంగుబాటు లక్షణాలను ముందే గుర్తించవచ్చని ఫలితాలు తెలిపాయి.

ప్రస్తుతం ప్రజలు పడుకునే ముందు చివరిసారిగా చూసింది, నిద్రలేవగానే తొలుత వెతికేది స్మార్ట్‌ఫోన్లు, ట్యాబులు వంటి వాటినే.. ఎందుకంటే సోషల్ మీడియా వినియోగదార్లు రాత్రిళ్లు కూడా ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి వాటిలో విహరిస్తుంటారు. ఈ పరికరాల నుంచి వెలువడే కాంతి వల్ల నిద్రనిచ్చే మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని తగ్గించేస్తుందని పరిశోధనలో వెల్లడైంది. గత ఏడాది 18-30 ఏళ్ల వయసు గల 1700 మంది సోషల్ మీడియా అలవాట్లపై యూనివర్శిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్ పరిశోధించింది. నిద్రలేమిలో నీలికాంతి పాత్ర కూడా ఉందని వీరు నిర్ధారించారు. అయితే నిద్రలేమికి సోషల్ మీడియా కారణమవుతోందా? లేక కలత నిద్రపోయేవాళ్లు ఎక్కువ సమయం సోషల్ మీడియాలో గడుపుతున్నారా? అనే విషయాలు ఈ పరిశోధనల్లో స్పష్టం కాలేదు.

సోషల్ మీడియా నేడు వ్యసనంగా మారుతోందా? అనే అంశంపై గతంలో నిర్వహించిన 43 అధ్యయనాలను నాటింగామ్ ట్రెంట్ యూనివర్శిటీకి చెందిన డారియా కస్‌మార్క్, గ్రిఫిత్‌లు విశ్లేషించారు. సోషల్ మీడియా వ్యసనం ఒక మానసిక ఆరోగ్య సమస్య అని, దానికి నిపుణుల చికిత్స అవసరం కావచ్చునని వారు నిర్ధారించారు. సోషల్ మీడియాలో అధిక సమయం గడపడానికి చదువులో రాణించలేకపోవడం, మానవ సంబంధాల్లో ఒడిదుడుకులు వంటివి కారణాలుగా వారు గుర్తించారు. అయితే సోషల్ మీడియా వ్యసనం ఇంకా మానసిక ఆరోగ్య జాబితాలో చేరలేదు.



సోషల్ మీడియా వేదికలపై ఎక్కువ సమయం గడిపేవారిలో చికాకు, ఈర్ష్య అధికంగా కనిపిస్తుంటాయని ఓ సర్వేలో తేలింది. ప్రధానంగా ఇతరులు తమ ప్రయాణాలకు సంబంధించిన ఫొటోలు పెట్టినప్పుడు ఈ భావాలు అధికంగా వ్యక్తమవుతున్నాయని సర్వేలో పాల్గొన్న 600 మంది చెప్పారు. అయితే.. సోషల్ మీడియా వల్ల ఏర్పడే ఈర్ష్య కొన్నిసార్లు మేలు కూడా చేస్తుందని మిచిగాన్ విశ్వవిద్యాలయం పరిశోధకులు తెలిపారు. ఈ ఈర్ష్య కొందరిలో మరింత కష్టపడాలన్న కసి కూడా పెంచుతుందని వెల్లడించారు.

అమెరికన్ జర్నల్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ అధ్యయనం ప్రకారం సోషల్ మీడియాలో ఎక్కువసేపు గడిపేవారిలో ఒంటరితనం పెరుగుతోంది. 29 నుంచి 32 సంవత్సరాల వయసున్న 7,000 మందిపై అధ్యయనం నిర్వహించగా వారిలో సామాజిక అనుబంధాలు, బంధుత్వాల పట్ల అవగాహన కొరవడుతోందని తేలింది. సోషల్ మీడియాలో ఎక్కువగా సంభాషణలు జరపడం ద్వారా ముఖాముఖి పరిచయాలు తగ్గిపోతున్నాయి.

ఇంతకూ సోషల్ మీడియా మంచిదా? కాదా? అంటే చెప్పలేం.. దీని ప్రభావం ఒక్కో వ్యక్తిపై ఒక్కో విధంగా ఉంటుందన్న మాట వాస్తవం. అది ఆయా వ్యక్తుల పరిస్థితి, వ్యక్తిగత లక్షణాలపై ఆధారపడి ఉంటుంది. సోషల్ మీడియాలో అతిగా గడపాలని సలహా ఎవ్వరూ ఇవ్వలేరు. అలాగని సోషల్ మీడియాతో పూర్తిగా చెడే జరుగుతుందని చెప్పడం కూడా పొరబాటే.. ఎందుకంటే దానివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ★

కర్మభూమి

రచనో, చిత్రమో నాట్యమో
రుచి పెంచెడి కర్మమొకటి ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కామమ్మబోసుచు మనుజుల కాంక్షలు తీర్చున్

ఆంధ్రభూమి గురువారం, 31 జనవరి 2019

శ్రీనరసింహ శతకము

సీ॥ దేహమున్నవఱకు మోహసాగరమందు
మునుఁగుచుందురు శుద్ధ మూఢజనులు
సలలితైశ్వరముల్ - శాశ్వతంబనుకొని
షడ్భ్రమలను మానఁజాలరెవరు
సర్వకాలము మాయ సంసారబద్ధులై
గురుని కారుణ్యంబు గోరుకొనరు
జ్ఞానభక్తి విరక్తులైన పెద్దలఁజూచి
నిందఁజేయక తాము నిలువలేరు
తే॥ మత్తులైనట్టి దుర్జాతిమనుజులెల్ల
నిన్నుఁగనలేరు మొదటికే నీరజాక్ష!
భూషణ వికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర

భావం: ఓ స్వామీ! బొందిలో ప్రాణమున్నంతకాలం వ్యామోహాలకు గురియై, సంపదలే శాశ్వతమనుకొని, అరిషడ్వర్గాదులకు దాసులై జ్ఞానార్జనకై గురువుని ఆశ్రయించరు. భక్తి జ్ఞాన వైరాగ్యాలుగల సాధువుల్ని చూస్తే తిట్టకుండ ఉండలేరు. ఈ దుష్టులకు నీ సంగతి ఏ మాత్రం తెలియదు.



49 -గోపరాజు నాగేశ్వరరావు

"అవును! చాంద్‌నీ చచ్చిపోయింది. తేనెపట్టు పట్టుకొని తేనెటీగల చేత కుట్టించుకొని మరీ ప్రాణాలు విడిచింది.."

"రాగ్యా ఏం చేస్తున్నాడు" అని అడిగాడు గరుడాచలం.

"దాని శవాన్ని అడవిలోనుంచి తెచ్చింది వాడే! మనం ఆడించిన నాటకం మొత్తం అడవిపుత్రులకు చెప్పాడు.."

"చెప్తే...?"

"కూతురు చావుకు కారణం కనకయ్య అని తెలిసి, నగ్గూరాం వేట కొడవలితో కనకయ్యని నరికి చంపాడు."

"మై గాడ్"అని అరిచాడు గరుడాచలం.

"అంతేకాదు! వాళ్ళంతా గుడారాలమీదికి దాడికి వస్తున్నారు. ఆవేశంగా ఉన్నారు... ఏంచేస్తారో."

అప్పుడు ఓ పోలీసు అధికారి లోపలికొచ్చాడు!

"ఎనీ ప్రాబ్లెమ్?" ఎమ్మెల్లే అడిగాడా అధికారిని

"అడవి పుత్రులొస్తున్నారు. పోలీస్ సిబ్బందిని అలెర్ట్‌చేశాం. మీరు కూడా కొంచెం జాగ్రత్తగా ఉంటే చాలు."

"తగినంత మంది పోలీసులున్నారా" గరుడాచలం అడిగాడు.

"అడిషనల్ ఫోర్స్ ఏ క్షణంలో ఐనా రావచ్చు! ఉన్నవాళ్ళతోనే అప్పటిదాకా లా అండ్ ఆర్డర్ కాపాడాలి."

"వాళ్ళెంతమందున్నారు."

"చాలామంది! అన్ని తండాలవాళ్ళూ ఒకటయ్యారు."

"వాళ్ళ దగ్గర తుపాకులున్నాయా"

"లేవు."

"ఐతే, అడిషనల్ ఫోర్సు కూడా అనవసరం! గాల్లోకి కాకండా నేరుగా వాళ్ళ గుండెలకు గురి చూసి కాల్పులు జరపండి! చస్తారు..చచ్చిన వాళ్ళు చావగా మిగిలినవాళ్ళు పారిపోతారు... మరో 'ఇంద్రవెల్లి' కావాలిది."

"సాధ్యంకాదు" అన్నాడు పోలీసు అధికారి.

"ఏం? ఎందుక్కాదూ?"

"వాళ్ళచేతుల్లో సాంప్రదాయక ఆయుధాలే వున్నా, చాలా ఎక్కువమంది ఉన్నారు, సంఖ్యలో!"

"ఐతే..?"

"అంతమంది ఉన్నప్పుడు ఫైర్ ఓపెన్ చేస్తే పరిస్థితి చెయ్యిదాటిపోతుంది."

ఎమ్మెల్లే అసహనానికి లోనయ్యాడు.

"నువ్వు పోలీసు అధికారివేనా?" అని అడిగాడు కోపంగా.

"సందేహం ఎందుకొచ్చింది" అధికారి అడిగాడు.

"నీ పిరికితనం చూసి."

"పోలీసు అధికారి ఎలా ఉండాలంటారూ."

"తుపాకితోనే రాజ్యాన్ని కాపాడాలి! వాళ్ళు మన గుడారాల మీద దాడికి తెగించారంటే ప్రభుత్వం మీ్మద యుద్ధం ప్రకటించినట్టే! క్షమించకూడదు."

"క్షమించటం కాదు సార్! బలం చాలాపోవటం."

"అదే పిరికితనం! వాళ్ళు మనమీద దాడి చెయ్యటం బడబాగ్ని మీద శలభాల దాడి లాంటిది! కాల్చి చంపండి. మాడి మసైపోతారు" అని పెద్దగా నవ్వి-

"అధికారాన్నీ, ఆధిపత్యాన్నీ అందించి నిలబెట్టేది ఆయుధం! ఆధునిక ఆయుధం లేని వాడు



యోధుడైనా పరాజితుడు కావాల్సిందే! అమాయకులైన అడవి పుత్రులకు భయపడితే ఎలా?

ఈటెలు బరిశెలు వేట కొడవళ్ళతో వాళ్ళు తుపాకుల నెంతవరకు ప్రతిఘటించగలరూ?

సందేహించొద్దు! కాల్పులు జరపండి. మిమ్మల్ని కాపాడే బాధ్యత నాది.. వంద ఎంక్వయిరీలు జరగనివ్వండి! మీడియా గొడవ చెయ్యనివ్వండి! ప్రపంచం వ్రేలెత్తి చూపనివ్వండి! అన్నిటినీ ఎదుర్కొని మిమ్మల్ని కాపాట్టమేకాదు, ప్రమోషన్లు ఇప్పించే బాధ్యతకూడా నాదే" అన్నాడు ఎమ్మెల్లే.

గరుడాచలానికి ధైర్యం చిక్కింది.

"యూ ఆర్ కరెక్ట్"అన్నాడు ఎమ్మెల్లేతో.

పోలీసు అధికారి బైటికి వెళ్ళిపోయాడు.

"ఇప్పుడేం జరుగుతుందో తెలుసా?"అని, గరుడాచలాన్ని ఎమ్మెల్లే అడిగాడు.

"చెప్పు" అన్నాడు గరుడాచలం.

"గుడారాల మీద దాడి అంటే అడవిపుత్రులు తమ గొయ్యి తాము త్రవ్వుకోవటమే.."

"ఎలా"

"ప్రభుత్వాన్ని కూల్చివేసే కుట్ర అనొచ్చు! బలమైన కేసులు పెట్టొచ్చు! చచ్చిన వాళ్ళు కాల్పుల్లో చస్తే, మిగిలినవాళ్ళు కోర్టుల చుట్టూ తిరగలేక చస్తారు."

"కుట్ర అంటే అదనపు లాభం ఏమిటి?"

"కుట్రకి కేంద్రమైన రెడ్డియానాయక్ తండా మీద దాడి జరుగుతుంది! సాయుధ పోలీసు బలగాలు కుట్రని భగ్నం చేస్తాయి.."

"అర్థమైంది" అన్నాడు నవ్వుతూ గరుడాచలం.

"అడవి భూముల్ని బహుళజాతి కంపెనీలకు అందించే ప్రయత్నంలో ఇలాంటి కుట్ర కేసులు బాగా ఉపయోగపడతాయి.

తండాల్లో పోలీసు దళాలు బీభత్సం సృష్టించొచ్చు! హక్కుల మాట ఎత్తితే కాల్చి చంపొచ్చు" అన్నాడు ఎమ్మెల్లే.

ఇందాక ఎమ్మెల్లేతో మాట్లాడిన పోలీసు అధికారి ఇంకా కొంతమంది అధికారులను వెంట పెట్టుకొని మళ్ళీ వొచ్చాడు.

"ఏమైంది" అని అడిగాడు ఎమ్మెల్లే.

"మా వాళ్ళకి కొన్ని సందేహాలున్నాయి."

"చెప్పండి."

"తుపాకుల కన్నా ప్రమాదకరమైన ఆయుధం వాళ్ళ దగ్గరుంది"

"ఏమిటది"

"తెగింపు"

"అంత తెగువరులా వాళ్ళు"

"మఫ్టీ పోలీసుల మధ్య వున్న కానిస్టేబులు కనకయ్యని నరికి చంపారంటే తెలియటం లేదూ."

బైట్నించి కోలాహలం వినిపించింది.

"జాగ్రత్త"అని మళ్ళీ ఒకసారి ఎమ్మెల్లేని, గరుడాచలాన్నీ హెచ్చరించి పోలీసు సిబ్బంది బైటికి వెళ్ళిపోయారు.

గరుడాచలం మనసు పరిపరి విధాలుగా పోతోన్నది! పోలీసు అధికారి అలా చెప్పకుండా ఉండుంటే అంత భయం అనిపించేది కాదేమో గానీ, అతను కనకయ్యని అడవి పుత్రులు నరికి చంపిన విషయాన్ని వర్ణించిమరీ చెప్పాడు!

గరుడాచలానికి లోలోపలే భయంగా వుంది!

అది గమనించాడు ఎమ్మెల్లే!

"భయపడుతున్నావు కదూ?"అని, గరుడాచలాన్ని అడిగాడు.

అతను మాట్లాడలేదు!

"అదీ చూద్దాం! కూతురు చనిపోయిందన్న కోపంలో అడవి పుత్రులతో కలిసి నగ్గూరాం కనకయ్యని చంపుంటాడే తప్ప, వాళ్ళంతా పోరట యోధులుకారు.. అమాయకులు.. మనమీద దాడి చేస్తారని నేను భావించటం లేదు" అన్నాడు ఎమ్మెల్లే.


"మరా కోలాహలం ఏమిటంటావూ"

"వెళ్ళి చూస్తాను!" అన్నాడు ఎమ్మెల్లే.

"నేను ఒంటరినౌతాను"అన్నాడు గరుడాచలం.

(ఇంకా ఉంది)

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
చంచలం అధికమవుతుంది. గృహంలో మార్పులు కోరుకుంటారు. స్వల్ప అనారోగ్య కారణంతో నిరుత్సాహంగా ఉంటారు. స్ర్తిలతో తగాదాలేర్పడే అవకాశాలుంటాయి. ప్రయత్న కార్యాలు ఫలిస్తాయి. కొన్ని పనులు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. ప్రయాణాలుంటాయి.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. కుటుంబంలో సుఖ సంతోషాలు అనుభవిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. ప్రయత్న కార్యాలన్నింటిలో విజయం సాధిస్తారు. శుభవార్తలు వింటారు. ధైర్యసాహసాలు ప్రదర్శిస్తారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
విదేశయాన ప్రయత్నం సులభంగా నెరవేరుతుంది. మనోవిచారాన్ని పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆకస్మిక ధననష్టం పట్ల జాగ్రత్త వహించుట మంచిది. నూతన కార్యాలు వాయిదా వేసుకుంటారు. ప్రయాణాలు ఎక్కువ చేస్తారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా వున్నాయి. వేళ ప్రకారం భుజించుటకు ప్రాధాన్యమిస్తారు. చంచలంవల్ల కొన్ని ఇబ్బందులెదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి. పిల్లలపట్ల ఏమాత్రం అశ్రద్ధ పనికిరాదు.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభమేర్పడుతుంది. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. పిల్లలకు సంతోషాన్ని కలుగజేస్తారు. కళాత్మక వస్తువులను సేకరిస్తారు. బంధు, మిత్రులను కలుస్తారు. క్రొత్త కార్యాలకు చక్కని రూపకల్పన చేస్తారు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
కొన్ని ముఖ్యమైన పనులు వాయిదా వేసుకుంటారు. మానసిక చంచలంతో ఇబ్బంది పడతారు. సోమరితనం ఆవహిస్తుంది. పిల్లలపట్ల మిక్కిలి జాగ్రత్త వహిస్తారు. కొన్ని మంచి అవకాశాలను కోల్పోతారు. ఆర్థిక పరిస్థితిలో మార్పులుండవు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
ధర్మకార్యాలు చేయుటయందు ఆసక్తి పెరుగుతుంది. దైవదర్శనం చేసుకుంటారు. కుటుంబ సౌఖ్యముంటుంది. మానసికానందాన్ని అనుభవిస్తారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ఆకస్మిక ధనలాభముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
నూతన వ్యక్తులను నమ్మి మోసపోరాదు. సంఘంలో అప్రతిష్ఠ రాకుండా జాగ్రత్తపడుట మంచిది. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవడంతో ఇబ్బంది పడతారు. దైవదర్శనానికి ప్రయత్నిస్తారు. ఋణ ప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి. సోదర వైరం కలిగే అవకాశముంటుంది.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
వ్యాపారంలో విశేష లాభాన్ని ఆర్జిస్తారు. మంచివారితో స్నేహం చేస్తారు. అంతటా సుఖమే లభిస్తుంది. ఆకస్మిక ధనలాభముంటుంది. బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఒక ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను కొనుగోలు చేస్తారు.


● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ప్రయత్నం మేరకు స్వల్పలాభముంటుంది. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. వ్యాపారరంగంలో లాభాలుంటాయి. ఋణప్రయత్నాలు చేయవలసి వస్తుంది. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
వ్యవసాయ రంగంలోనివారికి లాభదాయకంగా వుంటుంది. తొందరపాటువల్ల ప్రయత్న కార్యాలు చెడిపోతాయి. చెడును కోరేవారికి దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక భయము, ఆందోళన ఆవహిస్తాయి. శారీరకంగా బలహీనమేర్పడుతుంది.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
ఇతరులకు ఇబ్బందిని కలుగజేసే పనులను మానుకోవాల్సి వస్తుంది. వృత్తిలో ఇబ్బందుల అధిగమిస్తారు. మీరు చేసే ప్రతి పనిలో వ్యతిరేక ఫలితాలు కలుగకుండా జాగ్రత్త అవసరం. నూతన కార్యాలు ప్రారంభించకుండా ఉంటే మంచిది. ధైర్యసాహసాలతో నూతన కార్యాలు ప్రారంభిస్తారు.

మాటాట

నిర్వహణ: సుధామ 1859



అడ్డం	ఆధారాలు	నిలువు
1. నెలాఖరు		2. వివాహాది విధి విధానం
3. విషయం		3. శత్రుత్వం 5. హిందీ పెండ్లి
4. మందు		6. వెండితెర తెలుగు హాస్యనటుడు పరమ సంతోషం
8. చేతివస్త్రం		7. షిర్డీ సాయికి ప్రియమైన వారం!
9. ముఖము		10. మనస్సు, హృదయం
11. నమస్కారము		11. నూరు సంఖ్య
13. పిరికివాడు		12. శివభక్తుడు
14. పిల్లి		

అడ్డం	మాటాట-1858 సమాధానాలు		నిలువు
1. మహాత్మాగాంధీ	9. ఇచ్ఛ	2. జీవాత్మ	7. స్వచ్ఛత
5. వంక	10. దూత	3. భావం	10. దూప
7. స్వస్వ	12. తల	4. హ్రస్వ	11. అతల
8. విధి	14. సంకలనము	6. కవిత	13. లజ్జ

పాడుతా తీయగా ఒక ఖండకావ్యం

పఠనీయం

గ్రంథం పేరు -పాడుతా తీయగా
రచయిత్రి: డా॥ పర్యాద సరళ
పేజీలు: 60, ధర:రూ.50/-
ప్రతులకు:పర్యాద సరళ, 37-93/45/2, మధురానగర్, నేరేడ్‌మెట్ క్రాస్‌రోడ్డు, సికిందరాబాద్ మరియు అఖి భారతీయ సాహిత్య పరిషత్తు, సికింద్రాబాద్.

ఈటీవీలో 'పాడుతా తీయగా' అనే కార్యక్రమాన్ని చూచి పులకించి, స్పందించిన రచయిత్రి డా. పర్యాద సరళ గారు రచించిన కృతి ఈ ఖండ కావ్యం. ఇది ఒక విధంగా ఒక వినూత్న ప్రయోగం. 108 సీస పద్యాలతో 28 శీర్షికలుగా వున్న గ్రంథం.

దీనికి ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డిగారు 'పద్యంలో పరిమళ స్వరాలు' అని రాస్తూ ఇలా అన్నారు- 'పాడుతా తీయగా'తో పరవశించిపోయి గాన రస గాంధర్వంతో అద్వైతసిద్ధి పొంది, మందార మకరంద మాధుర్యాన్ని నింపి పాడుతా తీయగా సాగే భవ్యగతుల సాగె, ప్రభలు విరిసి, సాగి పరిమళించె, పాట పరిమళించె, సాగి పరవశించి, సాగి పల్లవించి' అనే వివిధ మకుటాలతో అందమైన 108 పద్యాల నందించారు.

సుప్రసిద్ధ చలనచిత్ర గాయకుడు శ్రీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈటీవీలో 'పాడుతా తీయగా' శీర్షిక క్రింద తాను పాడుతూ ఎంతోమంది చేత పాడించి గానంలోని లోపాలను వారికి సున్నితంగా చెబుతూ ఒక విజ్ఞాన బోధకంగా ఈ కార్యక్రమం సాగింది.

దీనిలో రచయిత్రి మందార మకరందాలులో ఇలా అంటారు 'రాగమ్మై, భావమ్మై రస గంగ తానమ్మై సాగెనే సంగీత రాగసుధలు', 'దివ్యనాదాల సుర గంగ భవ్యగతుల సాగివచ్చెను దివినుండి సంతస మున'-

'నాదబ్రహ్మం'లో 'ఓంకారమే తొల్త నొక రాగమై వెల్గె' అనే పద్యం మొదటిదే అయినా ఈ కావ్యానికి మకుటాయమానంగా ఉన్నది.

'తెలుగు వెలుగులు' (పద్యం 80)లో 'అమ్మ భాష మరచి ఆంగ్ల పోకడ నేర్చి భారతీయతలోని ప్రతిభ మరచి, అమ్మ నాన్నలె కాదు కమ్మనైన తెలుగు సంస్కృతినే విడనాడి జగతిలోన' అనే పద్యం నేటి యువతరానికి ఒక మేలుకొలుపులాగా ఉండి రచయిత్రి ఆవేదనను వ్యక్తం చేస్తున్నది.

ఈ గ్రంథానికి ముందుమాటలో 'ఆశీరాభినందనాలు' అందిస్తూ డా. సి.నారాయణరెడ్డిగారు ఇలా అన్నారు. "ఈ సీస పద్యాలలోని విశేషాలను వివరించాలనుకుంటే ప్రతి పద్యం నేనంటే నేనని ముందుకొస్తుంది. అందువల్ల ఒక్క వాక్యంలోనే 'భళిరా పర్యాద సరళమ్మ భళిరా! భళిరా' అన్నారు. ఇది అక్షరసత్యం. చివరి పద్యం జయనాదంలో (108) జయము పద్యమునకు అనేది మాబోంట్లకు ఎంతో మక్కువైనది. ఈ కావ్యాన్ని చదివితే రచయిత్రి యొక్క సంగీత సాహిత్యాలలోని ప్రతిభ, ఆవిడ చేసిన వర్ణనలు, వాటికి వారు పేరుపెట్టిన విధం అంటే ఆ పద్యాలను వివిధ పేర్లతో (శీర్షికలు) విశ్లేషించారు. ఇవన్నీ కడు రమ్యంగా ఉన్నాయి. పద్యం ఆమె చేతిలో హృద్యమై పాఠకులను పరవశింపచేస్తోంది. తెలుగు భాష అన్నా, తెలుగు పద్యమన్నా అభిమానం వున్న ప్రతివారు తప్పక చదవాల్సిన గ్రంథమిది. రచయిత్రిని అభినందిస్తూ ఆమె ప్రతిభను ఇంకా మంచి కావ్యాలతో ప్రకటీకృతం చేయగలరని నమ్ముతున్నాను.ఈ గ్రంథంలోని పద్యాలు 28 శీర్షికలుగా ఉండటం శ్రీవిద్యను సూచిస్తోంది.

-నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి

కాంతం కథలు

మునిమాణిక్యం నరసింహారావు

ఆ చతురకతే ఒకో సందర్భంలో ఓడిపోవాల్సొచ్చినా ఆ ఓటమిలోనే గెలుపు వెతుక్కుంటూంటాడు భర్త వెంకట్రావు. మొండివాదన కథలో బందరు నుండి ఒంగోలుకు పోయే దోవలో గుంటూరు తగలకపోయినా 'ఆ!తగలకేం లెండి. ఇష్టమైతే బాగానే తగులుతుంది' అని సూటీ పోటీ బాణమేసి మొత్తానికి వాళ్ల వాళ్లకి ఆవకాయ బుట్ట పంపగలిగే చతుర నారీమణి కాంతం. కన్నెకాంతం ప్రౌఢ కాంతంగా మారేసరికి ఐదుగురు పిల్లలు. అవధానులు అష్టావధానం చేసినట్టుగా కాపురం చేస్తుంది కాంతం. గృహ సామ్రాజ్ఞిత్వం ఆమె మాటల్లో, చేతల్లో స్పష్టంగా కనబడుతూంటుంది. మునిమాణిక్యంగారి మనసు అట్టడుగు పొరల్లోని కోరికమేమిటంటే అటువంటి ధీమతి శ్రీమతిగా దొరికితే ఆ భర్త బ్రతుకు ధన్యం అని.

అందుకే తెలిసీ ఓడిపోతూ ఆమెకు విజయాల నందిస్తూ సంసారం పునాదులను గట్టిపరచుకుంటూంటాడు. భార్యని లొంగదీసుకోవడమంటే భార్యకి పూర్తిగా లొంగిపోవడమేనని ఆయన తరచూ అందరితో జోక్ చేస్తూండేవారు. కాంతానికి భర్తా, పిల్లల ఎడమ ప్రేమానురాగాలుంటే భర్త వెంకట్రావుకి ఆమెపట్ల లోలోపల ఆరాధనాభావం కూడా ఉంటుంది. నీ వంట బాలేదు, నే బయట భోంచేస్తానన్న పెద్దమనిషి అయ్యరు సాంబారు ఎండు మెతుకులతో బుద్ధితెచ్చుకుని మళ్లీ ఇంటికొచ్చి కాంతం అమృతహస్తంతో వడ్డించిన భోజనాన్ని తృప్తిగా తిని ఆమె ఒడిలో విశ్రమిస్తాడు. దాంపత్య జీవనానికి కంచం, మంచం ఈ రెంటి మధ్యా సహకారం, సర్దుబాటు ఇవే మేలైన బాటలని మునిమాణిక్యం గారు కాంతం కథల్లో అన్యాపదేశంగా చాటుతుంటారు. అందుకే కాంతం ప్రతీ ఇంటికీ అంటే ప్రతీ తెలుగింటికీ ఆరాధనీయమైన ఇల్లాలుగా రూపొందింది. మునిమాణిక్యం గారి హాస్యం అరటిపండు తొక్కమీంచి జారిపడ్తే వచ్చే నవ్వు కాదు. పడ్డచోట సుఖం వెతుక్కునే హాస్యం. ప్రతీ బరువైన విషయాన్నీ తేలికగా తీసుకోవడంలోనే ఆయన కలం ద్వారా హాస్యం చిప్పిల్లుతుంది. అందుకే ఆయన హాస్యం నవ్వించదు- సున్నితంగా గిలిగింతలు పెడుతుంది. ఇంకో ముఖ్యమైన విషయం- ఆయన హాస్యానికి పునాది కరుణ. ఎదటి మనిషిని క్షమించి అర్థం చేసుకుని సహించే గుణం. కాంతం తోటి ఆయన సాంసారిక యాత్రలో చాలా దూరం వెళ్లేక తృప్తి చెందిన ఆయన కలం ఇక కాంతం గురించి చెప్పాల్సిందేమీ లేదని తీర్మానించుకుని కాంతం కథలకి ఫుల్‌స్టాప్ పెట్టడం కోసం కాంతం వృద్ధాప్యం, పిల్లలు గల తల్లి అన్న రెండు కథలు రాసి ఊరుకుంది. వీటితో కాంతం వృద్ధాప్యంలో కాంతం జీవనాన్ని గూర్చిన ప్రశంసాపూర్వక సమీక్ష ఉంటుంది. మొత్తానికి తనకి మంచి భాగస్వామినే లభించిందన్న తృప్తి వ్యక్తపరుస్తాడు వెంకట్రావు. పిల్లలు గల తల్లి కథలో కాంతం కాలధర్మం చెందుతుంది. ఆ కథలో కాంతం మరణశయ్యమీద వుండి గూడా తన ప్రాణాల్ని గురించి ఆలోచించకుండా 'డాక్టర్ గారికి కాఫీ ఇచ్చారా, మీరు భోంచేశారా, పిల్లలకి టిఫిన్ తెచ్చి పెట్టండి' అంటూ కర్తవ్యాలను గుర్తు చేస్తూ పిల్లలు పలకపుల్ల కోసం పోట్లాడుకుంటూంటే తగువుతీర్చి పక్కలో పడుకోబెట్టుకుని కథలు చెప్పి నిద్రపుచ్చుతుంది. భర్త కాళ్లు పిసుకుతుంటే 'నేనెంత పాపిష్టిదాన్ని' అని లబలబలాడిపోతుంది. మునిమాణిక్యంగారి కలం హాస్యంతోపాటు కరుణరసాన్ని కూడా చిందిందించగలదని చాటి చెప్పే కథ ఈ పిల్లలు గల తల్లి. ఈ కరుణ వారి జీవితంలో ఎంత ప్రాధాన్యత వహించకపోతే ఇద్దరూ ఒకరికొకరు సహకరించుకుంటూ ఆ సంసార రథాన్ని ఇంత ఆనందంగా ఇన్నేళ్లూ లాక్కొచ్చారూ అన్న ప్రశ్న పాఠకుల మనసులో వొదులుతాడు మునిమాణిక్యంగారు. కాంతం వృద్ధాప్యం, నిర్యాణం చాలామంది సామాన్యులకు మల్లే దయనీయం కాదు, పరిపూర్ణం. కాంతం తన జీవితాంతం ఒక డిక్టేటర్ కాదు ఎబుల్ అడ్మినిస్ట్రేటర్. సుఖ సంసారికే కాకుండా అర్థవంతమైన సంసారనికి కాంతం కారెక్టర్ ఒక ప్రతీక. అందుకే ఆమె తెలుగు నేలన ఇంటింటి వెలుగైంది. కాంతం కాలం చేశాక కలం సాగదనుకున్నాడు రచయిత. కానీ ఆమె మరణం భౌతికమే కానీ మనసికం కాదు గదా.

మునిమాణిక్యం గారి తలపుల్లో సదా మెదుల్తూనే ఉంటుంది కదా. అందులోనూ కాంతమే తానుగా తానే కాంతంగా మమేకమైన మునిమాణిక్యంగారు తెలుగు ప్రజల కోసం మళ్లీ కలం కాప్ తీసి ప్రయాణ సన్నాహం అనే కథ రాసి కాంతానికి మరణం లేదని నిరూపించారు. అందుకే పీఠికా సామ్రాట్ తల్లావఝుల శివశంకరశాస్త్రిగారు ఇలా అన్నారు- 'కాంతం కథలు రాస్తే మునిమాణిక్యమే రాయాలి, మునిమాణిక్యం రాస్తే కాంతం కథలే రాస్తాడు' అన్నారో సందర్భంలో. అందరూ సాధారణంగా వైవాహిక జీవితం కంటకప్రాయం అని అనుకుంటూంటారు. అటువంటిది సంసారిక జీవనవనంలో ముళ్లన్నీ ఏరిపారేసి కాంతం ద్వారా నవ్వుల పువ్వుల్ని మాత్రమే మనకందించి తెలుగు హృదయాల్లో శాశ్వత చిరునామా సంపాదించుకున్న మునిమాణిక్యం నిజంగా మన మాణిక్యమే.

- సమాప్తం

వినమరుగైన..

పిశుపాటి ఉమామహేశ్వరమ్

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన - శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

ధర్మభూమి

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మ పథములకెల్లన్

ఆంధ్రభూమి గురువారం, 31 జనవరి 2019

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ తెలుగు అనువాదం:
డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

205

నా మరణ శాసనంలో కూడ నీ దయయే ఇమిడి యుంటుంది. జ్ఞానప్రదాయకా! సృష్ట్యారంభంలో మానవులకు మార్గోపదేశకంగా బుద్ధిని చ్చావు. దానికి సహయోగంగా కంటికి సూర్యకాంతితో సమానమైన వేద విజ్ఞానాన్ని అందించావు. అది నాడు నేడురేపు మానవులకు కల్యాణదాయకమైయుంది. కాని జన్మమరణ చక్రభ్రమణ రూపమైన సంసారచక్రంలో నీవు ప్రదానం చేసిన మానవజన్మ స్వల్పకాలం కూడ మనలేక సుడులు తిరిగి పోతూ ఉంది. నీకు దూరంగా నాకు ఎన్నో జన్మలు నిరర్థకమైపోయాయి. నీ సేవకు వినియోగపడని జన్మ వ్యర్థమేకదా. కాని నేనిప్పుడు నీ సేవలో తరించే విధంగా ఈ జన్మలో జీవించాలనుకొంటున్నాను. 'ప్ర నో నయ ప్రతరం వస్యో అచ్ఛ' (ఋ.6-47-7) ''సార్థకమైన దీర్ఘ జీవనాన్ని అనుగ్రహించు''. 'ఇంద్ర మృళమహ్యం జీవాతు మిచ్ఛ' ''ఇంద్రా! నాకు ఆ విధంగానే జీవించాలని ఉంది.''. మృత్యువును నా నుండి దూరంగా తరిమికొట్టు. జీవించియుంటే కదా నేను నిన్ను పూజించేది. నిన్నారాధించనిదే నాకేమీ సిద్ధించదు. మహాజనులు నీవు జీవులకు అలభ్యుడవని చెబుతారు. కాని ఓ ప్రభూ! 'భవా సుపారో అతిపారయో నః' (ఋ.6-47-7) ''మాకు సన్నిహితుడవై మమ్ము తరింపచేయి'' సంసార సాగర తరంగ భ్రమణంలో మా బుద్ధిశక్తిని కోల్పోయి కార్యాకార్యాలను గ్రహించలేకుంది. అందుచేత 'చోదయ ధియం సో న ధారామ్' ''ఆయుధానికి పదును పెట్టినట్లుగా మా బుద్ధి వివేకంతో పదును అగునట్లు ప్రచోదనపరచుము.''

ఓ మహాదేవా! ఈ ప్రపంచాన్ని చూసాను. అంతా నిస్సారమే. నీవొక్కడవే సారస్వరూపుడవు. నిన్నే పొందేందుకు తగిన సద్బుద్ధినిమ్ము. యత్కించాహం త్వాయు రిదం వదామి తజ్జుషస్వ కృధి మా దేవవంతమ్ (ఋ.1-13202) ''ఓ దేవా! నేను చెప్పే మాటలను ప్రీతి పూర్వకంగా స్వీకరించు''ఇదే నా వినతి. బుద్ధిజాడ్యంవలన కలిగే 'ఆరే అస్మదమతిమ్' (ఋ.3-8-2) ''బుద్ధిహీనతను అనగా నాస్తికతను దూరంచేయి'' పరమేశ్వరా! 'ప్ర ణః పురఏతేవ పశ్య' (ఋ.6-47-7) ''ఒక అధినేత తన అనుయాయుల మీద చూపే దయవంటి దయను నీవు నాపై చూపు.'' నీ దయను పొందేందుకు తగిన ఉపాయమేదీ నాకు తోచడం లేదు. 'భవా సునీతి రుత వామనీతిః' (ఋ.6-47-7) ''నీవే నాకు శ్రేష్ఠమైన, సుందరమైన నీతివి''. నీ వెటు నడిపిస్తే అటు నడుస్తా. 'తస్య వయం సుమతౌ యజ్ఞియస్యాపి భద్రే సౌమనసే స్యామ' (ఋ.6-47-13) ''నీ పూజనీయమైన కృపామృత సద్బుద్ధియందు కల్యాణదాయకమైన నీ సౌహార్ద్రమందు మేము నిశ్చితంగా ఉందుముగాక!'' అందుకొఱకై ఓ ప్రభూ! 'ఇంద్ర మృళ। ధియో యో నః ప్రచోదయాత్' (శు.య.36-3) ''ఓ మహాదేవా! దయచూపు. మా బుద్ధులను ప్రచోదన చేయి.''

***

మేము శుభదాయకమైన సన్మార్గంలో నడుస్తాం అపి పంథామగన్మహి స్వస్తిగామనేహసమ్।

యేన విశ్వాః పరి ద్విషో వృణక్తి విందతే వసు॥

భావం:- ఏ మార్గాన నడిస్తే మానవుడు తనలోని ద్వేషభావాలను పూర్తిగా విడిచి శుభదాయకమైన ధనాన్ని పొందుతాడో అటువంటి సుఖకారకమైన, దోషరహితమైన మార్గాన్నే మేము అనుసరించి నడుస్తాం.

వివరణ:- ఓ మార్గబంధూ! సంసారారణ్యంలో ప్రవేశించి మేము సన్మార్గాన్నే మరచిపోయాం. ఎటు పోవాలో ఎటుపోరాదో దిక్కు తెలియటం లేదు. మార్గాన్ని సూచించేవాడు కూడ కానరావడం లేదు. ఇక మేమెవరిని అడిగి సన్మార్గాన్ని తెలుసుకోవాలి? తిరిగి తిరిగి దిక్కుతోచక తలపగిలి చచ్చిపోతున్నాం. ఎప్పటికైనా సంసారారణ్యాన్ని దాటి రావటానికి మార్గోపదేశకుడు నీవే కావాలి. ఎప్పుడో చిట్టచివరన నీవు చేయదలచిన పనిని ఇప్పుడే ఏల చేయరాదు? మావంటి సంసార సర్పదష్టుల ఎడల నీకు కృపయే ఉంటే ఇప్పుడే-

సం పూషన్ విదుషా నయ యో అంజసానుశాసతి।

య ఏవేద మితి బ్రవత్॥

''ఇతడే భగవంతుడు అని స్పష్టంగా నిర్దేశించి చెప్పగల విద్వాంసునితో కలయిక ఏర్పడునట్లు చేయి.'' విద్వాంసుడయినవాడే ఏ విషయాన్నైనా స్పష్టంగా అసందిగ్ధంగా బోధించగలడు. అతడి వలననే 'అపి పంథామగన్మహి స్వస్తిగామనేహసమ్' ''సౌకర్యవంతమైనది మరియు దోషరహితమైన సన్మార్గంలో నడువగలం'' అంతే కాదు. 'విశ్వాః పరి ద్విషో వృణకిత విందతే వసు'॥ ''మనిషి పూర్తిగా తన మనస్సులోని ద్వేషభావాలను విడిచి క్షేమకరమైన ఐశ్వర్యాన్ని ఏ మార్గంలో నడిచి పొందగలడో ఆ మార్గంలో నడువగలం.''

నే నెవరిని ద్వేషించను. నన్నెవరు కూడ ద్వేషించరాదు. అందరితో ప్రేమపూర్వకంగా ధర్మానుసారంగా నడుచుకొంటాను. అందరు కూడ నాతో అట్లే నడుచుకోవాలి. ఓ భగవాన్! ద్వేషమనే బందిపోటు నా మనస్సులోని ప్రేమ ధనాన్ని దోచుకొంటున్నాడు. అతడిని నా హృదయ మందిరంనుండి బయటకు గెంటివేయి. అప్పుడు నా మదిలోని ప్రేమ ధనాన్ని భద్రంగా ఉంచుకోగలను. దాని ద్వారా నీకు ప్రీతిపాత్రుడను కాగలను. దానివలన 'సర్వా ఆశా మమ మిత్రం భవంతు' (అథర్వ.వే.19-15-6) ''సమస్త దిక్కులు నాకు మిత్రులు కావాలి'' ఎక్కడ కూడ నాకు శత్రువులు గాని, ద్వేషించేవారు గాని ఉండకూడదు. అందరకు, అందరికంటే నేను ప్రేమపాత్రుడను కావాలి. అట్లగుట ద్వారా నేను 'తస్య తే శఙ్మన్నుపదద్యమానే రాయా మదేమ తన్వా తనా చ' ''కల్యాణదాయకుడైన నీవంటి కరుణాపూరితుడగు విద్వాంసుని సాహచర్యాన్ని పొంది ధన, ధాన్య, సంతాన సమృద్ధితో ఆనందంగా జీవిస్తాను'' ఓ మహాదేవా! నేనెన్నడూ ఎవరివలన కూడ 'న రిష్యేమ కదా చన' (ఋ.6-54-9) ''ఎక్కడా ఎప్పుడూ పీడింపబడకుండెదను గాక.''

ఇంకావుంది...

పవన శాల్మలీ సంవాదము

113 మహాభారతంలో ఉపాఖ్యానాలు



డాక్టర్ ముదిగొండ ఉమాదేవి

పూర్వము హిమవత్పర్వతం మీద అనేక మహావృక్షాలు ఉండేవి. వాటిలో ఒక పెద్ద శాల్మలీ వృక్షం కూడా ఉన్నది. అది శాఖోపశాఖలుగా విస్తరించి ఎన్నో పక్షులకు, చిలుకలకు, గోరింకలకు, ఆవాసంగా ఉన్నది. దాని నీడలో ఎంతోమంది బాటసారులు విశ్రాంతి తీసుకునేవారు. దానికి ఎన్నో పూలు పళ్ళూ ఉండేవి. ఆ చెట్టుకు పెద్దబోదె ఉండేది. దాన్ని చూసి ఒకసారి నారదుడు దాని దగ్గరకు వచ్చి ఇలా అన్నాడు. ''శాల్మలీ! నీవు ఎంత మనోహరంగా ఉన్నావు. నన్ను ఆశ్రయించుకుని ఎన్ని జీవరాశులు జీవిస్తున్నాయి. అనేకమైన పక్షులు, మృగాలు, ఏనుగులు నీ నీడలో ఎంతో సంతోషంగా ఉన్నాయి. నీ విశాలమైన కొమ్మలను వాయుదేవుడు నాశనం చేయలేకపోయాడు. అతనికి నీయందు ఎంత అభిమానం! అతను నీ పుత్రుడా? నీకు ఈ వనంలో ఇంతటి రక్షణ ఇస్తున్నాడే, అతను పెద్ద పెద్దవృక్షాలను, పర్వత శిఖరాలను కూడా ఊపివేస్తాడు కదా! అతను పాతాళంలోని సరస్సులను కూడా ఎండగడ్తాడు. అలాటిది నిన్ను ఏమీ చేయటం లేదంటే నీ యందు అతనికున్న మైత్రీ భావమే కారణము. అందువల్లనే నీవు అనేక కొమ్మలతో, పూలతో చూసే వాళ్ళ మనస్సులను ఆహ్లాదాన్ని కలిగిస్తున్నావు. ఎంతమంది నీడలో విశ్రాంతి తీసుకుంటున్నారు. నీ నివాసం తపస్వులతో, బ్రాహ్మణులతో, సన్యాసులతో, నానా జాతులమృగాలతో మేరు పర్వతం లాగ శోభిస్తోంది''.

నారదుడు ఆ వృక్షంతో ఇంకా ఇలా అన్నాడు. ''వాయుదేవుడు నిన్ను మిత్రునిలాగానో, బంధువులాగానో భావించి నీకింత రక్షణ కల్పిస్తున్నాడు. నీవు పదిసార్లు అతనితో ''నేను నీవాడను'' అని ఉంటావు. అందుకే అతను నిన్నింత భద్రంగా చూస్తున్నాడు. లేకపోతే ఈ పర్వతం మీద వాయువు వలన చెడిపోని, విరిగిపోని వృక్షం ఒక్కటైనా ఉందా? ఎన్నో కారణాలు లేకపోతే వాయువు నిన్నెందుకు ఇంతగా ఆదరణతో చూస్తాడు.''

అప్పుడు బూరుగు చెట్టు ఇలా అంది - ''మహర్షీ! వాయువు నాకు మిత్రుడు కాడు, బంధువు కాడు. అంతకంటే ఆప్తుడు కాడు. నా తేజస్సు, బలం వాయువు బలం కంటే ఎన్నో రెట్లు అధికం. వాయువు తన ప్రాణశక్తి నాలోని పదునెనిమిదవ అంశ కూడా లేదు. అతను తన బలంతో వృక్షాలను పర్వత శిఖరాలను కూలుస్తూ నా దగ్గరకు వచ్చినప్పుడు, నేను నా బలంతో అతని వేగాన్ని అడ్డుకుంటాను. ఈ విధంగా అతని వేగాన్ని నేను చాలా సార్లు అడ్డుకున్నాను. కనుక అతను నన్ను నాశనం చేయకుండా ఉంటున్నాడు. నేను అతనికి భయపడను.''

బూరుగు మాటలు విన్న నారదుడు ఇలా అన్నాడు - ''ఈ విషయంలో నీ దృష్టి విపరీతంగా ఉంది. వాయువుతో సమానమైన ప్రాణి ఈ లోకంలోనే లేదు. ఇంద్రుడు, వరుణుడు, యముడు, కుబేరుడు కూడా వాయుదేవునికి సమానులు కారు. అలాంటప్పుడు నీలాంటి మాములు వృక్షం సంగతి ఏమిటి? ఈ భూమి మీద ఏ ప్రాణి ఏ పని చేసినా దానికి కావలసిన శక్తిని, జీవనాన్ని ఇచ్చేవాడు వాయుదేవుడే కదా! ఆయన ప్రాణ రూపంలో మనలో సంచరిస్తున్నప్పుడే ప్రాణులు జీవించి ఉన్నట్లు లెక్క. ఆయన సరిగా పని చేయకపోతే మనలో వికృతమైన మార్పులు వస్తాయి. సర్వ ప్రాణులకు ఆధారుడైన వాయుదేవుని నీవు సరిగా గౌరవించటం లేదు. ఓ శాల్మలీ! నీకు పెద్ద శక్తి లేదు. ఏదో గొప్పలు చెప్తున్నావు. నీ ప్రలాపాల గురించి



నేను స్వయంగా వాయువుకు చెప్తాను. ఇక్కడ ఎన్నో చెట్లు ఉన్నాయి. తమిశ, మద్ది, దేవదారు, వెదురు చెట్లు ఉన్నాయి. కాని అవి ఎన్నడూ వాయువును కించపరచలేదు. వాటికి తమ బలం వాయుబలం రెండూ తెలుసు. అందువల్ల అవి వాయువు ఎదుట తలవంచి ఉంటాయి. నీవు మూర్ఖత్వంవల్ల వాయువు అనంత శక్తి తెలుసుకో లేకపోతున్నావు''.

ఇలా బూరుగు వృక్షంతో అని నారదుడు వాయుదేవుని దగ్గరకువెళ్ళి అతనితో శాల్మలి మాటలు ఇలా చెప్పాడు. ''హిమవత్పర్వతానికి చాలా పెద్ద పరివారం ఉంది. దాని నీడలో ఎన్నో పక్షులూ, మృగాలు, బాటసారులు తాపసులూ నిశ్చింతగా ఉంటున్నారు. కాని దానికి చాలా అహంకారం అది నిన్ను ఆక్షేపిస్తూ చాలా అవమానకరంగా మాట్లాడింది. సర్వప్రాణులలో నీవు శ్రేష్ఠుడవని నాకు తెలుసు.''

నారదుని మాటలు విన్న వాయువుకు ఆగ్రహం ముంచుకొచ్చింది. అతను బూరుగు చెట్టు దగ్గరకు వచ్చి కోపంతో ఇలా అన్నాడు - ''శాల్మలీ! నీవు నిందిస్తూ నన్ను అన్న అన్ని మాటలూ నారదుడు నాకు చెప్పాడు. నేనే వాయువును. నా శక్తిని నీకు చూపుతాను. పూర్వం బ్రహ్మదేవుడు ఒకసారి నీ నీడలో విశ్రమించాడు. అందువలన నీకు ఈ రక్షణ కలిగింది. అంతేకాని నీ స్వశక్తి వలన కాదు. ఇంక నన్ను అవమానించకుండా నా శక్తి నీకు చూపిస్తాను.''

వాయుదేవుని మాటలు విన్న శాల్మలీ వృక్షం సిగ్గుపడకుండా అతన్నే వెక్కిరిస్తూ ఇలా అంది. ''ఏదీ నీ బలం నా మీద చూపించు. ఎలాంటిదో చూస్తాను. నువ్వు ఎంత బలం కలవాడివైనా నన్ను ఏమీ చేయలేవు. నేను నీకంటే బలవంతుడను. బుద్ధి బలం ఉన్నవారికి ఇతరులను చూస్తే భయం ఎందుకు. గాలీ! నీ కోపం నన్ను ఏం చేయగలదు?'' బూరుగు మాటలువిన్న వాయువు ఇలా అన్నాడు ''సరే నా బలం ఎలాంటిదో రేపు వచ్చి చూపిస్తా'' ఇలా అని అతను వెళ్ళిపోయాడు.

ఇంతలో రాత్రి అయింది. బూరుగు, వాయువు వచ్చి తనను ఏమి చేస్తాడో ఊహించుకున్నది. ఇలా అనుకుంది ''అనవసరంగా గొప్పలకు పోయి వాయువుతో అన్నీ అబద్ధాలు చెప్పాను. నేను ఎప్పటికీ వాయుదేవునితో సమానం కాదు. అతను చాలా బలవంతుడు. నేను తక్కిన వృక్షాల కంటే కూడా బలహీనుడను. కాని నేను బుద్ధిలో బలవంతుడను. కనుక నా తెలివి తేటలతో ఎలాగో ఒకలాగ ఈ కష్టం నించి బయటపడతాను''.

బూరుగు చెట్టు ఇలా నిశ్చయించుకొని తన పెద్ద పెద్ద శాఖలను, చిన్న స్కంధాలను స్వయంగా నేలరాల్చుకొన్నది. ప్రొద్దునే వాయువు అక్కడికి వచ్చాడు. అతను కోపంగా దారిలో ఉన్న పెద్ద పెద్ద చెట్లను కూలుస్తూ వచ్చాడు.

మునుపు శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్న బూరుగు కొమ్మలు, రెమ్మలు, పూలు నేలరాల్చి నిస్తేజంగా కనిపించింది. అప్పుడు అతను ఇలా అన్నాడు.

''శాల్మలీ! నేను ఇదే పని చేయాలనుకున్నాను. ఇప్పుడు నువ్వే నీ కొమ్మలను రాల్చుకున్నావు. నీ అహంకారంతో నీవే ఆపద కొనితెచ్చుకున్నావు. నా బల పరాక్రమాలకు బలి అయ్యావు.'' వాయువు మాటలు విని బూరుగు సిగ్గుపడి పశ్చాత్తాప పడింది. మనం కూడా బలవంతులతో బూరుగు లాగ శతృత్వం వహిస్తే మనం కూడా అలాగే అవమానాన్ని ఎదుర్కోవాలి.

-ఇంకావుంది

పరమహంస బోధామృతము



179. నిండుకుండ తొణకదు. ఆత్మానుభవము గలవాని యొద్ద వాచాలత యుండదు. ఐనపక్షమున నారదాదుల మాట యేమందురా? నిజమే. నారదుడు, శుకదేవుడు మొదలగు కొందరు సమాధి స్థితిని బొందినవెనుక తమ మహోన్నత స్థితి నుండి ఎంతయో క్రిందికి దిగి కృపాపూర్ణులై లోకమునకు బోధించినారు.

180. ముక్తులు లోకమున నిరు తెఱగులుగా గాన్పించుచున్నారు. తత్త్వజ్ఞానము పొందిన వెనుక శాంతముగా, నిశ్శబ్దముగానుండి, ఇతరులను గూర్చిన మాటయే తలపెట్టక బ్రహ్మానందమును తామే అనుభవించువారు కొందరు. జ్ఞాన లాభమును పొంది, దానినంతయు తమ యొద్దనే దాచుకొనుటలో ఆనందమును గానక, పరులనుద్దేశించి, 'రండు మాతో తత్త్వానందము ననుభవింపుడు' అని యెలుగెత్తి చాటువారు మరికొందరు.

181. పువ్వు వికసించి దాని పరిమళము పిల్లగాడ్పులవలన నలుదిక్కులందును వ్యాపింపగనే తేనెటీగలు తమంత తామే దాని యొద్దకు వచ్చును. మిఠాయల నుంచిన తావునకు చీమలు తామంత తామే వచ్చి చేరును. తేనెటీగనుగాని చీమనుగాని ఎవ్వరును పిలువనక్కరలేదు. అదేవిధముగా నరుడు పవిత్ర హృదయుడై సిద్ధుడైనపుడు అతని సుశీల సౌరభము ఎల్లెడలను వ్యాపింప, ముముక్షువు లెల్లరును సహజముగనే వానిచే ఆకర్షింపబడుదురు. తన మాటలను వినువారి కోసము వెదకులాడుచు అతడు తిరుగాడనక్కరలేదు.

182. మిఠాయి, లేక పంచదార పడినచోటికి చీమలు తమంతతామే వచ్చి చేరును. పంచదార వగుటకై ప్రయత్నింపుము, అనగా ఆత్మజ్ఞానమాధుర్యమును పొంద యత్నింపుము; అవును భక్తులను చీమలు తమంతతామే నీ కడకు వచ్చును. భగవదాదేశము లేకుండ నీవు బోధలు చేయ మొదలిడితివా, ఆ బోధలు నిస్సారములై, కొఱగానివై యుండును, వానినెవ్వరును చెవియొగ్గి వినరు. భక్తిచే గాని, మఱియే యితర సాధనచేగాని ముందు భగవంతుని పొందవలయును. అపుడు వారి యాదేశమును పొంది యెల్లడలను బోధలను ఉపన్యాసములను జేయవచ్చును. ఇదియే భగవంతునివలన శక్తిసామర్థ్యములను బొందు మార్గము. అటు పిమ్మట ఆచార్యుని బాధ్యతలను వహించుటకును వానిని సక్రమముగా నిర్వహించుటకును ఎవ్వడైనను శక్తిమంతుడగును.

183. మంట మండునప్పుడు మిడుతలు వచ్చిపడును, అవి యెక్కడినుండి వచ్చునో యెవ్వరికిని తెలియదు. మిడుతల బిలుచుటకై నిప్పు పరుగిడునా? ముక్తపురుషులు చేయు బోధన ఇటువంటిది, పరులను బిలుచుటకై వారు తిరుగులాడరు. కాని వందల కొలది, వేల కొలది జనులు వారి బోధనలను బొందగోరుచు తమంతతామే వారికడకు వత్తురు- వారెక్కడినుండి వచ్చి చేరుదురో ఎవ్వరికిని తెలియదు.

184. నిజమైన బోధన యెట్టిదో తెలియునా? పరులకు బోధించుటకు బదులు నిరంతరము భగవానుని భజించునెడల అదియే కావలసినంత బోధన. సంసార బంధమునుండి విముక్తుడగుటకై ప్రయత్నించువాడెవడో వాడే నిజమైన బోధకుడు. నల్దిక్కులనుండియు వందలకొలది జనులు వచ్చి ముక్తునికడ చేరి వాని యుపదేశమును బొందుటకై ఆతురపడుచుందురు. గులాబి మొగ్గ వికసింపగనే తేనెటీగలు, పిలువకయే, కోరకయే నలువైపులనుండియు వచ్చి మూగును.

185. పెద్ద వర్తకుని ధాన్యపు గొట్టునుండి కొనవచ్చిన వారికి ధాన్యము నొకడు గొలుచుచునే యుండును. వాని వెనుకనుండి ధాన్యము తెంపులేకుండ వచ్చిపడుచుండును. చిల్లర వర్తకుని రాశియో, శీఘ్రముగా తఱిగిపోవును. అదే విధముగ భగవద్భక్తుని హృదయమున సత్సంకల్పములను సద్భావనములను నిరంతరము భగవంతుడే తోపించుచుండును. అందువలన నవనవోన్మేషమైన భావములకు వానికెన్నడును లోపము కలుగదు. కాని పుస్తకములను బట్టుకొని ప్రాకులాడు పండితులు చిల్లర వర్తకులను బోలుదురు. ఆశయములకును భావములకును వారి కెప్పటికప్పుడు లోపము గలుగుచునే యుండును.

186. పురమున వాయుదీపములు వివిధ భాగములలో ఒకచోట ఎక్కువగను మఱియొకచోట తక్కువగను ప్రకాశించుచుండును. కాని దీపమునకు ప్రాణమగు వాయువు మాత్రము అన్నిటికిని సామాన్యమగు ఒకే యంత్రమునుండి వచ్చును. వివిధ దేశ కాలములందలి నిజమైన మత బోధకులందఱును ఈ వాయుదీపములవంటివారు. నిరంతరము వీరియందుండి వెలువడు ఆత్మతేజమునకు ఆధారభూతుడైనవాడు ఒకే పరమేశ్వరుడు.

ఇంకావుంది...

శ్రీ రామకృష్ణ బోధామృతము - పరిశోధితమగు 112 మహోపదేశములుగల శ్రీరామకృష్ణ వాక్య రత్నాకరము - సంగ్రహ జీవిత సహితము - అనువాదకుడు: శ్రీ చిరంతనానందస్వామి

సత్వగుణమే గొప్పదా!?

హిందూమత ఔన్నత్యం 7



డా॥ గరికపాటి ఆనంద్
9966059562

ప్రశ్న: భగవంతుడు నాలుగు గుణాలను ఎందుకు సృష్టించాడు?

ప్రొఫెసర్ డి.నికొలస్ వివరణ ప్రకారం అర్జునుడు తమోగుణంతో ఉన్నాడు. ''చాతుర్వర్ణం' అనే పద్యాన్ని నాలుగు వర్గాల ప్రజలుగా లేక కులములుగా విభజించడాన్ని సూచిస్తోందని అనుకోవడం తప్పు. మనిషి యొక్క మనస్తత్వాన్ని మరియు క్రియలను అర్థం చేసుకోగలగడానికి మాత్రమే చెప్పబడింది. వేదాలలో ''కార్యసిద్ధి సత్వే భవతి'' అని ప్రపంచానికి మహత్తరమైన దివ్య సందేశంగా చెప్పబడింది. దీని వలన గ్రహించవలసి నదేమంటే ఒక కార్యాన్ని సాధించటానికి తనని తాను మనశ్శాంతితో సున్నితమైన మరియు నిరాడంబరమైన వైకరిలోకి తీసుకొని రావాలి. ఒక వ్యక్తిలో అధ్యయనం చేయగలిగిన గుణం తెచ్చేందుకు యిది ఎంతో అవసరం. పైన చెప్పిన వైదిక సూచన మార్గ దర్శకత్వంలో విస్తృత పరిధి కలిగి ఉంది. ముఖ్యమైన నిర్ణయాలు మనస్సు ప్రశాంత స్థితిలో ఉన్నప్పుడు చేయాలి. గుర్రపు స్వారీ లేక ఈత నేర్చుకోవడానికి మొదట గురువు నుంచి సూచనలు లేదా ఆజ్ఞలు గ్రహించడానికి నిన్ను నీవు సిద్ధం చేసుకోవాలి. ఆజ్ఞ అన్న పద ప్రయోగానికి కారణమేమిటంటే గురువు నీ ప్రాణరక్షకుడు కావచ్చు. ''ఆచార్య దేవోభవ'' అన్న వేద మంత్ర సారాంశాన్ని ఇది వివరిస్తుంది.

''సత్వ గుణం '' విద్యా విధాన వ్యవస్థలో మంచి విద్యార్థిగా తీర్చిదిద్దడానికి తోడ్పతుంది. అలాగని సమాజ సేవలో నీ ప్రతిభావిశేషాలు ఉపయోగించగలిగే నేర్పు నీకు వస్తుందని చెప్పలేము. ఉదాహరణకి ఈత నేర్చుకొనే తరగతిలో ఉన్నత స్థాయి విద్యార్థులలో ఒకరిగా కాకపోవచ్చు కానీ వారి యితర శక్తులు వల్ల మునిగేపోయేవారిని కాపాడడంలో విజయవంతం కావొచ్చు. తరగతిలో ఉన్నత స్థాయి విద్యార్థి అయినంత మాత్రాన వాస్తవ ప్రపంచంలో విజయం సాధిస్తారని అనుకోలేము. తాను పరిపూర్ణుడు కాదని భావించే అర్జునుడుని అధైర్యపడవద్దని కృష్ణభగవానుడు పైన తెలుసుకున్న సమాంతర ఆలోచన ద్వారా సూచిస్తాడు. అర్జునుడు తన గురువునే ఎదుర్కొనవలసిన పరిస్థితి అది. ఈ సూచనని తప్పుగా అర్థం చేసుకొని ప్రతి ఒక్కరు వారి యొక్క సంప్రదాయ వృత్తిని ఎట్టి పరిస్థితుల్లో విడువరాదని చెప్పినట్లుగా అనుకొనే అవకాశాలు ఉన్నాయి. ఆ సమయంలో ఉన్న సంక్షోభ స్థితి అటువంటిది.

ఎవరికైతే సైనిక నియమాలు పరిచయం లేదో వారి ప్రయోజన నిమిత్తమై ఈ క్రింది విషయాలు పస్తావించబడినవి. ఈ రోజు కూడా అనేక దేశాల్లో, అనుమతి లేకుండా లేదా పారిపోవడం లేదా యుద్ధభూమి నుండి తప్పించుకుపోవడం అనేది సైనిక నియమ ఉల్లంఘన క్రింద పరిగణించబడుతుంది. వారిని బంధించి సైనిక న్యాయ స్థానంలో విచారణ చేస్తారు. దోషిగా తేలితే, వారిని అగౌరవరీతిలో సాగనంపుతారు. ఈ అవాంఛనీయ పర్యవసానం కృష్ణభగవానుడు అర్జునునితో చెప్పినదానికి భిన్నమైనది కాదు.

హిందూ మతంలో వ్యక్తిగత సాధన ఎంత ముఖ్యమో సమాజ సేవ కూడా అంతే ప్రాధాన్యత వహిస్తుంది. పురుషార్థాలుగా చెప్పబడే ''ధర్మ'', ''అర్థ'', ''కామ'' మరియు ''మోక్ష'' వరుసక్రమం కూడా ఇదే సూచిస్తుంది. ఆస్తి చట్టాలు కూడా ఇదే భావాన్ని బలపరుస్తాయి. అర్జునుని ఈ స్థితికి తీసుకురావడానికి సులభంగా నేర్చుకొనే విధానంలో గుణ సిద్ధాంతాలని వివరించడం కన్నా శ్రీ కృష్ణునికి వేరే దారి లేదు. కానీ సత్వ గుణమే అన్ని గుణాల కన్నా గొప్పదని శ్రీ కృష్ణుడు చెప్పలేదు. అలాగైతే అర్జునునికి ఇచ్చిన సలహా ఈ ఉద్దేశ్యాన్ని వ్యతిరేకించినట్లు అవుతుంది. సంబంధిత పరిస్థితుల మీద ప్రధానంగా యిది ఆధారపడి ఉంది. ప్రొఫెసర్ డి.నికొలస్ యొక్క చక్కటి వివరణ ప్రకారం ''కర్తవ్య నిర్వహణ అనుభవాతీతమైన పరిస్థితిలో కాకుండా సంక్షోభంలో ఉన్నప్పుడు మన స్థితిగతుల గురించి ఆందోళన పడుతున్నప్పటికీ ధర్మాచరణ దృక్పథంతో నిర్ణయం తీసుకొనవలసిన స్పష్టమైన పరిస్థితిలోనే జరుగుతుంది.''

ఉదాహరణకి ఒక దొంగతనం నీ సమక్షంలో జరుగుతున్నప్పుడు లేక మీఎరు సాక్షిఅయినప్పుడు ''సత్వ గుణం'' పాటించడం గీత బోధనలను తప్పుగా అర్థం చేసుకున్నట్టే. ఇటువంటి పరిస్థితుల్లో రజోగుణంతో ప్రవర్తించాలి. ఒక గురువు తన శిష్యులకు క్రమశిక్షణ నేర్పే సమయంలో కూడా ఇదే వర్తిస్తుంది. తమోగుణం చెడ్డదని భగవద్గీత చెప్పలేదు. అన్ని జీవరాశులు''నిద్ర''లో ఎక్కువ సమయం గడుపుతారు. కనుక దీనిని తమోగుణం లేదా జడత్వంగా వర్గీకరించవచ్చు. శరీరం మరియు మనసు ప్రశాంతంగా ఉండే స్థితే నిజమైన ''సుఖ'' స్థితి. ''సుఖం'' మరియు ''ప్రశాంతత'' అనే పదాల అర్థం తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. ఎందుకంటే తరువాత విభాగాలలో ప్రస్తుతించబోయే వేదాశీస్సులలో ఈ పదాలు ఉంటాయి. సుఖానికి, సంతోషానికి కారణాలు భిన్నంగా ఉంటాయి. సంతోషాన్ని తాత్కాలిక ఆనందంగా లేక పరిహాసంగా కూడా పరిగణిస్తారు ఎందుకంటే దీని కోసం కర్మ చేయడం అవసరం. సంస్కృత పదమైన ''సుఖం''కి ఆంగ్లభాష పదమైన ''హాపీనెస్'' అర్థం చాలా దగ్గరగా ఉంటుంది. తరచుగా అది వాడకంలో ఉంది కానీ అందులో దాని సంపూర్ణ అర్థాన్ని అంత విస్తృతంగా వివరించబడలేదు. ఇక్కడ ప్రధానంగా గమనించాల్సినది ఏమిటంటే తమోగుణంలో ఉన్న వ్యక్తి ఆ స్థితి నుంచిబయటపడలేదు లేక బయటపడదల్చుకోలేదు అని చెప్పడంగానీ లేక అనుకోవడంగానీ తప్పు. ఈ గుణాలన్నీ తెల్లని వెలుగు నుంచి వెలువడిన రంగుల వంటివి. రంగుల మోతాదు శాతం మార్పుతో ఆయా రంగుల సమ్మేళనము జరిగి వేరు వేరు రంగులుగా కనిపిస్తాయి.

అందుకే వాటిని శ్రీకృష్ణుడు వర్ణాలుగా చెప్పాడు. కాలానుగుణంగా ప్రతి ఒక్కరూ ఈ గుణాలలో లేదా స్థితులలో తాత్కాలిక దశగా వివిధ కాలపరిమితులలో జీవితాన్ని గడుపుతారు. సుషుప్తా వస్థలో ఉన్న వారు లేక శరీరం చలన రహితంగా ఉన్న తపోధనులు ఆనంద స్థితిలో ఉంటారు. కొన్ని సమయాల్లో మానవుల మనస్సు సముద్రంతో పోల్చబడింది. నీటి ఉపరితలం నిరంతరంగా చలనంలో ఉండటానికి ఎన్నో కారణాలు ఉంటాయి. చాలా సమయాల్లో శీతలంగా అనిపించే నీరు వేసవిలో గాలివానలకి, తుఫానులకి మూలకారణం అవుతుంది. అదే విధంగా మానవుల మనస్సు వర్ణనాతీతమైన నిరంతర రూపాంతర చర్యలో ఉంటుంది.

ఇంకావుంది...

సుందరకాండ

సందిగ్ధమైన స్మృతిలా ఉన్నదట. స్మృతులంటే మన్వాదిస్మృతులు. అందువలన నిపతితమైన బుద్ధిలా ఉన్నదట. ఆ తల్లి స్మృతిరూపమే. కాని యీ రూపంలో ఆ లక్షణం కప్పబడింది. శ్రద్ధ అంటే అస్తిక్యబుద్ధి. అది విహతమైంది. అవిశ్వాస బహుళమైన శ్రద్ధ వలన ఆశ ప్రతిహతమవుతున్నది. ఆమె శ్రద్ధా స్వరూపం. కాని యీ పొర అడ్డుపడ్డది.

సిద్ధికి విఘ్నమేర్పడింది. దానివలన బుద్ధి కలుషమైంది. ఆ తల్లి బుద్ధి స్వరూపము. అది రావణ స్పర్శవలన కలుషమైంది. అసత్యవాదంవలన పతితమైన కీర్తిలా వుంది. ఆమె కీర్తి స్వరూపం అది రామ వియోగాన్ని పొందింది. దానికి కారణమైన వాడు పతితమవుతాడు.

అమ్నాయముల యోగం లేని శిథిలవిద్యలా ఉంది. ఆ తల్లి విద్యా స్వరూపము. ఆమ్నాయాలంటే శ్రీవిద్యా సంప్రదాయంలోని షడామ్నాయాలు. పూర్వ దక్షిణ పశ్చిమ ఉత్తర ఊర్ధ్వ, అనుత్తర అని ఆరు. ఇవి ఉపాస్య దేవతను బట్టి భిన్నంగా ఉంటాయి. శ్యామలామ్నాయము. లలితామ్నాయము మొదలైన రీతి. ఈ అమ్నాయషట్కంతో యోగం లేకపోతే ఆ శ్రీవిద్య శిథిలమైనట్లుంటుంది. విద్య క్షీణించదు. విద్య ఆ పురుషుని యందు అదృశ్యమవుతూ వానిని క్షీణింపజేస్తుంది.

బుద్ధిమంతుడయిన వాడు తనయందు విద్య క్షీణిస్తోందని అది అదృశ్యం కాకముందే తెలిసికొని దానిని ఉపాసిస్తాడు.

అందుకే స్వామికి ఆ తల్లి అలా కనబడి తనను హెచ్చరించినట్లయింది. బుద్ధిలేని రావణునికి ఆ విద్యా తత్వం గోచరించదు. అందుకే ఆమె యెప్పుడు వానికలా కన్పించలేదు. సరే, ఇన్నివిధాలుగా ఆలోచించిన తరువాత తిరిగి స్వామి ఆమె సీతే అయి ఉంటుందని కారణాల్ని ఉపపాదించుకొంటూ ఆలోచిస్తున్నాడట. ఇక్కడ బాహ్యంగా ఆలోచిస్తే- ఆమె సీత కావడానికి కారణాల్ని ఊహిస్తాడని తెలిసింది. కానీ- ఆంతర ధర్మంగా ఆలోచిస్తే ఇంతవరకు తాను దర్శించిన దానివలన ఆమె సీత అని తేలిందట. అంటే- భూమినుండి ఉత్థిత అయిన సీతగా తేలిందట.

ఇప్పుడు తనకు ఆ భూమియందే- అనగా మూలాధారమందే మగ్నమైన విద్యగా కనబడుతోంది. మూలాధారమందు కప్పబడి ఉండే కుండలినీ శక్తి ఈనాటి సీతలాగే ఉంటుంది. అది ఉత్థితమయితే ఆంజనేయస్వామి వంటి ఉపాసకునకు బ్రహ్మత్వమీయగలిగి ఉంటుంది.

స్వామి సీతను చూసేడు.

అస్యా దేవ్యా యధా రూపమంగ ప్రత్యంగ సౌష్ఠవం
రామస్య చ యధారూపం తస్యే యమసితేక్షణ

ఆ తల్లి అంగ ప్రత్యంగ రూపమూ రామరూపం ఎలా ఉందో అలాగే ఉందట విశేషించి ఈ నేత్రములయందు మాతృత్వమున్నది.

అటువంటి సీతా హృదయంలో స్వామికి రామచంద్రమూర్తి దర్శనమిస్తున్నాడు. తాను బయలుదేరే ముందు స్వామి రామహృదయంలో సీతాదర్శనం చేసికొని బయలుదేరేడు. ఆ విషయాన్ని అక్కడ చెప్పరు. మహర్షి ఇక్కడ చెబుతున్నారు. ఏమని-

అస్యాదేవ్యా మనస్తస్మింస్తస్య చా స్యాం ప్రతిష్ఠితమ్.

ఇది దేవియందు దేవునియందు ఉపాసకుడు పొందే అభేద దృష్టిజ ఆ దృష్టి యీవేళ స్వామికి కలిగింది. ఈ దృష్టి కలవారికే సృష్టి రహస్యం తెలుస్తుంది. ఆ రహస్యం తెలిసిన వానికే సృష్టి చేయగలిగే శక్తి కలుగుతుంది. అది ఆంజనేయ స్వామికి భవిష్యత్తులో కలుగుతుంది.

దుష్కరం కృతవాన్ రామో హీనో యదనయాప్రభుః
ధారయత్యాత్మనోదేహం నశోకే నావ సీదతి.
దుష్కరం కృతవాన్ రామో య ఇమాం మత్తకాశినీం
సీతాం వినా మహాబాహుః ముహూర్తమపి జీవతి.

సీతా వియోగంవలన రామచంద్రమూర్తి శోకాన్ని కాని కార్యాన్ని కాని యెఱుగక జీవించటం

సీతా విహీనంగా ఒక్క క్షణం కూడా జీవించి ఉండటం- ఇవి రెండునూ దుష్కరమైన కర్మలు. వాటిని రామచంద్రమూర్తి చేస్తున్నాడు. ఆహా! ఎంత కష్టం.

ఇంకావుంది...

ఆంధ్రభూమి
చిత్రభూమి
జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!
గురువారం 31, జనవరి 2019

మళ్లీ మళ్లీ చూసేలా..

అనురాగ్ కొణిదెన హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'మళ్లీ మళ్లీ చూశా'. క్రిషి క్రియేషన్స్ పతాకంపై సాయిదేవ రామన్ దర్శకత్వంలో కొణిదెన కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. శ్వేత అవస్తి, కైరవి తక్కర్ హీరోయిన్లు. శ్రవణ్ భరద్వాజ్ సంగీతాన్ని అందించిన చిత్రంలోని 'చినుకే నాకె చూపె' పాటను ఆదిత్య మ్యూజిక్ ద్వారా సెన్సేషనల్ డైరెక్టర్ వినాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వినాయక్ మాట్లాడుతూ 'మళ్ళీమళ్లీ చూశా' పాట విన సొంపుగా ఉంది. ట్రైలర్ అందరికీ చేరువైంది. హీరో లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంది. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ అన్నారు. దర్శకుడు సాయిదేవ రామన్ మాట్లాడుతూ ప్రేమకు ప్రకృతి తోడైతే ఎంతందంగా ఉంటుందన్న కాన్సెప్ట్‌తో తీసిన సినిమా 'మళ్లీమళ్లీ చూశా'. శ్రవణ్ సంగీతం, సతీష్ ముత్యాల సినిమాటోగ్రఫీ ఎసెట్స్. నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. హీరో అనురాగ్ మాట్లాడుతూ తెలుగులో చాలారోజుల తర్వాత వస్తోన్న ఆహ్లాదకరమైన లవ్ ట్రాక్. మళ్లీ మళ్లీ చూడాలనిపించే ప్రేమకథ అన్నారు.





యమ్ 6'టీమ్!

విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ పతాకంపై జైరామ్‌వర్మ దర్శకత్వంలో విశ్వనాథ్ తన్నీరు నిర్మిస్తున్న హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ 'యమ్ 6'. ఫిబ్రవరి రెండోవారంలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం ద్వారా ధ్రువ హీరోగా పరిచయమవుతున్నాడు. చిత్ర విశేషాలను ధ్రువ వెల్లడిస్తూ, 'యమ్ 6' వంటి మంచి సినిమా ద్వారా హీరోగా పరిచయమవ్వడం ఆనందంగా ఉంది. నటుడిగా నాకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవాలన్నది చిరకాల కోరిక. నిర్మాత విశ్వనాథ్ అంతా కొత్తవారితో సినిమా నిర్మించబోతున్నారని తెలిసి కలిశాను. చిన్న సస్పెన్స్ తరువాత నన్ను హీరోగా ఎంపిక చేసుకున్నారు. వెంటనే షూటింగ్ మొదలైపోయింది. కొత్త హీరోలాకాకుండా సొంత తమ్ముడిలా చూసుకున్నారు. డైరెక్టర్ జైరామ్‌వర్మ అన్ని విషయాల్లో సహకారం అందించారు. ఆయన ప్రోత్సాహంతోనే ఇబ్బందిలేకుండా నటించా. మంచి కథ, కథనాలతో వర్మ తెరకెక్కించిన చిత్రం అద్భుతం. అన్నివర్గాల ప్రేక్షకులకూ నచ్చుతుందన్న నమ్మకం ఉంది. మొదటి సినిమాలోనే వైవిధ్యమైన పాత్ర పోషించటం పట్ల హ్యాపీగా ఉంది. ఇకపైనా వైవిధ్యమైన కథలతో సినిమాలు చేసి, మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఉంది. నేను నటించిన మొదటి సినిమా ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు వివి వినాయక్ విడుదల చేయడం మరచిపోలేని అనుభూతి. 'యమ్6' చిత్రాన్ని, హీరోగా నన్నూ ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నా అన్నారు.



వైట్లతో అఖిల్?

అక్కినేని అఖిల్ మూడో ప్రయత్నంలోనూ ఆశించిన సక్సెస్ అందుకోలేక పోయాడు. మొదటి సినిమాతో డిజాస్టర్ అందుకున్న అఖిల్, రెండో చిత్రం 'హలో'తో ఫర్వాలేదనిపించాడు. కానీ కెరీర్‌కు మాత్రం హలో ఉపయోగపడలేదు. ఇక ముచ్చటగా మూడో చిత్రం మిస్టర్ మజ్ను యావరేజ్ దగ్గర ఆగిపోయింది. ఇప్పుడు అఖిల్ నాల్గవ సినిమా ఇండస్ట్రీలోనే హాట్ టాపిక్ అయ్యింది. ఇటీవల వరుస పరాజయాలతో బాగా వెనకపడిన డైరెక్టర్ శ్రీను వైట్ల, అఖిల్ కోసం స్టోరీని సిద్ధం చేస్తున్నాడట. అంతేకాదు ఇటీవల శ్రీను వైట్ల, అఖిల్‌తో సినిమా ఉంటుందని కూడా చెప్పాడు. దాంతో అఖిల్ తన తదుపరి చిత్రాన్ని శ్రీను వైట్ల దర్శకత్వంలో చేయనున్నాడని వార్తలు వస్తున్నాయి. చిత్రం స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనుందట. మరి శ్రీనువైట్లతో సినిమాకి నాగార్జున ఒప్పుకుంటాడో? లేదో? చూడాలి.

'4 లెటర్స్'లో ప్రేమ పాట



ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరో హీరోయిన్లుగా ఆర్ రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మిస్తున్న చిత్రం 4 లెటర్స్. ఆడియోను హైదరాబాద్‌లో విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ సీనియర్ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి పాటల సీడీని విడుదల చేసారు. కార్యక్రమంలో నిర్మాత అచ్చిరెడ్డి, జెమినీ కిరణ్, శివాజీరాజా, నటుడు సురేష్‌తోపాటు చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ చక్కని టైటిల్ అని, ప్రేమ అనకుండా 4 లెటర్స్ అని కొత్తగా పెట్టారన్నారు. పాటలు బాగున్నాయ్. తప్పకుండా సినిమా పరిశ్రమకు ఇప్పుడు కొత్త టాలెంట్ అవసరం. ఈమధ్య భిన్నమైన సినిమాలు సూపర్‌హిట్స్ అందుకుంటున్నాయి. అలాగే సినిమా హిట్టవ్వాలని కోరుకుంటున్నాను అన్నారు. అచ్చిరెడ్డి మాట్లాడుతూ ఈ సినిమాతో తమ అబ్బాయిని హీరోగా చూడాలనుకున్న ఉదయ్ కల నెరవేరుతుంది. తప్పకుండా సినిమా మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నానన్నారు. శివాజీరాజా మాట్లాడుతూ సినిమా తీయాలన్న ఆశ కలిగిందంటే అది ఎక్కడున్నా వదిలిపెట్టదు, సినిమా చేసేలా చేస్తుంది.. అలాగే మేమూ ఎక్కడెక్కడినుండో వచ్చాము. నిర్మాత ఉదయ్ కూడా సినిమామీద ప్యాషన్‌తో వచ్చాడు. ఇలాంటి నిర్మాతల వల్లే ఈరోజు సినిమా పరిశ్రమలోని 24 క్రాఫ్ట్ సంతోషంగా ఉంది. ఇలాంటి నిర్మాతలు రావాలి. తప్పకుండా 4లెటర్స్ మంచి విజయం అందుకోవాలని కోరుకుంటున్నా అన్నారు. నిర్మాత ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ 'మా బ్యానర్‌లో నిర్మిస్తోన్న తొలి చిత్రం '4 లెటర్స్'. ఈ చిత్రం టీజర్‌ను రాఘవేంద్రరావు విడుదల చేయటం, అది మంచి క్రేజ్ తెచ్చుకోవడం ఆనందంగా ఉంది. ఈ చిత్రం ద్వారా ఈశ్వర్‌ను హీరోగా పరిచయం చేస్తున్నాం. కమర్షియల్ హంగులతో యూత్‌సహా అన్నీ వర్గాలను ఆకట్టుకునే ఎంటర్‌టైనర్‌గా సినిమా రూపొందించాం. ఫిబ్రవరి 2వ వారంలో చిత్రం విడుదల చేస్తాం' అన్నారు. దర్శకుడు ఆర్ రఘురాజ్ మాట్లాడుతూ 'కలుసుకోవాలని' తర్వాత తెలుగులో నేను డైరెక్ట్‌చేసిన మూవీ 4 లెటర్స్. ప్రేమ, పెళ్లి విషయాల్లో నేటితరం యువత ఆలోచనలు, అభిప్రాయాలు, వాస్తవాలు ఏమిటన్నది చిత్రీకరించటం జరిగింది. కథ, కథనాలు ఆలోచన రేకెత్తించేలా ఉంటాయన్నారు.



అక్కడున్నది ఎవడు?

శివ కంఠంనేని టైటిల్ పాత్రగా రూపొందిన చిత్రం -అక్కడొకడుంటాడు. శ్రీపాద్ విశ్వక్ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో హీరో హీరోయిన్లుగా రామ్‌కార్తీక్, శివహరీష్, అలేఖ్య, రసజ్ఞదీపిక నటిస్తుంటే, ఇతర ప్రధాన పాత్రల్లో అల్లరి రవిబాబు, వినోద్‌కుమార్, ఇంద్రజ కనిపించనున్నారు. లైట్‌హౌస్ సినీమ్యాజిక్ బ్యానర్‌పై కె శివశంకర రావు, రావుల వెంకటేశ్వర రావు నిర్మించిన చిత్రం ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. సీనియర్ నటుడు, దర్శకుడు వల్లభనేని జనార్దన్ ఆడియోను ఆవిష్కరించి తొలి సీడీని నిర్మాత సి కల్యాణ్‌కు అందించారు. సి కల్యాణ్ మాట్లాడుతూ వారంవారం పదివరకూ చిన్న సినిమాలు వస్తున్నా, వాటిలో ఒకటి కాకుండా ప్రత్యేక సినిమాగా ప్రేక్షకులను అలరిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అర్ధరాత్రి కార్లలో తిరిగే మందుబాబుల ఆగడాల వల్ల జరిగే అనర్థాలను చిత్రంలో చూపించారన్నారు. సినిమా చూస్తున్నంతసేపూ తరువాత ఏంటి? అన్న ఆసక్తి కలిగేలా ఉందన్నారు. వల్లభనేని జనార్దన్ మాట్లాడుతూ చిత్ర నిర్మాతలతో తనకు 30ఏళ్ల అనుబంధం ఉందని, మంచి అభిరుచితో విభిన్న చిత్రం నిర్మించటం అభినందనీయమన్నారు. టైటిల్ పాత్రధారి శివ కంఠంనేని మాట్లాడుతూ ఎవడు ఎక్కడుంటాడు? ఎందుకుంటాడు? అన్న ప్రశ్నలకు జవాబులు అక్కడొకడుంటాడు? చిత్రంలోనే తెలుస్తాయన్నారు. నటుడు అల్లరి రవిబాబు మాట్లాడుతూ ఫ్యాషన్‌తో చిత్ర నిర్మాతలు సినీరంగంలోకి వచ్చారని, నిర్మాణంలో వారు పాటించిన క్రమశిక్షణ, అంకితభావం తనకెంతో ముచ్చట కలిగించిందన్నారు. నిర్మాత రావుల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ పైరసీకి వెళ్లకుండా ప్రేక్షకులు కేవలం థియేటర్‌లో చూస్తేనే చిత్రంలోని సాంకేతిక నైపుణ్యం తెలుస్తుందన్నారు. దర్శకుడు శ్రీపాద్ విశ్వక్ మాట్లాడుతూ కాన్సెప్ట్ ఓరియంటెడ్‌తో సస్పెన్స్ థ్రిల్లర్‌గా సినిమా ఆద్యంతం అలరిస్తుందన్నారు.



బొగ్గు కార్మికుడిగా..

బ్యాక్ టు బ్యాక్ హిట్లుకొట్టిన సెన్సేషనల్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం రెండు చిత్రాల్లో నటిస్తున్నాడు. అందులో ఒకటి భరత్ కమ్మ దర్శకత్వంలో 'డియర్ కామ్రేడ్' అయితే, మరొకటి క్రాంతిమాధవ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం. ఇంకా టైటిల్ ఖరారుకాని ఈ సినిమా ప్రస్తుతం కొత్తగూడెంలో షూటింగ్ జరుపుకుంటుంది. చిత్రంలో విజయ్ సింగరేణి కార్మికుడిగా నటిస్తున్నారట. ప్రస్తుతం వాటికి సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. అయితే ఈ పాత్ర సినిమాలో ఒక భాగం మాత్రమేనని టాక్. క్లాస్, మాస్ అన్ని అంశాలతో సినిమాను రూపొందిస్తున్నారు దర్శకుడు. కెఎస్ రామారావు నిర్మిస్తున్న చిత్రంలో రాశిఖన్నా, ఐశ్వర్యరాజేష్ హీరోయిన్లు.



ఈ ఫేజ్ హ్యాపీ..

సవ్యసాచితో టాలీవుడ్‌కు పరిచయమై, 'మిస్టర్ మజ్ను'తో సత్తా చూపించింది నిధి అగర్వాల్. చాలెంజింగ్ పాత్రల్లో నటించాలని ఉందంటున్న నిధి, 'మిస్టర్ మజ్ను' రెస్పాన్స్‌తో హ్యాపీగా ఉందట. చైతన్య, అఖిల్‌తో వరుస సినిమాలు చేయడం లక్కీగా ఫీలవుతున్నానంటోంది. మజ్నులోని ఏమోషనల్ సీన్స్‌లో నా పెర్ఫార్మెన్స్‌కి మంచి అప్లాజ్ వస్తుందని, పెర్ఫార్మెన్స్ చూశాక పేరెంట్స్ అయితే నువ్వింత బాగా యాక్ట్‌చేస్తావా...? అసలు ఎక్స్‌పెక్ట్ చేయలేదంటూ ప్రశంసించారని చెబుతోంది. నేను పుట్టింది హైదరాబాద్‌లోనే కాబట్టి తెలుగు మాట్లాడటం అంత కష్టంకాదు. ఫస్ట్ సినిమా చేస్తున్నప్పుడు కూడా ఏదో కొత్తగా వింటున్న లాంగ్వేజ్‌లా అనిపించలేదు. ఇక నా ఫేస్ కొంచెం ఇన్నోసెంట్, కాబట్టి దానికి తగ్గట్టే రోల్స్ వస్తున్నాయేమో అనిపిస్తుంది. ఈ ఫేజ్ కూడా చాలా ఎంజాయ్ చేస్తున్నా. డ్యాన్స్ ఓరియంటెడ్ సినిమా చేయాలని ఉంది. ఇదే నా కెరియర్ బిగినింగ్ కాబట్టి ఇంకా నేను నాకు నచ్చిన రోల్సే చేసే స్టేజ్‌కి వచ్చానని అనుకోవట్లేదు. కానీ 'ఇస్మార్ట్ శంకర్' తరవాత, డిఫరెంట్ రోల్స్‌పై దృష్టిపెడతా. పూరి జగన్నాథ్ డైరెక్షన్‌లో నటిస్తున్నందుకు చాలా హ్యాపీ. ఆ రోల్ గురించి ఇప్పుడే చెప్పను. కానీ చాలా కొత్త క్యారెక్టర్‌లో కనిపించబోతున్నా. ప్రస్తుతం ఆఫర్స్ వస్తున్నాయి కానీ తొందరపడదలుచుకోలేదు. ఇప్పటివరకు జస్ట్ 'మిస్టర్ మజ్ను'పైనే ఫోకస్‌పెట్టాను. ఇప్పుడు 'ఇస్మార్ట్ శంకర్'. బెస్ట్ అనిపించినదే చేద్దామనుకుంటున్నాను. ఇంపార్టెన్స్ ఉన్న క్యారెక్టర్స్, స్ట్రాంగ్ క్యారెక్టర్స్ చేద్దామనుకుంటున్నాను. నెగెటివ్ కామెంట్స్‌ని కూడా చాలా పాజిటివ్‌గా తీసుకుంటా. కానీ ఆ కామెంట్స్ ఎవరు చేస్తున్నారనేది మాత్రం డెఫినెట్‌గా మ్యాటర్స్. కరెక్ట్ ప్లేస్, కరెక్ట్ పర్సన్స్‌నుండి వచ్చిన కామెంట్స్‌నే పట్టించుకుంటా. 'అర్జున్‌రెడ్డి' సినిమా 4సార్లు చూశాను. ఒకవేళ అవకాశం దొరికితే అలాంటి రోల్‌లో నటించాలని ఉంది అంటూ చెప్పుకొచ్చింది నిధి.



1న 'సకల కళావల్లభుడు'

బీరం సుధాకర్‌రెడ్డి సమర్పణలో సింహా ఫిలిమ్స్, దీపాల ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం -సకల కళావల్లభుడు. తనిష్క్‌రెడ్డి, మేఘ్లా ముక్తా హీరో హీరోయిన్లు. శివగణేష్ దర్శకత్వం వహించిన చిత్రం 1న విడుదలవుతుంది. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో చిత్ర నిర్మాతలు అనిల్, శ్రీకాంత్ మాట్లాడుతూ యాక్షన్, కామెడీల మేళవింపుతో సకల కళావల్లభుడు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఆడియన్స్ ముందుకు వస్తున్నాడన్నారు. టైటిల్‌ను జస్టిఫై చేస్తూ హీరో తనిష్క్‌రెడ్డి బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడని, ఫ్యూచర్‌లో తనిష్క్‌తో మరిన్ని సినిమాలు చేస్తామన్నారు. దర్శకుడు శివగణేష్ మాట్లాడుతూ సినిమా పూర్తైన తరువాత అందరిలో నమ్మకం పెరిగిందన్నారు. అందుకు నిర్మాతల సపోర్ట్, హీరో తనిష్క్‌రెడ్డి పెర్ఫార్మెన్స్ అన్నారు. హీరో తనిష్క్‌రెడ్డి మాట్లాడుతూ కథలో కంటెంట్ ఉంటే ఆదరించి సపోర్ట్ చేసే సినిమా పెద్దలు చాలామందే ఉన్నారు. అలా బీరం సుధాకర్‌రెడ్డి, నిర్మాతలు అనిల్, శ్రీకాంత్‌లు తోడై ఖర్చుకు వెనుకాడకుండా రిచ్‌గా తెరకెక్కించారు. టెక్నీషియన్స్ విజయ్, నాని, ధర్మేంద్రలు బెస్ట్ వర్క్‌ను అందించారు. మ్యూజిక్ అందించిన అజయ్ గురించి చెప్పాల్సిన పని లేదు. సినిమాను భారీగా విడుదల చేస్తున్నామని, ఆదరిస్తారని ఆశిస్తున్నామన్నారు. నటుడు రాజేంద్రకుమార్, మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ పట్నాయక్, నటి అలెక్సా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

థ్రిల్లర్ కథనం



హాట్ యాంకర్ అనసూయ ప్రధాన పాత్రలో అవసరాల శ్రీనివాస్, రణధీర్ ముఖ్య పాత్రల్లో రాజేష్ నాందెడ్ల దర్శకత్వంలో నరేందర్‌రెడ్డి, చుక్కా శర్మ నిర్మిస్తున్న చిత్రం కథనం. టాకీపార్ట్ పూర్తి చేసుకున్న సందర్భంగా రామానాయుడు స్టూడియోస్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశం నిర్వహించింది. కార్యక్రమంలో అనసూయ మాట్లాడుతూ కథను నడిపించే కథనం టైటిల్‌తో వస్తున్న సినిమాలో మంచి పాత్ర చేస్తున్నా. ఇందులో భిన్నమైన పాత్ర. అసోసియేట్ డైరెక్టర్‌గా కనిపిస్తాను. సరికొత్త థ్రిల్లర్ నేపథ్యంలో సినిమా ఉంటుంది. దర్శకుడు రాజేష్ అద్భుతంగా తెరకెక్కిస్తున్నాడు. క్షణం, రంగస్థలం తరువాత ఆ రేంజ్‌లో క్రేజ్ తెచ్చే పాత్ర అన్నారు. రణధీర్ మాట్లాడుతూ ధ్రువ సినిమా తరువాత చాలా గ్యాప్ తీసుకుని చేస్తున్నా. అనసూయతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. తప్పకుండా సినిమా అందరికీ నచ్చుతుంది అన్నారు. నిర్మాత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేను డిస్ట్రిబ్యూటర్‌గా నెల్లూరులో పలు చిత్రాలను పంపిణీ చేశాను. నిర్మాతగా మా మిత్రుడితో కలిసి మంగళ సినిమా తీశా. సోలోగా ఈ సినిమాతో మీముందుకు వస్తున్నాను. దర్శకుడు రాజేష్ చెప్పిన కథ చాలాబాగా నచ్చింది. అందుకే సినిమా తీస్తున్నా. అన్నిరకాల కమర్షియల్ హంగులున్న చిత్రాన్ని సమ్మర్‌లో విడుదల చేస్తామన్నారు. దర్శకుడు రాజేష్ మాట్లాడుతూ సరికొత్త థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న సినిమా ఇది. ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాను. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుందన్నారు.